తిరుమల తిరుపతి దేవస్థానములు

సప్తగిరి

సచిత్రమాసపత్రిక

ఫిబ్రవరి 2017 వెల రూ.5/-




తిరుమల తిరుపతి దేవస్థానములు

శ్రీనివాసమంగాపురం


శ్రీ కల్యాణవేంకటేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవం

2017 ఫిబ్రవరి 16 నుండి 24 వరకు



- **16-02-2017 గురువారం**
  పగలు: ధ్వజారోహణం,
  రాత్రి: పెద్దశేషవాహనం.
- **17-02-2017 శుక్రవారం**
  పగలు: చిన్నశేషవాహనం,
  రాత్రి: హంసవాహనం.
- **18-02-2017 శనివారం**
  పగలు: సింహవాహనం,
  రాత్రి: ముత్యపుపందిరివాహనం.
- **19-02-2017 ఆదివారం**
  పగలు: కల్పవృక్షవాహనం,
  రాత్రి: సర్వభూపాలవాహనం.
- **20-02-2017 సోమవారం**
  పగలు: పల్లకీలో మోహినీ అవతారోత్సవం,
  రాత్రి: గరుడవాహనం.
- **21-02-2017 మంగళవారం**
  పగలు: హనుమద్వాహనం,
  రాత్రి: గజవాహనం.
- **22-02-2017 బుధవారం**
  పగలు: సూర్యప్రభవాహనం,
  రాత్రి: చంద్రప్రభవాహనం.
- **23-02-2017 గురువారం**
  పగలు: రథోత్సవం,
  రాత్రి: అశ్వవాహనం.
- **24-02-2017 శుక్రవారం**
  పగలు: చక్రస్నానం,
  రాత్రి: ధ్వజావరోహణం.

వెలుగు లోపలికి - వెలుగేలా...



తెలియఁ జీఁకటికి - దీపమెత్తక పెద్ద
వెలుఁగు లోపలికి - వెలుఁగేలా? ॥

అరయ నాపన్నుని - కభయ మీవలెఁ గాక
ఇరవైన సుఖిఁ గావ - నేలా?
వఱతఁ బోయెడివాని - వడిఁదీయవలెఁగాక
దరివానిఁ దివియఁగఁ - దానేలా?

ఘనకర్మారంభుని -కట్లు విడవలెఁ గాక
యెనసి ముక్తునిఁ గావ - నేలా?
అనయము దుర్బలుని - కన్నమిడవలెఁ గాక
తనిసిన వానికిఁ - దానేలా?

మితిలేని పాపక - ర్మికిఁ దావలెఁ గాక
హిత వెఱుఁగు పుణ్యుని - కేలా?
ధృతి హీనుఁ గృపఁ జూచి - తిరువేంకటేశ్వరుఁడు
తతిఁ గావకుండినఁ - దానేలా?

(సంపుటం-1, సంకీర్తన-18)

కర్మబంధాలకు అతీతులైన పుణ్యాత్ములు తమ సుకృతబలంతో తామే తరించగలరు. వారికి భగవద్రక్షణ తనకు తానుగానే సిద్ధిస్తుంది కాబట్టి ప్రయత్నపూర్వకంగా పరమాత్ముడు వారిని రక్షించాల్సిన పనిలేదు. పాపాత్ముల పట్లనే భగవంతుడు విశేషించి తన కృపాదృష్టిని ప్రసరింప జేయాల్సి ఉందనడం ఇందులోని సారాంశం.





శ్రీ కపిలేశ్వరస్వామి వారి బ్రహ్మోత్సవాలు, తిరుపతి

2017, ఫిబ్రవరి 16 నుండి 26 వరకు

తేదీలు	వారం	పగలు ఉత్సవం	రాత్రి ఉత్సవం
16-02-2017	గురు	--	మూషికవాహనంపై వినాయకస్వామి అంకురార్పణం
17-02-2017	శుక్ర	(పల్లకీఉత్సవం) ధ్వజారోహణం	హంసవాహనం
18-02-2017	శని	సూర్యప్రభవాహనం	చంద్రప్రభవాహనం
19-02-2017	ఆది	భూతవాహనం	సింహవాహనం
20-02-2017	సోమ	మకరవాహనం	శేషవాహనం
21-02-2017	మంగళ	అధికారనందివాహనం	తిరుచ్చిఉత్సవం
22-02-2017	బుధ	వ్యాఘ్రవాహనం	గజవాహనం
23-02-2017	గురు	కల్పవృక్షవాహనం	తిరుచ్చిఉత్సవం
24-02-2017	శుక్ర	రథోత్సవం	నందివాహనం (మహాశివరాత్రి)
25-02-2017	శని	పురుషామృగవాహనం	(కల్యాణోత్సవం) అశ్వవాహనం
26-02-2017	ఆది	సూర్యప్రభవాహనంలో నటరాజస్వామి త్రిశూలస్నానం	ధ్వజావరోహణం, రావణాసురవాహనం

2017 ఫిబ్రవరి నెల ఉత్సవాలు, పర్వదినాలు

03 రథసప్తమి
07 భీష్మఏకాదశి
10 శ్రీ రామకృష్ణ తీర్థముక్కోటి
04-10 శ్రీ గోవిందరాజస్వామివారి తెప్పోత్సవాలు
16-24 శ్రీనివాసమంగాపురం, శ్రీ కల్యాణవేంకటేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవాలు
24 మహాశివరాత్రి
17-26 తిరుపతి శ్రీ కపిలేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవాలు

2017 మార్చి నెల ఉత్సవాలు, పర్వదినాలు

08-12 తిరుమల శ్రీవారి తెప్పోత్సవాలు
13 శ్రీలక్ష్మీజయంతి
24 అన్నమాచార్య వర్ధంతి
24-28 నాగులాపురం, శ్రీ వేదనారాయణస్వామివారి తెప్పోత్సవాలు
25 మార్చి నుండి ఏప్రిల్ 02 వరకు తిరుపతి, శ్రీకోదండరామస్వామివారి బ్రహ్మోత్సవాలు
29 ఉగాది
30 మత్స్య జయంతి

తిరుమల తిరుపతి దేవస్థానముల సచిత్ర మాసపత్రిక

సప్తగిరి

సంపుటి : 47 ఫిబ్రవరి, 2017 సంచిక : 09



వేంకటాద్రిసమం స్థానం బ్రహ్మాండే నాస్తి కించన ।
వేంకటేశసమో దేవో న భూతో న భవిష్యతి ॥

సప్తగిరి మాస పత్రిక

ఇతర వివరాలకు
0877-2264543

విడి ప్రతి : రూ. 5/-
సం॥ చందా : రూ. 60/-
జీవిత చందా : రూ. 500/-
విదేశాలకు సం॥చందా : రూ. 850/-

ఈ నెలలో....

ముఖచిత్రం : ఉభయదేవేరులతో శ్రీకల్యాణవేంకటేశ్వరస్వామి(శ్రీనివాసమంగాపురం)
వెనుక చిత్రం : పరమేశ్వరుడు (వర్ణచిత్రం)



ప్రత్యక్షదైవానికి ప్రణామాలు

సూర్యుడు జగత్తుకు కన్ను. సూర్యకాంతియే అన్నికాంతులకూ మూలం. సూర్యుడు త్రిమూర్త్యాత్మకపరమాత్ముడు. సూర్యకిరణజన్యసంయోగంచేతనే జీవులు పుడుతున్నాయి, పెరుగుతున్నాయి, నశిస్తున్నాయి. సూర్యుడు ఈ విశ్వానికి ఆత్మ అని వేదం. కనుక సూర్యభగవానునిఆరాధన అత్యంతప్రాచీనమైంది. రాజవంశాల్లో సూర్యవంశం మొదటిది. శ్రీరామచంద్రుడు సూర్యవంశసంజాతుడు. నిత్యమూ సూర్యారాధన చేసేవాడు. ఆదిత్యహృదయపఠనంచేతనే రావణసంహారంకూడా చేయగలిగాడు. సూర్యుడు నమస్కారప్రియుడు. కనుక, సూర్యుడు మనకు చేసేఉపకారాలకు కృతజ్ఞతాసూచకంగా సూర్యనమస్కారం చేయడం సనాతనభారతీయసంప్రదాయం.

వేదాల్లోనే సూర్యదేవునికి సంబంధించిన అరుణమంత్రాలున్నాయి. మనమీనాడు చూస్తున్నసూర్యగోళంలాంటివి ఈ విశ్వాంతరాళంలో మొత్తం పన్నెండున్నాయి. వాటినే ద్వాదశాదిత్యమండలాలంటారు. శ్రీమన్నారాయణుడు సూర్యమండలమధ్యవర్తి. దివ్యతేజోవిరాజితుడు. సూర్యగమనం ఉత్తరాయణం– మకర సంక్రాంతితో ప్రారంభమైనా–మాఘశుద్ధ సప్తమినుండి పూర్తిగా–ఉత్తరదిశగా జరుగుతుంది. ఇది పుణ్యకాలం. ఉత్తరమనే పదానికి జీవుల్ని ఊర్ధ్వముఖుల్ని చేసి, తరింపజేసేదని ఆధ్యాత్మికార్థం. కనుక రథసప్తమి కంటిముందు కన్పించే ప్రత్యక్షదేవుడైన సూర్యభగవానునిపండుగ. దీన్ని మకరసంక్రాంతిపుణ్యకాలంతో సమానంగా భావించి, ఆనాడు పితృదేవతలకు తర్పణాదికం నిర్వహించాలని ధర్మశాస్త్రం. సూర్యుడు జ్యోతిశ్శాస్త్రం రీత్యా నేత్రకారకుడు. అంటే కంటిచూపు, కంటిఆరోగ్యం మొదలైనవన్నీ సూర్యానుగ్రహంచేత చక్కగా శోభిస్తాయి. అంతేగాక 'ఆరోగ్యం భాస్కరా దిచ్ఛేత్'–ఆరోగ్యం సూర్యభగవానునిద్వారా పొందాలని శాస్త్రం. కనుక సూర్యుడు మనజీవితశోభకు, మానసికపురోగతికి, అవయవపటిష్ఠతకు, పాడిపంటలకు, బుద్ధివికాసానికి అన్నివిధాలా అనుకూలించే ప్రత్యక్షదైవం!

నవగ్రహాలలో ఏ గ్రహానికీ లేని నమస్కారవిధానం సూర్యగ్రహానికిమాత్రమే ఉండడం సూర్యునివిశిష్టతకు సంకేతం. సృష్టి జరిపేవాడు గనుకనే ఇతనికి సవిత అని పేరు. గాయత్రీమంత్రం సూర్యతేజస్సంబంధమైందే! ఆ సూర్యుణ్ణి శ్రేష్ఠతముడుగా తెలుసుకోవడం, మన బుద్ధిని చక్కగా నడిపించమని అతణ్ణి ప్రార్థించడం గాయత్రీమంత్రంలోని ఆశయం.

మనప్రాచీనులు రథసప్తమిని సూర్యభగవానునిపర్వదినంగా భావించి భౌతిక, ఆధ్యాత్మికపరంగా సూర్యుణ్ణి ఆరాధించి, త్రికరణశుద్ధిగా సూర్యునికి నమస్కరించి, ఆ నమస్కారంద్వారా సూర్యకిరణాల్లోని దివ్యతేజస్సునూ, చైతన్యశక్తినీ మనం పొందాలి అనే సంప్రదాయాన్ని నెలకొల్పారు. కనుక సూర్యుడు కేవలగ్రహమే కాదు సాక్షాత్‌దేవుడు!

మనం త్రికాలాల్లో సూర్యుడికి ఒక్క నమస్కారం చేయడంవల్లే ఆయన దయామూర్తి అయి మనఆరోగ్యాన్నీ, ఐశ్వర్యాన్నీ సంరక్షిస్తున్నాడు. అల్పసంతోషులైన దేవతలలో సూర్యుడు ప్రథముడు. నమస్కారానికే ఇంత విలువ ఉంటే–ఇక సూర్యమంత్రోపాసన, సూర్యస్తోత్రపారాయణం, అరుణమంత్రపారాయణం మొదలగునవి ఎంతశక్తిమంతాలో, మన జీవితాలపై ఎంత ఉత్తమప్రభావాన్ని చూపుతాయో ఊహించవచ్చు. మనపురాణాల్లో సూర్యుణ్ణి ఆరాధించి ఎందరో మణులు, అక్షయపాత్రలు, భోగభాగ్యాలు సంపాదించి, తాము తరించడమే గాక, లోకాన్నికూడా తరింపజేశారు. కనుక ఉపకారికి ప్రత్యుపకారం చేయడం మనసంప్రదాయం! అందుచేత ప్రతిమానవుడూ కృతజ్ఞతా గుణాన్ని అలవరచుకుని, తమకు ఉపకారం చేసిన, చేస్తున్న మహాత్ములందరికీ హృదయపూర్వకంగా ప్రతిదినమూ ఉదయం తూర్పుముఖంగా నిలబడి సూర్యుణ్ణి చూస్తూ–నమస్కరిస్తే ఆ నమస్కారం అందరికీ చెందుతుంది.

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః

కౌసల్యా సుప్రజా రామా...!

- డా॥ అప్పజోడు వేంకటసుబ్బయ్య, 90148 78108

సుప్రభాతం - శ్రీవేంకటేశ్వరసుప్రభాతం - ఇది తెలియనివారెవ్వరు?
దాదాపు ప్రతిదినం అందరూ వింటూనే ఉంటారు. కొందరు ప్రతిదినం పఠిస్తూ ఉంటారుకూడా!
అలాంటి విషయాన్నిగూర్చి - అంటే అందరికి ఇంతగా తెలిసిన విషయాన్ని గూర్చి వ్రాయటం ఎంత సులభమో, అంత కష్టం!

స్వామివారి సుప్రభాత ఆవిర్భావమే ఒక చిత్రమైన సంఘటన! ఎవరో ఒకరచయిత కాగితం, కలం పట్టుకొని ఆలోచించి ఆలోచించి - పదాలను, పాదాలను ఏర్చి కూర్చి, రూపొందించిన రచన కాదు ఇది. ఒకమహాభక్తుని గుండెలోతుల్లోంచి ఆశువుగా అలా పొంగిపొరలినఅక్షరప్రవాహం! బహుశః స్వామివారిసంకల్పానుసారం వెలికి వచ్చినభక్తి రచనాప్రవాహం.

ఆ మహాభక్తుడే శ్రీఅణ్ణన్- ప్రతివాదిభయంకర అణ్ణన్. ఆయనఅసలుపేరు హస్తిగిరినాథుడు. విశిష్టాద్వైతి. దాదాపు 600 సంవత్సరాలక్రితం ఈ వైష్ణవభక్తుడు తనగురువు గారైన 'మనవాళ మహాముని' వెంట స్వామివారిదర్శనార్థం తిరుమలకు రావటమేమిటి? ఆలయంలో మూలవిరాట్టు ముందు ముకుళితహస్తుడై- తనగురువుగారిప్రక్కన నిలబడట మేమిటి? ఆ గురువుగారు అపాంగవీక్షణాలతో ఈ శిష్యుడివైపు చూచి, 'స్వామివారిమీద సుప్రభాతం చెప్పరాదా' అని అనటమేమిటి? అన్నదే తడవుగ అణ్ణన్ గారు నిలువెల్ల పులకించి, భక్తిభావంతో పరవశించి, ఈ సుప్రభాతాన్ని, స్తోత్రాన్ని, ప్రపత్తిని, మంగళాశాసనాన్ని ఒక్క ఊపున రసోజ్జ్వలంగా చెప్పట మేమిటి? ఈ రచన ఆరువందల సంవత్సరాలుగా- అంతకు ముందున్న 'తొండరప్పొడియాళ్వార్' (విప్రనారాయణుడు) గారి ప్రోబోధిక స్తుతికి బదులుగా - ఒక్క ధనుర్మాసంలో తప్ప (ధనుర్మాసంలో తిరుప్పావై) ఆలయంలో ప్రతిదినం ప్రాభాతిక గీతికలా నినదించట మేమిటి? ఆలయంలోనే కాదు- ఏడు కొండల్లో చెట్టు చెట్టున, గుట్టగుట్టన, పుట్టపుట్టన, బండబండన, కొండకొండన ప్రతిధ్వనించటమేమిటి! ఆ ప్రభాతసమయాన మేతకు వెళ్ళే పక్షులు, జంతువులుకూడ ఒకింత ఆగి, చెవు లప్పగించి విని, తల లూపి, తరలివెళ్ళట మేమిటి! అశేషభక్తజనం ఈ సుప్రభాతాన్ని విని, పఠించి, భక్తిభావంతో పరవశించట మేమిటి?

అంతేనా? ఏ ముహూర్తాన - ఏ రసోజ్జ్వలస్థితిలో అణ్ణన్ గారు ఈ సుప్రభాతాన్ని చెప్పారోగాని - అది దేశమంతటా ఇంటింటా, గాలిలా వీచింది; పరిమళంలా వ్యాపించింది; నీరులా పారింది; కాంతిలా ప్రసరించింది; మధురాతిమధుర గీతికలా నినదించింది. ఇంతెందుకు? స్వామివారిమీద ఎన్నోరచనలు వచ్చాయి కదా-ప్రజానీకంలో ఇంతప్రచారంపొందినరచన ఇంకొకటి ఉందా? ప్రజలహృదయాల్ని ఇంతగా హత్తుకొన్న రచన ఇంకొకటి ఉందా? లేదే!

ఈ భూమిమీద మనిషి ఉన్నంతకాలం అతని జీవితానికి, అతనిజీవితపరమార్థానికి మార్గదర్శకాలైన రామాయణ భారత భాగవతభగవద్గీతలు ఉంటా యని చెప్పవచ్చు. వ్యాసవాల్మీకులు ఉంటారని చెప్పవచ్చు. అలాగే శ్రీవైకుంఠవిరక్తుడైన శ్రీవేంకటేశ్వరుడు ఇక్కడ ఎంతకాలం ఉంటాడో- అంతకాలం అణ్ణన్‌గారి సుప్రభాతం ఉంటుంది; అణ్ణన్‌గారూ ఉంటారు.

ఏమిటి ఈ అణ్ణన్‌గారిసుప్రభాతంలో అంతవిశేషం? అంతవెలుగు! ఇది మహనీయమైన ఒకానొక రసోజ్జ్వలస్థితిలో- ఒకమహాభక్తుడు తాను-తాను కానిస్థితిలో - చెప్పిన సుప్రభాతం. మహర్షులు వేదాలు చెప్పినట్లు, శ్రీకృష్ణుడు గీత చెప్పినట్లు ఈ మహాభక్తుడు స్వామివారిలో సంపూర్ణంగా లీనమై పలికినపలుకులివి. అపౌరుషేయాలని అనిపించేపలుకు లివి. మరోసారి అలా చెప్పండని అడిగితే- ఆనాడు శ్రీకృష్ణ దన్నట్లు అణ్ణన్‌గారే నావల్ల కాదనే పలుకులివి. అందుకే ఈ సుప్రభాతానికి ఇంతవెలుగు; ఇంతఆకర్షణ; ఇంతవ్యాప్తి.

ఒకింతఆలోచిస్తే ఈసందర్భంలో ఆశ్చర్యాన్ని కలిగించే అంశం ఇంకొకటి ఉంది. విశ్వవ్యాప్తవిశుద్ధచైతన్యశక్తిని, నిరాకారనిర్గుణపరబ్రహ్మాన్ని మనం నిద్రలేపట మేమిటి? ఆ పరమాత్మకు మనం రకరకాల అలంకారాలు చేయటమేమిటి? అనేక ప్రసాదాలు అర్పించటమేమిటి? నిజంగా ఆయన నిద్రపోతే ఈ జీవుడు ఉంటాడా? ఈ జగత్తు ఉంటుందా?

ఆనాడు మూలవిరాట్టుముందు నిలబడి, ముకుళితహస్తుడై అణ్ణన్‌గారు సమాధిస్థితు దయ్యాడు. అంతరంగా ఈ కలియుగవైకుంఠంనుండి ఒక్కసారిగ ఆ దివ్యలోకవైకుంఠానికి వెళ్ళాడు. నిద్రాముద్రితుడై పవ్వళించిఉన్నశ్రీమహావిష్ణువును దర్శించాడు. ఆయనలో త్రేతాయుగ శ్రీరాముణ్ణి చూచాడు. ద్వాపరయుగ శ్రీకృష్ణుణ్ణి తిలకించాడు. కలియుగప్రత్యక్ష దైవం శ్రీనివాసమహాప్రభువును కళ్లార కాంచాడు. ఆ స్వామితో ఏమి చెప్పుకోవా లనుకొన్నాడో! కాని, ఆయన నిద్రలేస్తేనే కదా తాను చెప్పుకొనేది. అందుకే ఈ సుప్రభాతం!

అయితే, సుప్రభాతాన్ని ఎలా మొదలుపెట్టాలి? స్వామివారిని ఎలా మేల్కొల్పాలి?- ఆనాడు సరయూతీరంలో శ్రీరామచంద్రుణ్ణి మేల్కొల్పటానికి విశ్వామిత్రమహర్షి చెప్పిన -

కౌసల్యాసుప్రజా! రామ! పూర్వాసంధ్యా ప్రవర్తతే ।
ఉత్తిష్ఠ నరశార్దూల! కర్తవ్యం దైవ మాహ్నికమ్ ॥

– అన్నశ్లోకం మెరుపుతీవలా ఆయనస్ఫురణకు వచ్చింది. వెంటనే ఒక దివ్యస్ఫూర్తితో, రసావేశంతో...

ఉత్తిష్ఠోత్తిష్ఠ గోవింద! ఉత్తిష్ఠ గరుడధ్వజ!
ఉత్తిష్ఠ కమలాకాన్త! త్రైలోక్యం మంగళం కురు ॥

– అని సుప్రభాతాన్ని ఆరంభించాడు.

స్వామివారివక్షఃస్థలంమీద శిరస్సు ఉంచి, అమ్మవారు నిద్రిస్తూ ఉంది. ఆమె లేవకుండ స్వామివారు ఎలా లేస్తారు? అందుకే వెంటనే –

మాతః సమస్తజగతాం మధుకైటభారేః -
వక్షోవిహారిణి! మనోహరదివ్యమూర్తే!
శ్రీస్వామిని! శ్రితజనప్రియదానశీలే!
శ్రీవేంకటేశదయితే! తవ సుప్రభాతమ్॥

– అని ఆ మహాలక్ష్మిని మేల్కొల్పాడు.

అలా చూచాడు. అత్ర్యాదిసప్తర్షులు దోసిళ్ళనిండా పూలు నింపుకొని నిలబడి ఉన్నారు. అవి సామాన్యమైన పూలుకాదు. ఆకాశగంగలో విరబూసినకమలాలు; సుగంధమనోహరాలు. స్వామీ! నీ పాదయుగపూజకు అత్ర్యాదిమహర్షులు వచ్చి, వేచి ఉన్నారని స్వామికి విన్నవించాడు.

స్వామీ! సప్తర్షులప్రక్కనే 'పంచాననాబ్జభవషణ్ముఖవాసవాది' దేవతా ప్రముఖులంతా నీత్రివిక్రమచరితాన్ని స్తుతిస్తూ వేచి ఉన్నారని తెలియజేశాడు. నీదాసాను దాసులుగా నమస్కరిస్తూ దిక్పా లకులు, నవగ్రహాలు నిలిచి ఉన్నా రన్నాడు. అబ్బో! అటువైపు మధురాతి మధురంగా నీచరితను గానం చేస్తూ, విపంచిని మీటుకొంటూ, చేతులాడించుకొంటూ నారద మహర్షి నిలబడి ఉన్నా డన్నాడు.

స్వామీ! ఇటు చూడు. ఏలాల వంగఘనసార సుగంధితాలైన ఆకాశగంగాజలాలను సువర్ణఘటా లలో నింపి, బరువైన ఆఘటాలను శిరస్సునమోస్తూ, వైదికశిఖామణులు నీసేవకొరకు వరుసగా నిలబడి ఉన్నారు. మేలుకో స్వామీ! మేలుకో! అన్నాడు. బ్రాహ్మణోత్తములు అలా బరువుమోస్తూ నిలబడి ఉండడం స్వామి సహించలేడు కనుక, ఆయన త్వరగా లేస్తాడని అణ్ణన్‌గారి ఆశ ఏమో! స్వామి బ్రహ్మణ్యుడు మాత్రమే కాదు; బ్రాహ్మణప్రియుడు కూడ కదా!

స్వామీ! అటుచూడు. తమకు వాహన సేవాభాగ్యమిమ్మని 'విహగరాజ మృగాధిరాజ నాగాధిరాజ గజరాజ హయాధిరాజులు' నిలిచి ఉన్నారు. సేవాభాగ్యమిచ్చి, అనుగ్రహించు.


ప్రభూ! నీవు పరమపురుషుడివి. ప్రకృతిసర్వం నీ సేవకు ఎదురుచూస్తున్నది. దివ్యపరిమళంతో అల్లన చల్లనిగాలి వీస్తున్నది. ఝుంకారనినాదాలతో తేనె త్రావినతుమ్మెదలు వస్తున్నాయి. చిలుకలు ముందురోజు తినగా మిగిలినకదళీఫలపాయసాలను తిని, బంగారుపంజరాల్లో నీనామాలు పఠిస్తున్నాయి. స్వామీ! అన్నింటిని మించి, ఉదయాన్నే గొల్లభామలు కవ్వాలతో పెరుగుచిలికే శబ్దాలు నీకు చాలఇష్టంకదా! ఈ శబ్దాలు వినసొంపుగా ఎలా వినిపిస్తున్నాయో విను. మేలుకో స్వామీ! మేలుకో! అన్నాడు.

శ్రీపద్మనాభ! పురుషోత్తమ! వాసుదేవ!
వైకుంఠ! మాధవ! జనార్దన! చక్రపాణే!
శ్రీవత్సచిహ్న! శరణాగతపారిజాత!
శ్రీవేంకటాచలపతే! తవసుప్రభాతమ్ ॥

అని గొంతెత్తి గట్టిగా పిలిచి, స్వామీ! మేలుకో! అన్నాడు. ఆ భక్తునిపిలుపు స్వామివారిహృదయాన్ని తాకినట్లుంది. ఆయన సుప్రభాతవచనాలు స్వామివారిచెవులను సోకినట్లున్నాయి.

స్వామి లేచాడు. ఆయననల్లటిఎదమీద ఎర్రటికుంకుమ. అదెందుకో ఈ భక్తుడు గ్రహించాడు.

కమలాకుచ చూచుక కుంకుమతో
నియతారుణితాతులనీలతనో!
కమలాయతలోచన! లోకపతే!
విజయీ భవ! వేంకటశైలపతే!



అని స్తోత్రం ప్రారంభించాడు. 'కమలాయతలోచన!' అన్న ఒక్కసంబోధనతోనే నిద్రలేచిన ఆ స్వామివారికళ్ళు ఎంత విశాలంగా ఉన్నాయో, ఎంతఅందంగా ఉన్నాయో లోకానికి తెలియ చెప్పాడు. అంతేకాదు. "స్వామీ! నీవు లేకుంటే నేను అనాథుణ్ణి. అన్నివేళలా నిన్నే స్మరిస్తా- నిన్నే స్మరిస్తా. నన్ను దయచూడు- దయచూడు. నాకు ప్రియమైన దేదో అది ప్రసాదించు" అని వేడుకొన్నాడు.

వినా వేంకటేశం న నాథో న నాథః
సదా వేంకటేశం స్మరామి స్మరామి ।
హరే! వేంకటేశ! ప్రసీద ప్రసీద
ప్రియం వేంకటేశ! ప్రయచ్ఛ ప్రయచ్ఛ ॥

అంతేకాదు. "స్వామీ! ఎంతోదూరంనుండి నీపాదసేవకు వచ్చాను. రోజూ రాలేను. ఇక్కడే ఉండలేను. అందువల్ల ఎప్పుడో ఒకసారి వచ్చి, నిన్ను సేవించుకొన్నా - నాకు నిత్య సేవాఫల భాగ్యాన్ని ప్రసాదించుస్వామీ!" అని ఆశగా వేడుకొన్నాడు.

అహం దూరత స్తే పదాంభోజయుగ్మ -
ప్రణామేచ్ఛయాऽऽగత్య సేవాం కరోమి।
సకృత్సేవయా నిత్యసేవాఫలం త్వం
ప్రయచ్ఛ ప్రయచ్ఛ ప్రభో! వేంకటేశ!

ఈ విన్నపం- దూరదూరప్రాంతాలనుండి వచ్చేభక్తులందరి పక్షాన అణ్ణన్‌గారు ఆ స్వామిని వేడుకొనిందేమో!

ఆత్మజ్ఞానం లేనిమానవుడు తెలిసి చేసినా, తెలియక చేసినా- అతడు చేసేపాపాలన్నీ అజ్ఞానంతో చేసినట్లే! ఆ పాపాలఫలమే అతనిజన్మపరంపర. బాధలదొంతర. అణ్ణన్‌గారు మంచిభక్తిమార్గం లోనే ఉన్నా,

అజ్ఞానినా మయా దోషా నశేషా న్విహితాన్ హరే!
క్షమస్వ త్వం క్షమస్వ త్వం । శేషశైలశిఖామణే!

అని స్వామివారిని వేడుకొన్నారు. ఇది అణ్ణన్‌గారు ఒక్కరే కాదు, అందరు భక్తులూ వేడుకోదగినవేడుకోలు. అందరు భక్తులే కాదు - అందరు మానవులూ వేడుకోవలసినవేడుకోలు.

మేల్కొన్నస్వామివారు లేచి నిలుచున్నట్లున్నారు. వారి పాదాలు దేదీప్యమానంగా వెలుగుతున్నాయి. అణ్ణన్‌గారు ఈ స్తోత్రా లేమిటి? ఈ అభ్యర్థన లేమిటి? సంపూర్ణశరణాగతే కర్తవ్య మనుకొన్నాడు. స్వామిప్రక్కనే అమ్మవారు నిలబడి ఉంది. తనవైపు వాత్సల్యంగా చూస్తూ ఉంది. ఆమె లేస్తేనే కదా ఈ స్వామివారు లేచింది! ఆమె అనుగ్రహిస్తేనే కదా ఈ స్వామివారు అనుగ్రహించేది? అందుకే ముందుగా -

ఈశానం జగతోऽస్య వేంకటపతే ర్విష్ణోః పరాం ప్రేయసీం
తద్వక్షఃస్థలనిత్యవాసరసికాం తత్క్షాంతిసంవర్ధినీమ్ ।
పద్మాలంకృతపాణిపల్లవయుగాం పద్మాసనస్థాం శ్రియం
వాత్సల్యాదిగుణోజ్జ్వలాం భగవతీం వందే జగన్మాతరమ్.

అని, ఆమెకు నమస్కరించి,

శ్రీమన్! కృపాజలనిధే! కృతసర్వలోక!
సర్వజ్ఞ! శక్త! నతవత్సల! సర్వశేషిన్!
స్వామిన్! సుశీలసులభాశ్రితపారిజాత!
శ్రీవేంకటేశచరణౌ శరణం ప్రపద్యే.

అని, స్వామిపాదాలమీదఅట్టే వ్రాలిపోయాడు. ఆ పాదాలను వర్ణించసాగాడు.

ఆయన ఎంతసేపు ఆపాదాలమీద అలా వ్రాలి ఉన్నాడో! ఆ స్వామివారు ఆ పాదాలు కదల్పకుండ ఎంతసేపు అలా నిలబడి ఉన్నారో! అంతా ఒక రసమయస్థితి!

ఆ భక్తుడికి కలియుగవైకుంఠస్పృహ వచ్చింది. ఎంత సేపటికి వచ్చిందో! వెంటనే -

'శ్రీవేంకటనివాసాయ శ్రీనివాసాయ మంగళమ్.'
'శ్రీవేంకటాద్రిశృంగాగ్రమంగళాభరణాంఘ్రయే'
'అతృ ప్త్యమృతరూపాయ వేంకటేశాయ మంగళమ్'
'శ్రీవైకుంఠవిరక్తాయ స్వామిపుష్కరిణీతటే,
రమయా రమమాణాయ వేంకటేశాయ మంగళమ్'

- అని మంగళాశాసనం చెప్పాడు.

అణ్ణన్‌గారిపదప్రయోగాలు కొన్నిఅత్యంతసార్థకాలు. స్వామివారిని 'అతృప్త్యమృతరూప' అనటం ఎంతసత్యమైన మాట! భక్తకోటికి ఎంత అనుభవరమ్యమైనమాట! స్వామివారిని వంద సార్లు చూచినా 'వెయ్యిసార్లు చూచినా' ఏ భక్తుడైనా ఇక చాలు నని తృప్తిపడుతాడా? లేదే! మళ్ళీ మళ్ళీ చూడాలని ఉవ్విళ్ళూరుతాడు. అందుకే ఆయన అతృప్త్యమృతరూపుడు. అణ్ణన్‌గారు తరువాత లౌకికస్పృహ పొందినట్లున్నాడు. ప్రక్కనున్న గురువుగారివైపు చూచి, తృప్తిగా ఒక నిట్టూర్పు విడిచి,

శ్రీమత్సుందరజామాతృమునిమానసవాసినే ।
సర్వలోకనివాసాయ శ్రీనివాసాయ మంగళమ్ ॥

- అని స్వామిముందు సాగిలపడినాడు.

అణ్ణన్‌గారిసుప్రభాతం విని, ఆ వేంకటపతి ఎంత ఆనందించాడో! ప్రక్కనున్న గురువుగారు మణవాళమహాముని గారు శిష్యునిప్రతిభ, భక్తి చూచి, ఎంత మురిసిపోయారో!

భక్తులుమాత్రం అప్పటినుండి ఇప్పటివరకు ఆ సుప్రభాతాన్ని వింటూ, చదువుకొంటూ భక్తిభావపరవశులౌతున్నారు. స్వామివారు ఇక్కడ ఉన్నంతకాలం ఈ సుప్రభాతవైభవం ఈలాగేఉంటుంది.

అణ్ణన్ ధన్యజీవి.

ఆచార్యుడు భీష్ముడు

(ఫిబ్రవరి - 07 భీష్మఏకాదశి సందర్భంగా..)

- బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖశర్మ

ఉత్తరాయణపుణ్యకాలంలో మాఘమాసానికి ఒక ప్రత్యేకత ఉంది. దైవీశక్తులను జాగృతపరచుకొనే మహావకాశం ఈ కాలంలో ఉందని మనశాస్త్రాలు చెబుతున్నాయి. పగలు, శుక్ల పక్షం, ఉత్తరాయణం...

ఈ మూడింటినీ 'కాంతి' మార్గాలు అని భగవద్గీత చెబుతోంది. జ్యోతిర్మండలంలో జరిగే మార్పులు, భూమి సౌరశక్తిని గ్రహించే పద్ధతులు...వీటిని ఆధారం చేసుకొని సూక్ష్మదృష్టిగల మహర్షులు కాలంలో వివిధపర్వాలను ఏర్పాటు చేశారు. 'దేవతలు' అంటే కాంతిశరీరులని అర్థం. సూర్యకాంతి కిరణాల్లో ఉండే చైతన్యవిశేషాలను వివిధదేవతాశక్తులుగా వేదవాఙ్మయం వర్ణించింది. పృథ్విపై వాటిప్రభావం అమోఘం. వాటిని స్పందింపజేసి సత్ఫలితాలు పొందడమే ఆరాధనగా వ్యాప్తి చెందింది.

మాఘమాసంలో సౌరశక్తి నుంచి ప్రసరించే దివ్యత్వం అమోఘం. అందుచేతనే ఈ నెలలో పర్వదినాలన్నీ అత్యంత పవిత్రంగా అనుశాసించారు. రథసప్తమి, భీష్మఏకాదశి, మాఘ పూర్ణిమ, మహాశివరాత్రి ఇవన్నీ మాఘమాసంలోని పుణ్యదినాలు.

ప్రతినెలా ఏకాదశిని వ్రతదినంగా భావించడం మన సంప్రదాయం. అందులో 'మాఘ ఏకాదశి' అత్యంత పవిత్రం అయితే ఈ ఏకాదశిని 'భీష్మ ఏకాదశి' అనడంలో ఒక విశేషం ఉంది.



'మహాభాగవత శిఖామణి' అయిన భీష్మాచార్యుడు ముక్తి నొందిన రోజు మాఘశుద్ధఅష్టమి. అటుతరువాత వచ్చిన మాఘ శుద్ధ ఏకాదశిని భీష్మఏకాదశిగా వ్యవహరించటం సంప్రదాయమైంది.

భీష్మచరిత్ర భారతంలో ఒక సమున్నతశిఖరం. అరి భయంకరుడైన భీష్ముడు - భీషణత్వానికి ప్రతీక. ఈ భీషణత్వం ఇంద్రియనిగ్రహంలోను, అంతశ్శత్రువులను జయించడంలోను ప్రదర్శించి పరిశుద్ధతను సాధించాడు. దేవవ్రతుడనే పేరు కలిగిన ఈ మహాత్ముడు, పితృభక్తిపరుడుగా తండ్రికోసం ఆజన్మ బ్రహ్మచర్యాన్ని అవలంబించాడు. 'భీష్మప్రతిజ్ఞ' జగత్ప్రసిద్ధం. సత్యనిష్ఠకు పేరుపడిన భీష్ముడు కొన్నిసందర్భాల్లో ధర్మాధర్మ నిర్ణయంలో తటస్థంగా ఉన్నా- వాటి వెనుక దైవసంకల్పజ్ఞానం, ధర్మసూక్ష్మాలు హేతువులుగా ఉన్నాయి. ఆ కొద్ది సందర్భాల ఉపేక్షకుకూడా 'అంపశయ్య'లో తనను తాను శిక్షించుకున్న నిర్మలుడు, భీష్ముడు.

ఇంద్రియనిగ్రహానికీ, సత్యనిష్ఠకీ మారుపేరుగా నిలిచిన ఈ పవిత్రచరిత్రుడు అర్జునునితో సాగించిన యుద్ధంలో తగిలిన బాణాలతో అలాగే నేల కొరిగాడు. ఆ బాణాలే శయ్యగా కొంత కాలం గడిపాడు. ఆ సమయంలో మహర్షులంతా ఆయన్ను పరివేష్ఠించి ఉన్నారు.

లోకరక్షణకు విష్ణుసంకల్ప ప్రణాళికలో భాగంగా భూమికి దిగిన ఈ వసుస్వరూపుడు సర్వధర్మాలనిధి, త్రికాలజ్ఞుడు. ఈ 'త్రికాలజ్ఞ' లక్షణంతోనే దైవసంకల్పానికి అనుగుణంగా వ్యవహరించాడు.

ఈయన అంపశయ్యపై ఉండే సమయంలో శ్రీకృష్ణుణ్ణి ధ్యానిస్తూ యోగంలో ఉన్నాడు. ఒక ధర్మవేత్త లోకాన్ని వదలి వెళుతున్న వేళ ఆయన నుంచి తరవాతి తరాలకు విజ్ఞానసంపద అందాలని నిర్ణయించుకున్న కృష్ణుడు, ధర్మరాజాదులతో శరతల్ప గతుడైన భీష్ముణి చేరుకున్నాడు.

నెయ్యము గల చోటికి నేరమి రాదు

ఒక మహాకాలంలో ఎంతో లోకాన్ని దర్శించిన అనుభవం, శాస్త్రాలను ఆపోశనపట్టిన ధార్మికవిజ్ఞానం ఆయనతోనే అంత రించిపోకూడదని కృష్ణసంకల్పం.

పాలించే బాధ్యతను చేపట్టిన యుధిష్ఠిరునకు ఆయన ఆ ధర్మసంపదనంతా అందించాలని ఆదేశించాడు – పరమాత్మ. యుద్ధంతో అలసి, క్షతగ్రాతుడై ఉన్న తాను బుద్ధిని ఏకాగ్రం చేసి, సూక్ష్మాంశాలతో విషయాలను వివరించే శక్తిలేని వాడిననీ, కనుక ఆ ధర్మాలను శ్రీకృష్ణునే వివరించమని వేడుకుంటాడు భీష్ముడు.

కానీ ముకుందుడు, "తాతా! నీకు అమోఘమైన శారీరక, బుద్ధిశక్తులను అనుగ్రహిస్తున్నాను. వాటితో నీవు నీ అనుభవ సారాన్ని, ధర్మసూక్ష్మాలను నీ మనుమడు ధర్మరాజుకు అందించు" అని బోధించాడు.

ఒక తరం తన తరువాతి తరానికి అందించవలసింది ధర్మాన్నీ, జ్ఞానాన్నీ, అనుభవసారాన్నీ. అంతేగానీ ఆస్తిపాస్తులను మాత్రమే కాదు. ఈ సందేశమే భీష్ముని ద్వారా ధర్మజునికి ధర్మోపదేశం చేయించడంలోని పరమార్థం.

అప్పుడు భీష్ముడు ఉపదేశించినసూక్ష్మధర్మాలు, మోక్ష ధర్మాలు మహాభారతంలో శాంతి, ఆనుశాసనికపర్వాలుగా అతి విస్తారంగా విరాజిల్లాయి. మహాభారతం వేదాలసారమైతే, ఈ రెండు పర్వాలు (భీష్మబోధ) భారతానికి సారం.

ఇందులో పాలనధర్మాలు, రాజధర్మాలు, వ్యక్తిధర్మాలు, లోకరీతులు, ఉపాసనరహస్యాలు, తత్త్వచింతన...అన్నీ కలబోసు కుని కనబడతాయి. అంటే భీష్ముడు ఒక సమగ్రమానవుడిగా ఈ బోధద్వారా మరోమారు నిరూపించుకున్నాడు.

తాత్త్వికచింతన, ధార్మికానుష్ఠానం, దృఢభక్తి, ఇంద్రియ నిగ్రహం–ఇన్ని సులక్షణాలు రాశిపోసుకున్న కారణంగా భీష్ముడు భగవానునికి అత్యంత ప్రీతిపాత్రుడయ్యాడు. ఆచరించి, ఆచ రింపజేసేవాడు ఆచార్యుడు. ఆయనపేరున ఒక మహాపర్వమే ఏర్పడింది. ఆ పర్వంలోనిదే భగవద్గీత.

యావద్భారతజాతీ సంస్మరించదగిన భీష్మాచార్యు నికి వందనం!



మారేడు చెట్టు, మారేడు పత్రి విశిష్టత

మహాలక్ష్మికి 'బిల్వ నిలయా' అని నామ ముంది. అందుకే మారేడును 'శ్రీఫలా' అని కూడా పిలుస్తారు. బిల్వపత్రాలతో పూజ శివునికి ప్రీతికరం. శ్రీమహాలక్ష్మి తపః ఫలంగా ఆమె కుడిహస్తం నుండి బిల్వవృక్షం అవతరించి 'శ్రీఫలా' అని పిలువబడింది. వైఖానస, పాంచరాత్రాగమ సంహితల్లో బిల్వపత్రం కూడా పేర్కొనబడింది. వేదకాలం నుండే దేవతలచే పూజింపబడుతూ మారేడు చెట్టు శ్రీవృక్షమని పేరు పొందింది. త్రిగుణరూపాలైన త్రిదళాలతో త్రిమూర్తు లకు ప్రీతిపాత్రమై 'వేదత్రయీ' అని బిల్వవృక్షం ప్రసిద్ధి పొందింది. దేవతలు దీన్ని మక్కువతో నందన వనా నికి తీసుకువెళ్లారట. బిల్వం జ్ఞానప్రదమని, ఐశ్వర్య దాయకమని పురాణసూక్తి. మూడుదళాలుగల మారేడుఆకులు మంచివాసన కలిగి ఉంటాయి అయితే, ఈ చెట్టుకు పొడవైన ముళ్లుంటాయి. ఈ దేవవృక్షాన్ని సాధారణంగా ఆలయాలలో పెంచు తారు. శ్రీసూక్తంలో కూడ బిల్వవృక్ష ప్రస్తావన ఉంది. మారేడుచెట్టులో ఔషధంగా ఉపయోగపడని వస్తువు లేదు. దీని వేరు ఆకలిని, జీర్ణశక్తిని వృద్ధి చేస్తుంది. ఆకులు మధుమేహాన్ని తగ్గిస్తాయి. తులసిలాగా మారేడుదళాలను కూడా, అవి లభ్యం కాని రోజున, ఆ ముందు రోజు నిర్మాల్యాన్ని కడిగి, పూజలో వాడు కోవచ్చు.



తిరుమల విశిష్టత

- బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావుశర్మ

(వివాహాలెలా ఉంటాయో వేంకటాచలంలో వేంకటేశ్వరకల్యాణంలో మొదట చూపించారు. కలియుగంలో వివాహమంటే ఎంత ధనవంతుడైనా ఒకరూపాయి అయినా అప్పు చెయ్యవలసిందే. ఇదే సమస్య శ్రీవేంకటేశ్వరునికీ వచ్చింది. ధనపాలుకుడైన కుబేరుడు శ్రీనివాస కల్యాణానికి కావలసిన ధనం సమకూర్చడం ఈ సంచికలో...)

అప్పుచెయ్యమని అంటే వేంకటేశ్వరస్వామి నాకెవరిస్తారు అప్పు? అన్నారు. అప్పుచేసేటప్పుడు పెళ్ళికొడుకు పదిమందిముందు అప్పు చేస్తే పిల్లనిచ్చేవాళ్లకు అనుమానం వస్తుందని, కొంచెం చెట్టు చాటుకు వెళ్లి మాట్లాడుకున్నారు. ఆదివరాహస్వామిక్షేత్రంలో అశ్వత్థవృక్షంకింద మాట్లాడుకున్నారు. పరమశివుడు మనదగ్గర డబ్బు లేకపోయినా ఫరవా లేదు కానీ, నాకు బాగా డబ్బుకల స్నేహితుడు ఉన్నాడు.


“నా పక్కన ఎప్పుడూ కుబేరుడు ఉంటాడు. ఆయనను పిలిచి నీకు అప్పు ఇవ్వమని చెపుతానన్నాడు. కుబేరుని పిలిచి శ్రీనివాసునికి అప్పు కావాలి ఇవ్వమని అడిగారు. ఆయన మీకు అప్పు ఇవ్వడానికి లోటేముంది? ఇది కలియుగం కాబట్టి వడ్డీ పుచ్చుకుంటాం. అది తప్పేమీ కాదు. అందు వల్ల వడ్డీ ఇస్తే అప్పు ఇస్తానని అన్నారు.

వేంకటేశ్వరస్వామి ఆశ్చర్యపోయి “యుగధర్మంకు ఎవరైనా కట్టుపడవలసిందే, అలాగే వడ్డీ ఇస్తాను” అంటే, ఎంత అప్పుకావాలని అడిగారు.

‘ఋణగ్రాహీ శ్రీనివాసః, ఋణదాతా ధనేశ్వరః’ అని ప్రామిసరీ నోటు వ్రాశారు. ఇప్పటికీ ఆదివరాహస్వామి క్షేత్రానికి వెళితే ఎడమ పక్కన గోడమీద అద్దం కట్టి ఉంటుంది. మనం కావాలంటే చదువవచ్చు. హేవిలంబీ నామ సంవత్సరే చైత్రశుద్ధదశమి ఫలానావారంనాడు అశ్వత్థవృక్షం కింద నిలబడి పదునాలుగులక్షల రామచంద్ర మూర్తిముద్రలు కలిగిన బంగారుకాసులను ప్రతినూరు కాసులకి ఒక కాసు వడ్డీ ఇచ్చేటట్లు, యుగాంతమయ్యాక అసలు తీర్చేటట్లు నోటు వ్రాసి ఇచ్చి, “అయ్యా! డబ్బు ఇమ్మని” అడిగారు. నోటు వ్రాసి ఇచ్చినందుకు సంతోషమే కాని యుగధర్మం కనక సాక్షి ఉంటే డబ్బు ఇస్తాను అన్నాడు– చతుర్ముఖబ్రహ్మ వంక చూస్తూ. ఆయన నేను సాక్షి సంతకం చేస్తానన్నాడు. ఒక సాక్షి, ఒక కొడుకు ఉన్నా, ఉండకపోయినా ఒకటే. ఏమి అనుకోకుండా ఇంకొక సాక్షి సంతకం కావాలి అన్నాడు. వేంకటేశ్వరస్వామికి నమ్మకమైన స్నేహితుడైన పరమశివుని వంక చూస్తే తాను చేస్తాను – అన్నారు. మీరు పెడితే మాకేం, తప్పకుండా ఇచ్చేస్తానన్నాడు – కుబేరుడు. పరమశివుడు సాక్షి సంతకం పెట్టాడు.

కుబేరుడు ముగ్గురుసంతకం పెడితే ఎంత బాగుం దునో, చాలా బలంగా అన్నాడు. అప్పిచ్చేవాడు ఎంత అందంగా మాట్లాడతాడో వేంకటేశ్వరకల్యాణంలో చూపిం చారు. ఇచ్చేటప్పుడు ప్రకటనలు ఒకలా ఉంటాయి. నిజంగా డబ్బు ఇచ్చేటప్పుడు చాలా తర్కపూరితంగా ఉంటుంది.

మూడోవారు ఎవరా! అని తల పైకి ఎత్తి చూస్తే అశ్వత్థవృక్షం కనపడింది. దానికన్నా ధర్మమూర్తి వేరొకరు ఉండరు. “నేను పెడతాను మహాప్రభో!” అని ఆ వృక్షం కూడా సంతకం పెట్టింది. ముగ్గురుసాక్షులు సంతకాలు పెట్టాక అప్పిచ్చాడు. అప్పుడు సరుకులు తెప్పించారు. ఇదంతా నిజంగానే జరిగింది. స్వామి వింటున్నారు – అబద్ధం చెప్పకూడదు. స్వామికల్యాణం చదివితే కలి యుగంలో కల్యాణం చెయ్యడమెంత కష్టమో తెలుస్తుంది. అన్నీ తెచ్చాక ఇవన్నీ తెచ్చుకోవడం ఒక ఎత్తు, వచ్చేవాడు మన ఇంటికి భోజనానికి లేక వస్తాడా? ఇప్పటికిప్పుడు



ముహూర్తం పెట్టుకుంటే వంటబ్రాహ్మణుడు ఎక్కడ దొరుకుతాడు? అనుకున్నారు. స్వామి అగ్నిహోత్రునివంక చూస్తే నేను చేస్తాను స్వామి అన్నాడు. పాత్ర సామానులేవి? పెళ్లికి వెళ్ళేటప్పటికి లేనివి అడిగే బంధువులు, మనశ్శాంతి లేకుండా చేసేవాళ్ళు, దిక్కుమాలిన సలహాలు ఇచ్చేవాళ్లు బోలెడంతమంది ఉంటారు.

అగ్నిహోత్రుడు పాపనాశనంలో పైన చింతపండు పిసికి పోసేయండి. కింద నేను పులుసు చేసేస్తాను అన్నాడు. తీర్థాలన్నిటి లోనూ పప్పులు, పులుసులు, చక్కెరపొంగళ్లు, కట్టుపొంగళ్లు, జీలకర్ర, పొంగళ్లు, ఎన్నో రకాల పొంగళ్ళు, పులిహోర పొంగళ్ళు, చేసారు. వడ్డన చేయాలి కూర్చోమని అన్నారు. విస్తరిలో బూరె వేస్తే బాగా వంగి అందుకునేంత పెద్ద విస్తళ్లు. పత్రవిస్తీర్ణ భోజనం అన్నారు. భోజనాలబంతులు వేంకటాచలంనుండి శ్రీశైలంవరకు వేశారు.

వచ్చిన వాళ్ళందరూ కూర్చుంటే, "అయ్యా! ఆలస్యమై పోయింది. అందరూ సుష్టుగా ఆనందంగా ఆరగించండి. మావల్ల అపరాధమేమన్నా ఉంటే క్షమించండి" అని వేంకటేశ్వరస్వామి, వకుళమాత అన్నారు. ఇంటికి పెళ్లి భోజనానికి వచ్చినవారు సంతోషపడిపోరు. ఎన్ని పెట్టినా గుమ్మడివడియం ఉందా? అని అడుగుతారు. అందుకని కన్యాదాత ముందే చెపుతాడు. "అయ్యా! మీకు భోజనం పెట్టగలిగినవాడినా? ఉన్నదాంట్లో తీసుకుని వచ్చి పెట్టగలిగాను. మీరు దీంతో తృప్తిపొందండి. చంద్రునికి నూలు పోగులా" అంటే ఎంత గొప్పభోజనం పెట్టినా ఏదో సర్దుకుందా మని అంటారు. అందరూ భోజనాలు చేసి, బ్రేవుమని త్రేన్చి కూర్చున్నారు. అందరినీ భోజనమైందా అని పేరు పేరునా అడిగిన తరువాత స్వామి, వకుళమాత, మన్మథుడు భోజనం చేశారు.

ఇంటికి వచ్చిన అతిథులు భోజనం చెయ్యకుండా ఇంట్లో వారు భోజనం చెయ్యకూడదు. వచ్చిన అతిథులను శాస్త్రప్రకారం ఎలా తినాలో నేర్పారు – 'శ్రీనివాసకల్యాణం'లో. అలా భోజనాలు పెట్టిన తరువాత అందరూ ఆకాశరాజువిడిదికి బయలుదేరారు. మధ్యలో శుకబ్రహ్మాశ్రమం కనపడింది. ఆయన మా ఇంట్లో ఆతిథ్యం స్వీకరించమని పిలిచారు. కొద్దిగా పులుసు అన్నంపెట్టారు. ఋషులకు కోపం వచ్చింది. వేంకటేశ్వరస్వామి భోజనా నికి వస్తే పులుసుఅన్నం పెడతావా? శపిస్తామని కమండలంలోని నీరు చేతిలోకి తీసుకున్నారు. అలా ఉంటాయి రోజులు.

(ఇంకా ఉంది)

(ఫిబ్రవరి - 24 మహాశివరాత్రి సందర్భంగా..)



ఆ తల్లి మాంగల్యబలం..!

- డా॥ కంపల్లె రవిచంద్రన్,
98487 20478

కం॥ మ్రింగెడువాఁడు విభుం డని,
మ్రింగెడిదియు గరళ మనియు, మేలని ప్రజకున్,
మ్రింగు మనె సర్వమంగళ
మంగళసూత్రంబు నెంత మది నమ్మినదో! ॥

(పోతనభాగవతం-8 - 241)

క్షీరసాగరాన్ని అమృతంకోసం దేవదానవులందరూ చేరి మథిస్తున్న సమయంలో లోకాల్ని దహించే గొప్ప విషం పుట్టింది. దేవతలందరూ విషభయంతో దిక్కుతోచక, శివుణ్ణి ప్రార్థించారు. "ఈ విషాన్ని త్రాగి లోకాల్ని రక్షించు" మన్నారు. నీవే ఇందుకు సమర్థుడన్నారు.

భోళాశంకరుడైన పరమశివుడు "హాలాహలాన్ని భక్షిస్తాను. మధురమైన చిన్నపండురసంలాగా త్రాగేస్తాను. ప్రాణుల్ని రక్షిస్తా. పార్వతీ! నీవు చూస్తూండు-" అని, విషాన్ని త్రాగడానికి సిద్ధపడ్డాడు.

"సరే! ఏ భార్యఅయినా తనభర్తను విషం మ్రింగమంటుందా? దేవతలే ప్రార్థిస్తే మాత్రం పార్వతి ఎలా అంగీకరించింది?" అని పరీక్షిత్తు శుకమహర్షిని అడిగాడు. అందుకు శుకమహర్షి సమాధానమిస్తూ...

"మ్రింగేవాడు తన ప్రాణేశ్వరుడనీ, మ్రింగేది విషమనీ, ఇందువల్ల ప్రాణులకు మేలు జరుగుతుందనే శుభభావంతో సర్వమంగళ అయిన పార్వతి - విషాన్ని మ్రింగండని శివుణ్ణి కోరింది. ఔరా! ఆమె తన హృదయంలో శివుడు కట్టిన తన మాంగల్యాన్ని ఎంతగా నమ్మిందో కదా!" అన్నాడు. ('ఎంతగా' అనే మాట - అనంతంగా అనే అర్థంలో ఎంతకాలమైనా ఉంటుంది.)

అమ్మవారు సర్వమంగళ - అంటే 'సమస్తమైన శుభాలూ కలది' అని వ్యుత్పత్తి. శివుడు అభవుడు - ఆయనకు పుట్టుకే లేదు. ఇక గిట్టడం ఎక్కడ? స్వయంభూమూర్తి. పైగా మృత్యుంజయుడు' కనుక ఆయనకు మరణం అనేది లేదు. ఇక అమ్మ 'సర్వమంగళ' ఆమెకు అమంగళత్వం అనేది ఎన్నడూ ఉండదు. తాను సర్వమంగళ అయి లోకాలకు సర్వ మంగళాలు ప్రసాదించే లోకమాత!

అందుకే ఆమె 'ఉమ'- 'అవతీతి ఉమా- రక్షించేది' అని వ్యుత్పత్తి. భర్త పోతేగదా మంగళసూత్రానికి ప్రమాదం. ఆయనకు మరణమే లేనపుడు ఇక పార్వతికి హాలాహల విషంవల్ల భయందేనికి? ఆమెమెడలో శివుడు కట్టిన మంగళసూత్రం - మహాప్రళయంలోనూ యథాతథంగా ఉంటుంది.

శ్రీలలితాసహస్రనామావళిలో "కామేశబద్ధ మాంగల్యసూత్ర శోభిత కంధరా" అని ఉంది. కాముణ్ణి జయించిన మహాజ్ఞాని శివుడు కట్టిన మంగళసూత్రంతో అమ్మ వారి కంఠం శోభిస్తూంది. ఆ శోభ సత్యం! నిత్యం!

ఆనాడు ఆ తల్లి తన మాంగల్యం భద్రమైందని స్థిరంగా తెలిసింది కనుకనే స్వామిని విషపానానికి సంతోషంగా అంగీకరించింది. అందుకే ఇప్పటికీ ముత్తైదువలకు పసుపు, కుంకుమ ఈయగానే మొట్టమొదట మాంగల్యానికి పెట్టి, తర్వాత నుదుట ధరిస్తారు. ఇలాచేయడం ఈ సూత్రం కట్టిన భర్త దీర్ఘాయుష్మంతుడై ఉండి, తాను దీర్ఘసుమంగళిగా జీవించాలని ఆమె ఆశయం! అమ్మవారికి 'పెద్దముత్తైదువ' అని పేరు.

పుక్కిట పట్టవచ్చునా పొంగే సముద్రము

అమ్మ లోకజనని కనుక తన బిడ్డల్ని విషభయం నుండి రక్షించే బాధ్యతలో తానూ ముఖ్యపాత్ర వహించాల్సిందే కదా! శివునికి ఇదంతా తెలిసినా మాంగల్యబలప్రభావం లోకానికి స్పష్టంగా తెల్పడంకోసమే ఆయన అమ్మవారితో – లోకక్షేమం కోసం హాలాహలం మ్రింగుతానన్నాడు.

ఇది జరిగింది మాఘబహుళచతుర్దశినాటిరాత్రి. శివుడు హాలాహలాన్ని మ్రింగి విశ్వానికి 'శివం' మంగళం కల్గించిన రాత్రికనుక 'శివరాత్రి' అయింది. రాత్రి అంటే 'దుఃఖాన్ని తొలగించేది' అని అర్థం. శివాశివుల్ని భేదదృష్టితో చూడలేం కనుక వారిద్దరూ వాక్కు, అర్థంవలె అన్యోన్యాశ్రయులు. పర స్పరం– అర్ధదేహులు. హాలాహలభక్షణంతో లోకాలకు సర్వమంగ ళాలు కలగడానికి కారకుడు శివుడైనా, అంతర్గతంగా సర్వ మంగళయొక్క మాంగల్యమే జగద్రక్షగా నిల్చింది – కనుక శివరాత్రి అమ్మవారిమాంగల్యశోభకు దృష్టాంతం! శివుని మహాశక్తిమత్త్వానికి సంకేతం!



ఆదిశంకరులు సౌందర్యలహరి స్తోత్రంలో "అమ్మా! మహాప్రళయంలో దేవతాప్రముఖులందరూ లయించినా – నీభర్త ఒక్కడే మిగిలి ఉంటాడు. ఇదంతా తల్లీ! నీ కమ్మలమహిమే" (28శ్లో) – అన్నాడు కనుక అమ్మవారి ఐదవతనం మహా ప్రళయంలోనూ స్థిరంగా ఉంటుంది.

అందుకే స్వామిని విషాన్ని మ్రింగడానికి ధైర్యంగా, ఆనందంగా అంగీకరించి, ప్రోత్సహించి – శివపార్వతులు లోకంలో విశిష్ట మంగళమూర్తులై నిల్చారు.

"శివమస్తు సర్వమ్"

శ్రీకాళహస్తి విభుడు



సీ. దక్షిణామూర్తియై తనరారు నొకపరి
శ్రీహయగ్రీవుడై చెలగునొకట
శారదామాతయై సాక్షాత్కరించును
గణపతిదేవుడై కానవచ్చు
శ్రీచక్రరూపమై చెన్నొందు నొకచోట
గాయిత్రిదేవియై ఘనతఁ గాంచు
వేదస్వరూపమై విలసిల్లు నొకయెడ
ఉపనిషత్సారమై యుండునొకట

తే.గీ. సకలమూర్తుల సారమౌ సాంబమూర్తి
తన నిరాకార సాకార తత్త్వములను
వాయులింగంబుగా జూపి భక్తతతుల
నాదుకొనుచుండు శ్రీకాళహస్తివిభుడు

చం. చెలదియొకండు తంతువులఁ జెసెను మంటప గోపురాళి కో
వెలలను దాని ప్రేమఁగనవే దహనంబొనరించినావు దీ
పులనిడు దీపవహ్ని నిడి, పూర్ణనిరాశను నూర్ణనాభి కీ
లల వెలయించు దీపమును లావున మ్రింగెడు నంతబ్రోవవే

– ఆముదాల మురళి, 94404 32683

(గతసంచిక తరువాయి భాగం...)

రామచంద్రా! రంగనాథ! నన్ను దర్శించడానికోసం రోజూ వచ్చేవారు చోరులా? వేదాలను అపహరించిన రాక్షసుణ్ణి సంహరించిన మత్స్యావతారుణ్ణి మాధవుని సదా స్మరించే వైష్ణవులు దొంగలా? కాదు కాదు. మీ మాటలు సుతరామూ వినలేకపోతున్నా. నాకు నచ్చనివి, మనసా అంగీకరించనివార్తలు వినిపించడానికి మీకు నోళ్ళెలా వచ్చాయి? నా అంతరంగం తెలిసి ఇలా మాటలాడడం, ఫిర్యాదు చేయడం జీర్ణించుకోలేకపోతున్నా!

వైష్ణవులమీద నిందవేస్తారా? ఇది మీ తప్పుకాదు. ఆ నింద వేయడానికి కారణమయిన నాలుక ఇచ్చిన బ్రహ్మదేవునిదే దోషం. మిమ్మల్ని శిక్షించవచ్చు. కాని రాజు తన కిష్టం లేనివారిని చంపించినాడనే నింద, ప్రచారమూ రెండూ నాకు తప్పవు. ఈ విపత్కరమయిన పరిస్థితులలో ఒకటే పరమోపాయం. 'శ్రీ వైష్ణవులు చోరులు కారు. ఇందుకు శ్రీరమావిభుడే సాక్షి' అని నేనే అందరికి తెలియజేస్తా. వైష్ణవులంటే ఎవరనుకొన్నారు? పరధనం, పరనింద, పరవధూజనాన్ని కోరనివారు. వాటికి ఇష్టపడనివారు. అయినా మీతో మాటలెందుకు? దేవతలే దిగ్భ్రాంతి పడేలా వైష్ణవచోరకులు లేరని క్రూరసర్పం చేతబట్టి నిరూపిస్తా. నేను శ్రీవైష్ణవులకు బంటును. వారలపై వచ్చిన అపవాదాల్ని వారిస్తా. ఈ అపవాదం తొలగించక పోతే స్వామిద్రోహం చేసినట్లే.

'సేవకులార! లెండి 'కర్కోటకం' అనే పేరుగల విషనాగాన్ని ఒక కుంభంలో ఉంచండి' అన్నారు.

సేవకులు రాజుఆజ్ఞపాటించారు. పాము ఉంచిన కుండను తెచ్చారు. కుండలో బంగారం గుటిక వేశారు. కులశేఖరులు స్నానం చేశారు. చుట్టూవున్న వారందరితో–



'ఎపుడో విన్నాం. ఈ మాట వినకూడదని అనుకోకండి. శ్రద్ధగా వినండి ఇదే నా ప్రతిజ్ఞ. మన్మథజనకునిపాదభక్తులయిన వైష్ణవులు నా సొమ్మును వంచించి హరించినవారు కారు. ముమ్మాటికి కారు కారు – అంటూ కర్కోటకసర్పముండే కుంభంలోని 'బంగారుఘుటికను' చేత ఎత్తినారు. అందరికి చూపించారు. ఆ సందర్భంలోనే రంగనాయకుడు ప్రత్యక్షమయ్యాడు.

భాగవతోత్తంస! పరిపూర్ణహృదయా! నాకన్నా నీవే భాగవతభక్తిపట్ల విశ్వాసం గలవాడివి. నీ భక్తికి మెచ్చాను. ఏదయినా వరం కోరుకో! తప్పక అనుగ్రహిస్తాను' అన్నారు. కులశేఖరులు స్వామిపాదాలపై వాలి, స్తోత్రం చేశారు.

'దశరథ నందన! అవనిజా రమణ! స్వామి! రాఘవా! నీవు ప్రత్యక్షమయ్యావు. అదే చాలు. నేనొక ప్రబంధాన్ని అర్పిస్తాను. లోగడ నీవే అన్నీ ఇచ్చావు. అయినా కోరుకొంటాను. నీ పట్ల అచంచలమయిన భక్తి నాకెప్పుడూ ఉండనీ. ఇదొక్కటే చాలు' అన్నాడు.

తదనంతరం స్వామి

కులశేఖరా! నీ ముద్దులపట్టిని. నీలాంశజురాలిని నాకు అర్పించు' అన్నాడు.

కులశేఖరులు మురిసిపోయారు.

జగదేకమాతను తన ముద్దులబిడ్డను 'అనుపమలగ్నంలో' పెళ్ళికూతురుగా చేశాడు.

ఆ వివాహానికి దేవగురుడే వచ్చాడు. సురరాజు వేంచేశాడు. సుముహూర్తము బృహస్పతి ప్రకటిస్తుంటే కులశేఖరులు రంగనాథులకు తన 'నీళను' అర్పించాడు. త్రేతాయుగంలో జనకుడు శ్రీరామునికి కానుకలిచ్చినట్లుగా రంగనాథునికి అసంఖ్యాకమైన కానుకలిచ్చారు కులశేఖరులు.

చెప్పరాని మాటలు చెవియొగ్గి వినరాదు

ఆ సందర్భంలోనే మంత్రులు మహారాజుతో తాము చేసిన నేరం చెప్పారు. దాచిన సొమ్మును భయంతో అర్పించారు.

'మీ మహిమ తెలియక చేసిన అపరాధాన్ని క్షమించుడని' వేడుకొన్నారు.

'ఎందుకు భయపడుతున్నారు? ఇందులో మీ ప్రమేయం ఏదీ లేదు! అంతా శ్రీ కాంతాధీశుని చిత్తప్రకారం జరుగుతాయి' అన్నారు. ఆపై కులశేఖరులు తనరాజ్యానికి కుమారుణ్ణి రాజుగా పట్టంకట్టి వైష్ణవసమూహంతోనే ఉంటూ హరినే సేవిస్తూ కాలం గడపసాగారు.

కులశేఖరులకు 'శ్రీమద్రామాయణం' ప్రాణప్రదం.

ఆకారణంవల్ల పురోహితులు రోజూ రామాయణాన్ని, శ్రీమద్రామయణార్థాన్ని విశదం చేస్తుంటే భక్తితో అనురక్తితో వినే వారు. రామాయణం వింటున్నంతసేపు పూర్తిగా రసనిమగ్నులై సర్వస్వం మరచిపోయేవారు. ఒక రోజు పురోహితులు శ్రీమద్రామా యణంలో 'సీతాపహరణం' విశదీకరిస్తున్నారు.

ఆ మరుసటిరోజు పురోహితులవారు దగ్గరివూరికి ప్రయాణంకట్టవలసి వచ్చింది. అంచేత తన కుమారుణ్ణి రాజుకు పురాణం వినిపించమని ఆదేశించాడు. తండ్రిఅనుమతితో పురోహిత పుత్రుడు కులశేఖరులవారి దగ్గరికి వెళ్ళాడు. కులశేఖరులు ఆర గించి మణిమంటపంలో ఆసీనులయ్యారు. ఆతని చుట్టు హితులు, మంత్రులు, పురోహితులు, బంధువులు, సుతులు, వైష్ణవులు, రాజు లున్నారు. శ్రీరామకథవినడానికోసం వేచివున్నారు.

పురోహిత పుత్రులను రానిచ్చారు.

పురోహితపుత్రులు ప్రవేశించి 'సంతతభక్తి రస్తు' అని ఆశీర్వదించారు. అక్షతలు ప్రసాదించి వారిఅనుమతితో ప్రవచనం సాగించారు. ఆ ప్రవచనం ప్రవచనం కాదు. సాక్షాత్కారరూపంగా సాగినకథనం. పురోహితపుత్రులు మారీచునికథ చెప్పాడు. తదనం తరం సీతాపహరణం కళ్ళకు కట్టేలా వినిపించాడు.

ఈ కథను వింటున్న కులశేఖరులు భక్త్యావేశంలో ఊగి పోయారు.

సింహాసనం నుండి ఉరికారు. నరసింహమూర్తిలా రౌద్రో ద్రేకంతో ఊగిపోయారు. కళ్ళల్లో నిప్పులు కురుస్తుంటే 'శ్రీరామ చంద్రులవారికి ద్రోహం చేసిన దుష్టుణ్ణి శిక్షిస్తాను. దేవతలు అడ్డం వచ్చినా నేను వదలను. నా కన్నతల్లి సీతమ్మను విడిపించి శ్రీరాములవారి దగ్గరికి చేరుస్తాను" అంటూ పరిచరులను చూస్తూ–




'పరిచరులారా! నా గుర్రాన్ని వెంటనే తెండి. విరోధిశిక్షణార్థం ఇపుడే కదలివెళ్ళాలి. సైన్యం సిద్ధం చేయండి. అనగానే వారు గుర్రం సిద్ధం చేశారు.

కులశేఖరాళ్వార్ మహావిష్ణువు గరుడుని మీదికి ఎక్కి నట్లుగా ఆసీనులయి వాగె సడలించారు. రెండు గడల దాటించారు. ధేయని పరుగులెత్తించారు. ఆ గుర్రం లంకవైపు కదిలింది. ఆ దృశ్యాన్ని చూచిన దేవతలు పూలవాన కురిపించారు.

కులశేఖరులభక్తికి పరవశించి గోవిందుడే గరుడా రూఢుడై వచ్చాడు. దేవతలందరు సేవిస్తుంటే స్వామి గుర్రంతో సహా కులశేఖరులను విమానారూఢుణ్ణి చేసి వైకుంఠానికి తీసి కెళ్ళాడు.

కులశేఖరుల కృతులలో 'పెరుమాళ్ తిరుమొళి' నూరు పాటలది. ఆ పాటలలో ముప్పై రంగనాథసంబంధిపాశురాలు డెబ్బదిపాశురాలలో శ్రీ వేంకటేశస్తవం, శ్రీరామచంద్రకీర్తనలు. ఈ యోగి చరిత్రం ఎవరు వ్రాసినా చదివినా సంస్తుతి చేసినా అసంఖ్యాకసంపదలు సిద్ధిస్తాయి. ఈతనిసంస్కృతకృతి ముకుంద మాల.

భగవద్భక్తిని, భాగవతభక్తిని ప్రబోధించే కులశేఖరాళ్వార్ చరిత్ర అద్భుతావహం. *(ఇంకా ఉంది)*








శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి, శ్రీనివాసమంగాపురం

- డా॥ వి.ఆర్.రాసాని, 98484 43610

(ఫిబ్రవరి 15 నుండి 24 వరకు శ్రీకల్యాణవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా..)


కలియుగంలో ధర్మపరిరక్షణార్థం భృగుమహర్షి మొదట సత్యలోకం వెళ్ళాడు. వాణీ బ్రహ్మలు పట్టించుకోలేదు. కైలాసం వచ్చాడు. ఉమామహేశ్వరులదీ అదేదారి. చివరికి వైకుంఠం వచ్చాడు. లక్ష్మీనారాయణులు ఏమీ పట్టించుకోలేదు. కుపితుడై పోయిన భృగువు తట్టుకోలేక ఎగిసి వెన్నుని ఎదపైనతన్నాడు. దీనిని లక్ష్మి అవమానంగా భావించి వైకుంఠం వదలి భూలోకం వచ్చేసింది. ఆమెను వెతుక్కుంటూ విష్ణువూ వైకుంఠంవదలి భూలోకానికి వచ్చేశాడు. వైకుంఠం బోసిపోయింది.

స్వామి ఆకలి దప్పులకు తాళలేక ఒక పుట్టలో విశ్రమించాడు. అతని దుస్థితి చూచి, బ్రహ్మరుద్రులు ఆవు, దూడలుగా మారి లక్ష్మి సాయంతో ఆవుల మందలో చేరి రోజూ పుట్టలో పాలు విడిచి స్వామి ఆకలి తీర్చాయి. ఆ దృశ్యాన్ని చూచినగొల్లవాడు ఆవును చంపబోయాడు. ఆ సమయంలో ఆవుకు తగలాల్సిన దెబ్బ దాన్ని రక్షించడానికి పైకి లేచిన విష్ణువుకు తగిలింది. విష్ణువు గొల్లవాణ్ణి శపించి వరాహక్షేత్రం చేరాడు.

వకుళాదేవి ఆశ్రయాన్ని పొంది శ్రీనివాసుడిగా మారాడు. వకుళాదేవి మాతృప్రేమమాధుర్యాన్ని మరోసారి చవిచూసిన శ్రీనివాసుడు అడవి మార్గంలో ఓ రోజు ఆకాశరాజు కూతురైన పద్మావతీదేవిని గజరాజు తరుము కొస్తుంటే ఆమెను కాపాడాడు. అలా ప్రేమలో కూడా పడ్డాడు. విషయం తెలుసుకున్న వకుళాదేవి ఆకాశరాజువద్దకు వెళ్ళి పెళ్లిపెద్దగా నిలబడి వ్యవహారం చక్కబెడుతుంది. ఫలితంగా పద్మావతీ శ్రీనివాసుల పెళ్లిఘనంగా జరుగుతుంది. కొత్త పెళ్లి కూతురైన పద్మావతిని తీసుకుని వరాహక్షేత్రానికి దక్షిణంగా స్వర్ణముఖీ ఒడ్డున వెలసి ఉన్న అగస్త్యాశ్రమానికి విచ్చేస్తాడు. స్వర్ణముఖి, కల్యాణి, భీమ నదుల త్రివేణీ సంగమంగా ఈ ప్రాంతం ప్రసిద్ధి చెందింది.

అయితే అగస్త్యుడు నూతనదంపతులు ఆరు మాసాల వరకు తీర్థయాత్రలు, క్షేత్రసందర్శనం చెయ్యడం తగదు - అని చెబుతాడు. అతని మాట ప్రకారం శ్రీనివాసుడు తన ప్రయాణాన్ని ఆపుకుని అక్కడే ఉండి ఆరుమాసాల తర్వాత మంగాపురం కాలిదారిగుండా పద్మావతిని తీసుకుని

కొండకు వెళ్ళాడని ఐతిహ్యం. అలమేలుమంగ అయిన పద్మావతీదేవితో ఆరుమాసాలు విహరించిన స్థలంగానూ, భక్తుల కోరికమేరకు ఇక్కడ 'కల్యాణశ్రీనివాసుని'గా వెలసి ఉండడం వల్లనూ ఇది 'శ్రీనివాసమంగాపురం'గా పేరు మార్చుకుందని స్థానికుల కథనం.



కల్యాణ శ్రీనివాసుని కిరీటంపై ఐతిహ్యం

ఒకప్పుడు చంద్రగిరిరాజు ఈ శ్రీనివాసుడికి పట్టు పీతాంబరాలతో బాటు, నగలను, కిరీటాన్ని కూడా బహూకరించి అలంకరించమని చెప్పి వెళ్ళిపోయాడట, దేవాలయపూజారులు ఒక మంచిరోజు చూచి, గుడితలుపులుమూసి, గర్భగుడి ముందరనున్న మంటపంలో హోమగుండం నిలిపి హోమం చేసి, హవిస్సులు అర్పించి రాజు సమర్పించిన పట్టువస్త్రాలను అగ్నికి అర్పిస్తారు. అలాగే ఒక్కొక్కనగను మంత్రాలు చదువుతూ అగ్ని గుండంలో వేస్తుంటే అవన్నీ లోపల దేవుడివిగ్రహానికి అలంకరింపబడుతున్నాయట. ఈ విషయం తెలిసి కొందరు వ్యక్తులు పరుగున వెళ్ళి రాజుకు "మీరు దేవుడికి సమర్పించిన నగలూ నాణ్యాలన్నీ యజ్ఞగుండానికి ఆహుతి చేస్తున్నారు" అని చెప్పారట. రాజు ఇదేదో క్రూరకర్మగా భావించి, కోపోద్రిక్తుడై గుర్రంమీద వచ్చి ఆ దృశ్యం చూచి, హతాశుడైపోతాడట. అప్పటికే అన్ని నగలూ, వస్త్రాలు యజ్ఞగుండంలో ఆహుతైపోయి, చివరన ఒక్క కిరీటం మాత్రమే మిగిలిపోయిందట. రాజు పూజారుల దగ్గరకొచ్చి ఈ అకృత్యం ఆపండని అరిచాడట. పూజారులు "మేం మీరిచ్చినవన్నీ దేవునికి అర్పిస్తూ ఉన్నాము, కుండంలో వేసిన ప్రతిదీ లోపలదేవునికి అలంకరింపబడుతున్నాయి. ఈ కార్యాన్ని మధ్యలో ఆపితే ఆ తర్వాత మిగిలిన కిరీటాన్ని దేవుడికి అమర్చడం కష్టం" అని చెప్పారట. అయినా రాజుకు వారిపైన నమ్మకం కుదరక బలవంతంగా తలుపులు తెరిపించి చూశాడట, వాళ్ళు చెప్పినట్టే కిరీటం తప్ప మిగిలిన నగలన్నీ దేవుడికి అలంకరింపబడి ఉండటం రాజు చూశాడు. ఆ కిరీటాన్ని మాత్రం అలాగే తిరుమలకు తీసుకెళ్ళి, అక్కడి వెంకన్నకు అర్పించారు. ఆ కిరీటం కొండపైన ఇప్పటికీ ఉందని చెబుతారు.

చారిత్రకాంశాలు

ఇది అతిప్రాచీనమైన దేవాలయం. 1324లో ఈ ప్రాంతంపైన దండయాత్రలు చేసిన ఢిల్లీ సుల్తానుల కాలంలో ఇది దాడులకు గురై శిథిలమై పోయింది. అలా శిథిలమైన దేవాలయాన్ని తాళ్లపాక అన్నమయ్య మనుమడైన చిన్నతిరుమలాచార్యులు జీర్ణోద్ధరణం గావించి, ఆచార్యపురుషుల, ఆళ్వారుల, అన్నమాచార్యులు మొదలైన విగ్రహాలు ప్రతిష్ఠించారనీ శాసనాలు తెలుపుతున్నాయి. ఆయనే నిత్యపూజానైవేద్యాదులను ఏర్పాటు చేసినాడనీ 22-3-1540 నాటి శాసనం తెలుపుతోంది. ఇక అప్పటినుంచీ దాదాపు 250 సంవత్సరాలవరకు దీనిప్రభ దేదీప్యమానంగా వెలిగిపోయింది. పిదప చాలాకాలంపాటు పూజాపునస్కారాలు లేకుండా పుట్టలు పెరిగిన ఈ దేవాలయం 1940లో పునరుద్ధరింపబడింది. ఆ తరువాత అర్చకులనుండి 1967వ సంవత్సరంలో తి.తి.దేవస్థానంవారు ఈ ఆలయ నిర్వహణబాధ్యతలను స్వీకరించి, వైఖానసాగమశాస్త్రప్రకారంగా నిత్యపూజలు, ఉత్సవాలు నిర్వహిస్తున్నారు.

అలమేలుమంగాపురం - శ్రీనివాసమంగాపురం

'అలమేలుమంగ' వెలసి ఉన్నందున ఆ ఊరు అలమేలుమంగాపురంగా వ్యవహరింపబడింది. శ్రీనివాసుడు వెలసి ఉన్న ఈ ఊరును 'శ్రీనివాసమంగాపురం'గా పిలవడం జరిగింది. ఈ అలమేలుమంగాపురం, శ్రీనివాసమంగాపురం రెండూ తిరుపతి పట్టణానికి ఒకటి తూర్పున, రెండవది పశ్చిమాన అతిసమీపంలోనే ఉండడం విశేషం.



**తిరుమల తిరుపతి దేవస్థాన పరిపాలనలోని ఆలయాలలో శ్రీనివాసమంగాపురం ఆలయం ఒకటి.
తిరుపతికి 10 కి.మీ దూరంలో తిరుపతి నుండి మదనపల్లికి వెళ్ళే దారిలో నెలకొని ఉన్నది.
యాత్రికులు తప్పక దర్శించవలసిన క్షేత్రం ఇది.
ఈ పుణ్యక్షేత్రంలో వెలసిన దేవుడు శ్రీ కల్యాణవేంకటేశ్వరస్వామి.
తిరుపతి నుండి ఈ ఆలయాన్ని బస్సులో కాని, ఆటోలో గాని చేరుకోవచ్చును.**

యువవాణి

జ్ఞానం నుంచి ఉన్నత జ్ఞానానికి

– శ్రీ వాడ్రేవు చినవీరభద్రుడు

ఉపనిషత్తుల్ని ధార్మికరచనలుగా ప్రస్తావించడం పరిపాటి. కానీ, మనంవాటిని విద్యాసంబంధమైన తాత్త్వికరచనలుగా చూడాల్సి ఉంటుంది. ముఖ్యంగా, ప్రపంచమంతా విజ్ఞానసమాజం కావాలని తపిస్తున్న ఈ రోజుల్లో ఉపనిషత్తుల ఆలోచన సరికొత్త ప్రాధాన్యతను సంతరించుకుంటోంది. నిన్నటిదాకా వస్తుసేవల ఉత్పత్తికీ, జాతిఆర్థికవ్యవస్థసమగ్రతకీ, దేశాభివృద్ధికీ భౌతిక వనరులే ప్రధానమైన ముడిసరకుగా భావిస్తూ ఉండేవాళ్లం. కాని గత రెండు, మూడు దశాబ్దాలుగా మనం మానవవనరుల ప్రాముఖ్యతనీ, విజ్ఞానప్రాధాన్యతనీ గుర్తించడం మొదలుపెట్టాం. మామూలు మనిషిని వైజ్ఞానికుడిగా, మట్టిని బంగారంగా మార్చే రసరహస్యం ఉపనిషత్తుల్లో ఉందని ఈ రోజు మనం తెలుసుకుంటున్నాం.

రెండురకాల విద్యలు

మారుతున్న ప్రపంచానికి తగ్గట్టుగా మనల్నిమనం సంసిద్ధ పరచుకోవడానికి ఎటువంటి విద్యకావాలో ప్రతి ఉపనిషత్తూ మనకు దారి చూపిస్తున్నది. అయితే విద్యలో రెండురకాల విద్య లుంటాయనీ, మొదటిరకం విద్య ప్రకృతిగురించీ, సమాజం గురించీ మనకు తెలియజేస్తూందనీ, రెండోరకం విద్య మన గురించి, మనకు తెలియజేస్తూందనీ చెప్పటమే ఉపనిషత్తుల సారాంశం. ఈ విషయాన్ని చాలాస్పష్టంగా చెప్పిన రెండు ఉప నిషత్తుల్లో ఒకటి ఈశావాస్యం, రెండవది ముండకం. ఈశావాస్యం 'అవిద్య', 'విద్య' అనే పదాలతో ఆ రెండువిద్యలను సూచిస్తే, ముండకం 'అపర', 'పరావిద్య'ల పేరిట వాటిల్ని సూచించింది. విద్యగురించి ఈ రెండుఉపనిషత్తులు చూపించిన ఈ దార్శనిక స్పష్టత చాలా ఆశ్చర్యం కలిగించడమే కాక, మనకొక మానసిక విముక్తినికూడా ప్రసాదిస్తోంది.

ఈశావాస్యం 'విద్యాం చ అవిద్యాం చ యస్తత్ వేద ఉభయం సహ/ అవిద్యయా మృత్యుం తీర్త్వా విద్యయా అమృత మశ్నుతే' అంది. ఇందులో మనిషివిముక్తిని రెండుభాగాలుగా గుర్తించడం జరిగింది. మొదటిభాగంలో మృత్యువును తరించడ ముంటే, రెండోభాగంలో అమృతత్వాన్ని పొందడముంది. మృత్యువును తరించటానికి ఉపయోగించే విద్యకీ, అమృతత్వాన్ని పొందటానికి పనికొచ్చే విద్యకీ, మధ్య సన్నని సరిహద్దును ఒకదాన్ని ఉపనిషత్తు గుర్తించింది.

మృత్యువు ఋణాత్మకభావన. దాన్ని గుర్తించి, భావించి, తరించడానికి ఉపయోగించే విద్యకూడా ఎంతోకొంత సకారాత్మక స్వభావాన్ని సంతరించుకుంటుంది. అందుకని దాన్ని 'అవిద్య' అంది. కాగా అమృతత్వం గుణాత్మకభావన. దాన్ని సంభావించే విద్యకూడా గుణాత్మకంగా ఉంటుంది. అందుకని దాన్ని 'విద్య' అంది. ముండకం అపర, పరవిద్యలుగా వీటిల్ని సూచిస్తున్నప్పుడు కేవలం ఈ భావాలను పునరుక్తం చేయటం కాక, మరే ఉపనిషత్తు లోనూ కనపడని విప్లవాత్మకతనుకూడా కనబరిచింది. అదేమంటే, అపరవిద్యను పేర్కొంటున్నప్పుడు ఉపనిషత్తు మొత్తం వేదవేదాం గాలన్నిటినీ కూడా అపరవిద్యగా పేర్కోవటం.


తెలుసుకోవలసిందేది?

శౌనకుడు అంగిరసుడిదగ్గరకు వెళ్లి 'విజ్ఞాతే సర్వమిదం విజ్ఞాతం భవతి ఇతి' అని అడిగాడు. అంటే దేన్ని తెలుసుకుంటే సమస్తం తెలుస్తుందో చెప్పమన్నాడు. ఆధునికవిద్య దీనికి వ్యతి రేకక్రమంలో నడిచే అన్వేషణ. ఎన్నో విషయాలు తెలుసుకోవడం ద్వారా అది సత్యం తెలుసుకోగలను అనుకుంటుంది. అసలు ప్రాచీన, ఆధునికవిద్యావిధానాలన్నిటిలోనూ కూడా ఈ సమస్య ఉందనుకుంటాను. ఒక కవి అన్నట్లుగా అన్నిరకాల విద్యాభ్యాసా ల్లోనూకూడా 'విషయాల్లో వివరాన్నో, వివరాల్లో విషయాన్నో' కోల్పోవటం జరుగుతూనే ఉంటుంది.

అన్నిరకాలవిషయాల్నీ తెలుసుకోవటంద్వారా సత్యం అవ గతం కాకపోవచ్చుననే జాగరూకత చాలా ఉపనిషత్తుల్లో కనిపి స్తుంది. ముఖ్యంగా ఛాందోగ్యోపనిషత్తులో నారదుడు సనత్కుమా రుణ్ణి తనకు బోధించమని అడిగినపుడు ముందు తనకు తెలిసిం దేదో చెప్పమని సనత్కుమారుడు నారదుణ్ణి అడుగుతాడు. అప్పుడు నారదుడు తనకు తెలిసిన విజ్ఞానాల సవివరమైన జాబితా అప్పగి స్తాడు. అందులో ఋగ్వేదం, యజుర్వేదం, సామవేదం, అథర్వణ వేదం, ఇతిహాసం, పురాణాలు, గణితం, దేవవిద్య, పితృ కర్మల శాస్త్రం, బ్రహ్మవిద్య, భూతవిద్య, క్షత్రవిద్య, నక్షత్రవిద్య, సర్పదేవజన విద్యవంటివన్నీ ఉన్నాయి. అన్ని చదివినప్పటికీ తను తెలుసు కున్నది కేవలం మంత్రమే తప్ప ఆత్మని కాదని నారదుడు విన యంగా విన్నవించుకుంటాడు. తాను సముపార్జించిన జ్ఞానం తనని శోకవిముక్తుణ్ణి చేయటంలేదనీ, తనను శోకంనుంచి తప్పించే విద్య ప్రసాదించమనీ ఆయన సనత్కుమారుణ్ణి వేడుకుంటాడు.

రెండురకాల చదువులు

నారదుడు సనత్కుమారుణ్ణిలా ప్రార్థించినట్టుగా కొన్ని వేల యేళ్ల కిందటి భారతీయతాత్త్వికరచన ఒకటి చెప్తోందని మోహన్‌దాస్ కరమ్‌చంద్ గాంధీ అనే ఒక బారిష్టర్‌కు తెలీదు. కాని తన కాలంనాటి యువకుడికి లభించగల అత్యున్నత ఆధునికవిద్యను పొందిన తరువాత కూడా ఆయన నారదుడు అనుభవించిన మనఃస్థితి వంటిదే అనుభవించాడు. తాను పొందిన ఉన్నతవిద్య, ఒకవిధంగా చూస్తే, సాధారణవిద్య మాత్రమేనని ఆయన తెలుసుకున్నాడు. మనిషి శోకరహితుడు కావాలంటే, తన చుట్టూ ఉండే ప్రపంచం శోకరహితంగా ఉండాలంటే ఈ ఆధునికవిద్య సరిపోదని ఆయన గ్రహించాడు.



1908లో ఆయన రచించిన 'హింద్‌స్వరాజ్'లో ఒక ఆసక్తికరమైన సంభాషణ ఉంది. ఆ సంభాషణ ఒక పాఠకుడికీ, సంపాదకుడికీ మధ్య సాగుతుంది. ఇది పూర్తిగా ఉపనిషత్తుల శైలి. ఇక్కడ పాఠకుడు సంపాదకుణ్ణిలా అడుగుతాడు:

'మన మొత్తం చర్చలో మీరు విద్య ఆవశ్యకతగురించి ఏమంత మాట్లాడినట్లు లేదు. మనందరం కూడా మన సమాజంలో విద్య తగినంతగా వృద్ధిచెందలేదనే బాధ పడుతున్నాం. దేశంలో నిర్బంధవిద్య ప్రవేశపెట్టవలసిన అవసరముందని కూడా మనం గుర్తిస్తున్నాం. మహారాజా గైక్వాడ్ తన రాజ్యంలో ఇప్పటికే ఈ ప్రయత్నాలు మొదలుపెట్టారు. ప్రతిఒక్కరిదృష్టీ ఆయనమీదే ఉంది. ఇందుకు మహారాజా నిజంగా అభినందనీయుడు. అయితే ఇంతకీ ఈ ప్రయత్నాలవల్ల ప్రయోజనమేమీ లేదంటారా?'

ఇందుకు సంపాదకుడిలా జవాబిచ్చాడు

'ప్రపంచంలో మన నాగరకత అత్యున్నతమైందని మనం భావిస్తున్నట్లయితే మీరు చెప్తున్న ప్రయత్నాలవల్ల మనకు చేకూరే దేమీ పెద్దగా ఉండబోదని చెప్పటానికి చింతిస్తున్నాను. ఈ దిశగా ప్రయత్నాలు కొనసాగిస్తున్న మహారాజా గైక్వాడ్, ఇతర మహనీయుల ఉద్దేశాలు నిజంగా నిష్కలంకమైనవి. అందువల్ల వారు నిజంగానే మనకు ప్రశంసాపాత్రులు. కానివాళ్ల ప్రయత్నాలవల్ల సిద్ధించబోయే ఫలితాలపట్ల మనం గుడ్డిగావుండలేం. విద్య అంటే ఏమిటి? అది కేవలం అక్షరజ్ఞానం మాత్రమే. అదొకపరికరం మాత్రమే. ఆ పరికరాన్ని సద్వినియోగం చేసుకోవచ్చు, దుర్వినియోగం కూడా చేసుకోవచ్చు. రోగి ప్రాణాలు కాపాడడానికి ఉపయోగించే శస్త్రంతో అతడిప్రాణాలుకూడా తీయవచ్చు. అక్షరజ్ఞానం కూడా అటువంటిదే. ఎంతోమంది దాన్ని దుర్వినియోగం చేస్తూండడం; చాలా కొద్దిమందిమాత్రమే దాన్ని సద్వినియోగం చేసుకుంటుండటం మనం రోజూ చూస్తూనే ఉన్నాం.

నేను చెప్తున్నది నిజమే అనుకుంటే అక్షరజ్ఞానంవల్ల సమాజానికి మేలుకన్నా కీడే ఎక్కువ జరిగిందని మనం స్పష్టంగా చూపించగలుగుతున్నాం.'

సంపాదకుడు ఇంకా ఇలా అన్నాడు

'విద్య అంటే మామూలుగా స్ఫురించే అర్థం అక్షరజ్ఞానమని. పిల్లలకి చదవటం, రాయడం, సామాన్యగణితం బోధించడాన్ని మనం ప్రాథమికవిద్య అంటున్నాం. ఒక రైతు నిజాయితీగా కాయకష్టం చేసి తనను తాను పోషించుకుంటున్నాడు. అతడికి ఈ ప్రపంచం గురించిన సాధారణపరిజ్ఞానముంది. తన తల్లిదండ్రుల పట్ల ఎలా నడుచుకోవాలో, తన భార్య, తన పిల్లలు, తన తోటి గ్రామీణులపట్ల ఏవిధంగా వ్యవహరించాలో అతడికి స్పష్టంగా తెలుసు. మీరతడికి అక్షరజ్ఞానమివ్వడం ద్వారా అదనంగా ఏమివ్వాలనుకుంటున్నారు? అతడిసంతోషాన్ని మీరొక్క అంగుళమైనా పెంచగలరా? లేదా అతడు తాను జీవిస్తున్న జీవితంపట్ల అసంతృప్తి పెంచుకోవాలని కోరుకుంటున్నారా? మీరు కోరుకునేదదే ఐనాకూడా అతడికి అటువంటిచదువు అవసరంలేదు. పాశ్చాత్యభావజాలపువరదలో పడి కొట్టుకుపోతూ మనం మన ప్రజలకుకూడా ఇట్లాంటి విద్యనే ఇవ్వాలనే తొందరపాటు నిర్ణయానికి వచ్చేశాం.'

(ఇంకా ఉంది)

తిరుమళిశై ఆళ్వారులు

– శ్రీ దేసువేంకటసుబ్బారావు,
9160053535

**(ఫిబ్రవరి - 11
తిరుమలిశై ఆళ్వారు
తిరునక్షత్రం సందర్భంగా..)**

తిరుమళిశై ఆళ్వారు, మకర(తై నెల) మాసం, మఖానక్షత్రం, ఆదివారంరోజున తిరుమళిశైనగరంలో జన్మించారు. దివ్యాంశ సంభూతులైన వీరిచరిత్ర ఎంతో ఆసక్తికరం.

తమిళనాడులోని తిరుమళిశై అనే పట్టణంలో జన్మించడం వల్ల వీరికి తిరుమళిశై ఆళ్వారు అనే పేరు వచ్చింది. ఈ పట్టణం కాంచీపురానికి, మహాబలిపురానికి, మైలాపురానికి సమానమైన దూరంలో ఉంది. ఈ విధంగా చూస్తే తమిళనాడుకు నాలుగు దిశలలోనూ ఆళ్వారులు జన్మించారని తెలుస్తుంది. ఈ తిరుమళిశై పురానికి మహీసార పురమనికూడ మరో పేరు.

మహీసారం సకలసౌభాగ్యాలకు నెలవైంది. దీని సమీప అరణ్యంలో భార్గవుడు అనే ముని పర్ణశాల నిర్మించుకుని తపస్సు చేసుకునేవాడు. ఆతని నిరంతర తపస్సు వల్ల తన ఉనికికే ప్రమాదమని గ్రహించాడు మహేంద్రుడు. భార్గవుడి తపస్సు భగ్నం చేయమని కనకాంగి అనే అప్సరసను పురమాయించాడు. ఆమె తన అందచందాలతో భార్గవుడిని లోబరచుకుంటుంది. కొంత కాలానికి వీరిరువురకు ఒక కుమారుడు కలిగాడు. కనకాంగి ఒక వెదురుబుట్టలో ఆ బాలుడిని పెట్టి, పూపొదలమాటున దాచి తన లోకానికి వెళ్లిపొయింది.


భార్గవుడు కనకాంగికోసం అంతటా వెదికి చివరకు అసలు విషయం తెలుసుకొని పశ్చాత్తాపం చెందాడు. తన జీవిత సాఫల్యం కోసం మరలా తపస్సు చేయటానికి దూర ప్రాంతానికి వెళ్లిపోతాడు. పొదలచాటున ఉన్న బాలుడు కొంత సేపటికి బిగ్గరగా ఏడవ సాగాడు. ఆదేదారిన వెళుతున్న తిరువలన్ అనే మేదరి ఆబాలుణ్ణి చూచి సంతానం లేని తమకు ఆ బాలుడు దైవప్రసాదంగా భావించి, ఇంటికి తీసుకొని వెళతాడు.

దివ్యతేజస్సుతో ప్రకాశించే ఆ బాలుడు పాలు త్రాగడు, ఏమీ తినడు. ఈ లక్షణాలున్న బాలుని గురించి ఆనోటా ఈ నోటా విన్నవారు ఈ వింతబాలుణ్ణి చూడటానికి ప్రజలు రాసాగారు. దీనితో ఆ ప్రాంతం తీర్థస్థలంగా మారిపోయింది.

ఆహారపానీయాలు తీసుకొనని ఆ బాలుడి వింతచేష్టలకు పద్మావతి, తిరువలన్ దంపతులు మనసులోనే దిగులుచెందారు. నిత్యం స్నానాదికాలు చేయించి, నుదుటున తిలకం దిద్ది, తలపైన, మెడలోన పూలమాలలతో, సుగంధద్రవ్యాలతో అలంకరించి పెంచసాగారు. దివ్యతేజస్సుతో ఆ బాలుడు దినదిన ప్రవర్ధమానుడౌతున్నాడు. యోగ ముద్రలతో కనులు మూసికొని భగవద్ధ్యానం చేయసాగాడు. ధ్యానంలో భాగంగా శ్రీమన్నారాయణుని విశేషగుణాలను గానం చేస్తూ అందరినీ ఆశ్చర్యపరచసాగాడు.

ఈ విశేషాలు ఆనోట ఈ నోట విన్న ఒక వృద్ధ దంపతులజంట ఆ బాలుణ్ణి దివ్యపురుషునిగా ఎంచి ఒక పాత్రనిండా పాలు తీసికొని వచ్చి త్రాగమని అర్థించారు. ఎప్పుడూ ఏమీ స్వీకరించని ఆ బాలుడు వీరి ప్రార్థన విని అందరూ చూస్తుండగా పాలు త్రాగి అందరినీ ఆశ్చర్యపరిచాడు.

అప్పటినుండి నిత్యం ఆ వృద్ధదంపతులు బాలునికి పాలు సమర్పించసాగారు. పాలు త్రాగిన ఆ బాలుడు తన్మయత్వంలో భక్తి పాటలు పాడుతూ అందరినీ మరింత ఆశ్చర్యపరచసాగాడు. ప్రతినిత్యం ఇలా వృద్ధదంపతులు సమర్పించే పాలుత్రాగుతూ, మహావిష్ణులీలావిశేషాలను గానం చేయసాగాడు. దీనితో ఆ ప్రాంతమంతా సందర్శకులతో నిండిపోయింది. తిరువలన్ నివాసమే ఆ బాలుని ఆవాసం. ఇతని గుణవిశేషాలను గుర్తించిన ఆక్కడి ప్రజలు ఇతనిని తిరుమళిశై ఆళ్వారుగా కొనియాడసాగారు. ఇలా కొంతకాలమైన తరువాత నిత్యం పాలను సమర్పించే ఆ వృద్ధ దంపతుల అచంచలమైన



భక్తికి కరుణించిన యోగిపుంగవుడు ఒకరోజు వారు సమర్పించిన పాలలో కొన్ని మిగిల్చి వారిని తాగమని చెప్పాడు. అలాగే వారు ఆ పాలను భక్తి పూర్వకంగా తాగారు. అలా ఆ పాలను తాగిన కొన్ని రోజులకు సంతానం లేని వీరికి తేజోవిరాజితుడైన ఒక బాలుడు జన్మించాడు.

వారు తమ కుమారునికి కణికణ్ణన్ అని పేరు పెట్టారు. చిన్నప్పటినుండి కణికణ్ణన్ తమ తల్లిదండ్రులతోపాటు తిరుమళిశైఆళ్వారులనే సేవించటం అలవాటు చేసుకున్నాడు. గురుశిష్యులిద్దరూ వీరు నిరంతరం శ్రీమన్నారాయణుని సేవలో గడిపేవారు.


తిరుమళిశైఆళ్వారులు పేయాళ్వారుల శిష్యులు. పేయాళ్వారుల గురుబోధతో తిరుమళిశై తన భక్తి మార్గాన్ని మహావిష్ణువు పైకి మరలుస్తాడు. తిరుమళిశై ఆళ్వారు వైష్ణవభక్తి ప్రబోధకులయ్యారు.

మహాత్ములను బాధిస్తే లోకం ఊరుకుంటుందా!

ఒకనాడు తిరుమళిశై నగరసంచారం చేస్తూండగా అనారోగ్యంతో ఉన్న ఒక బిచ్చగత్తె తారసపడింది. ఆమె అవస్థను చూచిన తిరుమలిశై, భగవంతుణ్ణి ప్రార్థన చేసి ఆమెను ఆశీర్వదించాడు. వెంటనే ఆమె తన వికారాన్ని కోల్పోయి అత్యంత సౌందర్యవతిగా మారిపోయింది. ఆ దేశపు రాజు ఆమెను వివాహమాడతాడు. కాలం గడిచేకొద్దీ ఆ రాజు వృద్ధుడైపోయాడు. కాని ఆమె మాత్రం నిత్య యౌవనవతిగానే ఉండిపోయింది. దీనికి కారణం తిరుమళిశై ఆశీర్వాదబలమేనని తెలుసుకున్న రాజు తానుకూడ నవయవ్వనంతో మారాలని భావించి తిరుమళిశైఆళ్వారులను చూచి ఆయన దీవెనలతో తిరిగి యవ్వనాన్ని పొందాలని అనుకున్నాడు. వెంటనే తన పరివారాన్ని పిలిచి ఆళ్వారులను తన వద్దకు తీసుకురమ్మని ఆదేశించాడు. రాజభటులు తిరుమళిశై వద్దకు వెళ్లి రాజాజ్ఞను విన్నవించారు. తిరుమళిశై తాము వెళ్లకుండా కణికణ్ణన్‌ను రాజ దర్బారుకు పంపాడు.

రాజు అతనితో తన కోర్కెను తెలియచేసి, తిరుమళిశైఆళ్వారును తీసుకురమ్మన్నాడు. కణికణ్ణన్, తమ గురుదేవులు నిత్యం భగవద్ధ్యానంలోనే ఉంటారు కనుక అది అసాధ్యమని తెలియచేశాడు. దానికి రాజు కణికణ్ణన్ ఉద్దేశించి "అయితే నీవు కూడ ఆళ్వారుల అంతటి ప్రతిభావంతుడివి కదా! నీవైనా నీ గానామృతంతో మమ్మల్ని ఆనందింపచేయి" అని ఆజ్ఞాపించాడు. అందుకు కణికణ్ణన్ "తాను తమ గురువు సన్నిధిలో తప్ప ఇతరుల చెంత తన గానాన్ని వినిపించనని" అన్నాడు. కోపోద్రిక్తుడైన రాజు గురుశిష్యులిద్దరికీ రాజ్యబహిష్కరణ శిక్ష వేశాడు. రాజాజ్ఞను అనుసరించి తిరుమళిశైఆళ్వారు తన శిష్యుడితో కలసి నగరాన్ని విడిచిపోసాగారు. ఈ వార్త తెలిసి ప్రజలందరూ నగరాన్ని వదలి తాము కూడా తిరుమళిశైఆళ్వారులను అనుసరించారు. దీంతో నగరం మొత్తం నిర్మానుష్యమైపోయింది.

రాజ్యంలో సంభవించిన ఈ హఠాత్పరిణామానికి రాజదంపతులు నివ్వెరపోయారు. మరల ఆ ఆళ్వారులను తిరిగి నగరానికి ఆహ్వానిస్తే తప్ప తమకు వేరే దిక్కు ఉండదని రాజుకు రాణి హితవు చెబుతుంది. దాంతో పశ్చాత్తాపం చెంది, మహారాజు తిరుమళిశైఆళ్వారులను సమీపించి తన కన్నీళ్లతో వారి పాదాలు కడిగి, తిరిగి తమ నగరానికి వచ్చి తమకు, తమ రాజ్యానికి మరల ప్రాణప్రతిష్ఠచేయమని వేడుకున్నాడు.



మహారాజుమాటల్ని మన్నించిన తిరుమళిశైయాళ్వారు తమ అపారశిష్యగణంతో తిరిగి నగరానికి చేరుకున్నారు. రాజు ఆళ్వారులకు వలసిన తగిన సౌకర్యాలను ఏర్పాటు చేశారు. ఆ తర్వాత తిరుమళిశై ఆళ్వారు 'నాన్‌ముగన్' అనే దివ్యప్రబంధ తిరువందాదిని రచించారు. భక్తిసామ్రాజ్యంలో తన కంటూ ఒక ప్రత్యేకతను నింపుకొని, ద్రవిడదేశంలో ప్రాతఃస్మరణీయులుగా నిలిచిపోయారు.



శ్రీ కపిలేశ్వరస్వామి ఆలయం, తిరుపతి

– డా॥ కేసర్ల వాణి

(ఫిబ్రవరి 16 నుండి 26 వరకు
శ్రీకపిలేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా..)

శ్రీ వేంకటాచలపర్వతమూలంలో వెలసిన ప్రాచీన పుణ్యక్షేత్రం కపిలతీర్థం. సుదర్శనత్తాళ్వార్ తీర్థం, చక్రత్తాళ్వారు తీర్థం, ఆళ్వారుతీర్థం అనే నామాంతరాలతో ఈ క్షేత్రం ప్రసిద్ధి పొందింది. కపిలతీర్థ పుణ్యక్షేత్రం తిరుపతి నుండి తిరుమలకు వెళ్ళేదారిలో 3 కి.మీ. దూరంలో ఉంది. ఇక్కడ ప్రధాన ఆలయం శ్రీ కపిలేశ్వరస్వామి, శ్రీ కామాక్షిదేవి ఆలయాలు, ఈ ఆలయప్రాంగణంలో శ్రీ వేణు గోపాలస్వామి, శ్రీ లక్ష్మీనారాయణస్వామి ఆలయాలూ ఉన్నాయి.

క్షేత్రమాహాత్మ్యం

కపిలతీర్థంలో వెలసిన ప్రధానదైవం కపిలేశ్వరుడు. పూర్వం పాతాళలోకంలో "భోగవతి"గా పేరు పొందిన గంగానది ఒడ్డున ఆశ్రమంలో కపిలమహాముని శివలింగాన్ని పూజించే వాడు. ఆ శివలింగం దివ్యతేజస్సుతో ప్రకాశిస్తూ దిన దిన ప్రవర్ధమానమై భూమిని చీల్చుకొని వేంకటాచల క్షేత్రమూలంలో స్వయంభువుగా వెలసింది. మరింతగా పెరుగుతున్న శివలింగాన్ని శ్రీమహావిష్ణువు గోపాలుడుగా మారి రక్షిస్తుండగా, బ్రహ్మదేవుడు కపిలధేనువుగా మారి క్షీరధారలు కురిపించి ప్రార్థించారు. అంతటితో ఆ మహా శివలింగం వేంకటాద్రిపర్వతమూలంలో స్వయంభువుగా నిలిచింది. ఇక్కడి శివలింగాన్ని తొలుత పాతాళంలో కపిలమహర్షి పూజించినందువల్ల కపిలేశ్వరుడు అని ప్రసిద్ధి పొందింది.

చారిత్రకప్రాశస్త్యం

కపిలతీర్థ క్షేత్రంయొక్క చారిత్రక ప్రస్తావన క్రీ.శ.11 శతాబ్దం నుండి తెలుస్తున్నది. తిరుపతికి సమీపంలోని కొత్తూరు గ్రామాధికారి అయిన మునయదరయ్యన్ క్రీ.శ. 1012-1044 సం॥ల మధ్య పరిపాలించిన రాజేంద్రచోళ రాజు క్రింద సేవలందించే గ్రామపెద్ద. శ్రీ కపిలేశ్వరస్వామి గర్భాలయంలోని ముఖమండపాలు నిర్మించినట్లు తెలుస్తున్నది. తదుపరి విజయనగర పరిపాలకుడైన అచ్యుతదేవరాయలు క్రీ.శ.15 శతాబ్దంలో కపిలతీర్థానికి చుట్టూమెట్లు కట్టించి పూర్వ పశ్చిమదిక్కులలో సంధ్యావందన మంటపాలను నిర్మించి, సుదర్శన చక్రశిలలను ఎల్లలుగా గురుతుకు వేయించాడు. తర్వాత ఆరవీటి రాజైన పొట్లపాటి తిమ్మరాజు క్రీ.శ. 1647 సం॥ లోను, తర్వాత సదాశివరాయలకాలంలో క్రీ.శ.1663 సం॥లోను తిరుపతి సెవ్వసాని అనే దేవదాసి ఈ ఆలయఉద్ధరణకు కృషి చేశారు. తర్వాత ఈ ఆలయం కరకంబాడి పాళెయగార్ల ఆధీనంలోను, మహంతుల పాలనలోను చేరినట్లు తెలుస్తున్నది. తిరుమల తిరుపతి దేవస్థానం యాజమాన్యం ఏర్పడినప్పటినుండి కపిలతీర్థం తి.తి.దేవస్థానం పరిపాలనలో కొనసాగుతూంది.

కపిలతీర్థం-శ్రీ కపిలేశ్వర మహాలింగం

శ్రీ కపిలేశ్వరస్వామి స్వయంభువు. ఈ మహాలింగ ఆవిర్భావంగూర్చి వామనపురాణంలోని శ్రీవేంకటాచల మాహాత్మ్యంలో పేర్కొనబడింది. ఈశ్వరుడు స్వయంభువుగా అర్చారూపియై మహాలింగాకారంలో వెలసి ఉన్నాడు. భూమితలం నుండి పానవట్టంతో సహా ఈ శిలాలింగం ఎత్తు సుమారు



3 అడుగులు ఉంటుంది. ఈ కపిలలింగం పశ్చిమాభిముఖంతో, మూడుకన్నులతో భక్తులకు దర్శనభాగ్యాన్ని కలిగిస్తున్నది.

శ్రీ కామాక్షిదేవి

జగన్మాత అయిన పార్వతీదేవి ఈ క్షేత్రంలో "కామాక్షి" దేవి అని పిలువబడుచున్నది.

పరివార దేవతలు

ఆ కామాక్షీకపిలేశ్వరుల సన్నిధికి దక్షిణంగా పరివార దేవతామండపం ఉంది. ఈ మండపంలో శ్రీ దక్షిణామూర్తి, కాలభైరవస్వామి, మహాగణపతి, మహాశాస్త, కాశీవిశ్వేశ్వరస్వామి, ఉమామహేశ్వరస్వామి, రామలింగేశ్వరస్వామి, ప్రమథగణపతి, శ్రీ శివసూర్యస్వామి శిలామూర్తులున్నాయి. పరివారదేవతా మండపంలోని ఏకాంతమండపంలో ఉత్సవమూర్తులైన శ్రీ సోమ స్కందమూర్తి, శ్రీకామాక్షిదేవి, శ్రీ శుక్రవారపుదేవి, శ్రీచంద్ర శేఖర, శ్రీ మనోన్మణి అమ్మవారలు, శ్రీ నటరాజ, శివకామ సుందరి, శ్రీ వినాయక, శ్రీ కుమారస్వామి, శ్రీత్రిశూలస్వామి, శ్రీ చండికేశ్వరస్వామి, శ్రీ మాణిక్యవాచకర్‌స్వామి మున్నగు పంచలోహమూర్తులు నెలకొని ఉన్నాయి.

కపిలతీర్థ పుష్కరిణి

అనాదిగా తిరుమలకు వెళ్ళే యాత్రికులు కపిలతీర్థం పుష్కరిణిలో తీర్థవిధులు నిర్వహించి అనంతరం శ్రీ కామాక్షీ కపి లేశ్వరులను దర్శించి తదుపరి తిరుమలేశుణ్ణి దర్శించుకోవడం సంప్రదాయంగా కొనసాగుతూంది. కార్తికమాసంలో కపిలతీర్థంలో స్నానం చేయడం ఎంతో పుణ్యప్రదమని భక్తుల విశ్వాసం.

ఇతర ఆలయాలు

కపిలతీర్థం పుష్కరిణికి దక్షిణదిక్కున రంగమండపంలో ఉత్తరాభిముఖంగా శ్రీరుక్మిణీసత్యభామాసమేత వేణుగోపాలస్వామి ఆలయం,తూర్పుముఖంగా లక్ష్మీనారాయణస్వామి ఆలయాలు ఉన్నాయి.

ఉత్సవవిశేషాలు

డోలోత్సవం

కపిలతీర్థఆలయంలోని కల్యాణమండపంలో శ్రీకామాక్షి, కపిలేశ్వరస్వామివారలకు ప్రతిసోమవారం సాయంత్రం ఊంజల్ సేవ జరుగుతుంది. దేవీనవరాత్రుల్లోను డోలోత్సవం జరుగుతుంది.

తెప్పోత్సవం

కపిలేశ్వరక్షేత్రంలో ప్రతిసంవత్సరం మార్గశిర త్రయో దశి, చతుర్దశి, పౌర్ణమి రోజుల్లో తెప్పోత్సవాలు నిర్వహింప బడుతాయి.



కల్యాణోత్సవం

శ్రీ కామాక్షీసమేత కపిలేశ్వరస్వామివారికి ప్రతినెలా మాసశివరాత్రి రోజున సాయంసంధ్యలో కల్యాణోత్సవం జరుగు తుంది. కల్యాణోత్సవంలో పాల్గొన్న దంపతులకు ఒక లడ్డు అన్నప్రసాదాలు అందజేస్తారు. ఇది ఆర్జితసేవగా కొనసాగు తూంది. మరియు మాఘమాసంలో మహాశివరాత్రి మరుసటి రోజు సాయంత్రం కల్యాణోత్సవం అత్యంత వైభవంగా నిర్వ హింపబడుతూంది.



బ్రహ్మోత్సవాలు

ప్రతిసంవత్సరం మాఘమాసంలో మహాశివరాత్రి సందర్భంగా శ్రీ కామాక్షి, శ్రీ కపిలేశ్వర వారలకు బ్రహ్మోత్సవాలు నిర్వహించబడుతున్నాయి. ఈ ఉత్సవాల్లో స్వామివారు వివిధ వాహనాలపై తిరుపతి పురవీధుల్లో ఊరేగింపబడుతారు. బ్రహ్మో

గ్రంథసమీక్ష

శ్రీచండీ పురాణం (వచనం)

రచయిత - డా॥ జయంతి చక్రవర్తి; పుటలు- 264, సైజు- 1/8 డెమ్మీ; వెల-రూ. 150/-; ప్రచురణ, ప్రతులకు- గొల్లపూడి వీరాస్వామి సన్స్ ఆధ్యాత్మికగ్రంథప్రచురణకర్తలు, కోటగుమ్మం, రాజమండ్రి-533 101. ఆం.ప్ర. సెల్ - 93905 26272.

ఇది - వేదవ్యాసుడు రచించిన మార్కండేయ పురాణంలో 'శ్రీదేవీమాహాత్మ్యం' - ప్రస్తుతం 'శ్రీదేవీసప్తశతి' అని పేర్కొంటున్న పరాశక్తి ప్రభావాన్ని వివరించే విషయం. సప్తశతితో చండీహోమాలు, యాగాలు విశేషంగా జరుగుతున్నాయి. ఎంతోమందికి సప్తశతి నిత్యపారాయణగ్రంథం. ఈ సప్తశతిపై ఎన్నో విశేషాలు వివరిస్తూ గ్రంథాలు వచ్చాయి. ఇందులో 'చండీ'దేవి ప్రధానశక్తి. ఆదిపరాశక్తియే చండి. ఈ చండీ సప్తశతిలోని 13 అధ్యాయాల్నీ, ప్రథమ, మధ్యమ, ఉత్తమ చరిత్రలుగా విభజించడం జరిగింది. ప్రథమచరిత్రలో మహాకాళి, మధ్యమచరిత్రలో మహాలక్ష్మి, ఉత్తమచరిత్రలో మహాసరస్వతీ-రూపాలతో అమ్మవారు అనేక రాక్షసుల్ని సంహరించి, లోకాన్ని రక్షించిన విశేషాలున్నాయి. సప్తశతి మంత్రాత్మకం. ఇందలి ప్రతిశ్లోకం, 'ఉవాచ' అనేవి కూడా మంత్రాలుగానే హోమప్రకరణంలో స్వీకరిస్తారు.

డా॥ జయంతి చక్రవర్తి గారు 13 అధ్యాయాల్లోని విషయాన్ని 1)మహాకాళీ చరిత్ర 2) మహాలక్ష్మీ చరిత్ర 3)మహాసరస్వతీ చరిత్రలుగా విభాగించి-సరళ సుందరమైన వచనంలో తెలుగువాళ్లకు అందించి, ఎంతో మేలుచేశారు. స్పష్టతకై అంతర్విభాగాలూ చేసి, పాఠకులు చదువుకొనేందుకు సులభతరం చేశారు. మూలాన్ని అతిక్రమించకుండా వచనరచన చేశారు.

కథ అయ్యాక చండీకవచం, అర్గళాస్తోత్రం, సిద్ధ కుంజికాస్తోత్రం, దేవీసూక్తం, చండీనవాక్షరమాలాస్తోత్రం. చండీ అష్టోతరశతనామస్తోత్రం, సహస్రనామస్తోత్రం. చండీమానస పూజా ఇచ్చారు. పూజకుల సౌకర్యంకై నామావళి రూపంలోనూ మరలా అష్టోత్తర శతనామాలు, సహస్రనామాలూ ఇచ్చారు.

చివర్లో కోరికలు ఫలించడానికి - ఏయే శ్లోకాలు పారాయణం చేయాలో కూడా పెద్దలు మునుపు పేర్కొన్నవే ఇచ్చారు. చండీ ఆలయాలు మనదేశంలో ఎక్కడెక్కడున్నాయో కూడా చిత్రాలతోపాటు ఇచ్చారు.

దుర్గాదేవీ భక్తులకు - ఈ గ్రంథం నిత్యపారాయణ యోగ్యంగా ఉందనడం సత్యం. అక్షరాలు కూడా కొంత పెద్దవిగా ఉండడంతో మరింతగా పారాయణానికి అనువుగా ఉంది. మొత్తంపై దేవీభక్తులకు ఈ గ్రంథం అమృతాయమానం!!

- డా॥ పమిడికాల్వ చెంచుసుబ్బయ్య

త్సవం చివరిరోజుస్వామివారి ఆయుధమైన త్రిశూలస్వామికి పుష్కరిణిలో త్రిశూలస్నానం జరుగుతుంది.

కార్తికదీపోత్సవం - ఆకాశదీపం

ప్రతిసంవత్సరం కార్తికమాసంలో కృత్తికానక్షత్రం రోజున శ్రీ కపిలేశ్వరస్వామివారిఆలయంలో దీపోత్సవం వైభవంగా నిర్వహింపబడుతుంది.

కృత్తికాదీపోత్సవం రోజు శ్రీ కపిలేశ్వర స్వామివారి ఆలయం పైభాగాన కొండమీద ఉన్న పెద్దగూడులో తిరుపతిలోని గాండ్ల కులస్థులు అఖండజ్యోతిని వెలిగిస్తారు. ఈ అఖండ జ్యోతి తిరుపతి మరియు పరిసరవాసులకు దర్శనమిస్తూ కార్తికదీపోత్సవప్రాధాన్యతను తెలియజేస్తుంది.

అన్నాభిషేకం

కపిలతీర్థం ముక్కోటిగా ప్రసిద్ధి గాంచిన ఉత్సవం అన్నాభిషేకం. సౌరమానం ప్రకారం తులామాసం పూర్ణిమ రోజున శ్రీ కపిలేశ్వరస్వామి వారి మూలమూర్తికి అన్నాభిషేకం అనే విశేషోత్సవం జరుపబడుతుంది. ఈ అభిషేకోత్సవం మాధ్యాహ్నిక విశేషపూజ. ఈ అన్నాభిషేక అనంతరం సర్వదర్శనం నిర్వహింపబడుతుంది.

సర్పదోష నివారణ (రాహుకేతు) పూజలు

తిరుపతిలోని శ్రీ కపిలేశ్వరస్వామివారిఆలయంలో ఆర్జిత సేవగా సర్పదోషనివారణ పూజలు ఇటీవల ప్రారంభించారు. ప్రతి ఆది, మంగళ, శుక్రవారములలో జరుపుతారు.



శ్రీవారి దర్శనార్థం
భారత రాష్ట్రపతి
మాన్యశ్రీ డా॥ ప్రణబ్ ముఖర్జీ గారు
28-12-2016 న
తిరుమలకు విచ్చేశారు















తిరుమల శ్రీవారి సేవలో
భారత ప్రధాని
మాన్యశ్రీ డా॥ నరేంద్రమోదీ గారు
(3-1-2017)















తిరుమల శ్రీవారి ఆలయంలో వైకుంఠ ఏకాదశి పర్వదిన సందర్భంగా 3-1-2017 కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం జరిగింది. ఇరు రాష్ట్రాల గవర్నర్ శ్రీ ఇ.ఎస్.ఎల్. నరసింహన్, తి.తి.దే. పాలకమండలి అధ్యక్షులు-సభ్యులు, తి.తి.దే. కార్యనిర్వహణాధికారి, తిరుమల ఉప కార్యనిర్వహణాధికారి మరియు తి.తి.దే. సిబ్బంది పాల్గొన్నారు.





తిరుమల శ్రీవారి సన్నిధిలో అధ్యయనోత్సవం!

ఈ కార్యక్రమంలో శ్రీశ్రీ పెరియకోయిల్ కేళ్వి అప్పన్ శ్రీ శఠగోపరామానుజ జియ్యర్ స్వామి (తిరుమల పెద్దజియ్యర్ స్వామి), శ్రీశ్రీ ఇళయకోయిల్ కేళ్వి అప్పన్ శ్రీ శఠగోపగోవిందరామానుజ జియ్యర్ స్వామి (తిరుమల చిన్నజియ్యర్ స్వామి) వార్లు పాల్గొన్న దృశ్యం



భారత ప్రధానమంత్రికి తి.తి.దే. డైరీని అందజేస్తున్న పాలకమండలి సభ్యులు శ్రీ డి.పి. అనంత






తిరుపతి లో జరిగిన 104వ భారతీయ సైన్స్ కాంగ్రెస్ లో ఏర్పాటుచేసిన తి.తి.దే. పుస్తక విక్రయశాల

వైకుంఠ ఏకాదశి పర్వదినాన
తిరుమల శ్రీవారి ఆలయంలో భక్తులు



అప్పలాయగుంట శ్రీప్రసన్నవేంకటేశ్వరస్వామివారి ఆలయంలో
ధ్వజస్తంభ స్థాపన





ఫిబ్రవరి - 03
రథసప్తమి సందర్భంగా...

సప్తగిరులలో... సూర్యజయంతి

- శ్రీ జూలకంటి బాలసుబ్రహ్మణ్యం
99856 70152

సుసంపన్నమైన ఆధ్యాత్మికదివ్యక్షేత్రం ఆనందాచలం! అదే వేంకటాద్రి! ఆ పుణ్యధామంలో ఆద్యంతాలు లేని ఒక ఆధ్యాత్మిక శక్తి ఒక్కచోటనే కేంద్రీకృతమై రూపుదాల్చింది. అది వేదాంతవేత్తలు వెదికేటి రూపం! పొందుగ పరమయోగులు భావించే రూపం! బ్రహ్మదులకు అదిమూలమైనరూపం! అది అణురేణుపరిపూర్ణమైన రూపం! ఆ రూపం కొలిచినవారి పాలి కొంగుబంగారం! అదే అదే వేంకటాద్రిపై కోనేటిదరిన నెలకొన్న ఆనందరూపం!

అలాంటిఅద్భుతమైన దివ్యరూపం వెలసిన సప్తగిరులను స్మరిస్తే చాలు! సంచితకర్మలు అన్నీ నశిస్తాయి. ఆ సప్తగిరుల్లో సంచరిస్తే చాలు! సకలపాపాలు పోతాయి. ఇక ఆ సప్తగిరీశుణ్ణి కన్నులనిండా సందర్శిస్తే చాలు! ఇహమూ, పరమూ రెండూ ఇట్టే సిద్ధిస్తాయి.

అందులోను నవగ్రహాధిపతి అయిన శ్రీ సూర్యభగవానుని జయంతి "రథసప్తమి" పండుగనాడు సప్తగిరీశుణ్ణి కన్నులారా దర్శించే అదృష్టం పొందిన భక్తులు పొందే భాగ్యాన్నిగూర్చి ఎంత చెప్పినా తక్కువే అవుతుంది.

సూర్యజయంతే "రథసప్తమి"

సమస్తలోకాలకు వెలుగులనిస్తూ, సకలచరాచరాలకు చైతన్యాన్ని ప్రసాదించే ప్రత్యక్ష భగవానుడు శ్రీసూర్యనారాయణుడు! ఆ స్వామి ఆవిర్భవించిన మాఘశుద్ధసప్తమిరోజును 'సూర్య జయంతి' అనీ, 'రథసప్తమి' అనీ పండుగగా జరపడం సంప్రదాయం.

తిరుమలలో "రథసప్తమి"

కలియుగ వైకుంఠమయిన తిరుమలలో కూడ శ్రీసూర్య భగవానుని జయంతి "రథసప్తమి" రోజున విశేషంగా ఉత్సవాలు జరుగుతాయి. ఆనాడు సూర్యోదయం మొదలుకొని రాత్రి చంద్రోదయం వరకు ఏడువాహనాల్లో తిరుమలేశుడు పాల్గొని కనువిందు చేస్తాడు.

ఆ రోజు జరిగే అన్ని వాహనసేవల్లోను, ఊరేగింపుల్లోను సప్తగిరీశుడు పాల్గొంటాడు. కాని ఒక్కొక్క వాహనంపైన ఆ మలయప్ప వైభవం మనోహరం! ఒక్కొక్క వాహనంలోని శ్రీవారి రూపం నయనానందకరం! ఒక్కొక్కవాహనంలో, ఒక్కొక్క అలంకారంలో భాసించే బ్రహ్మాండనాయకునిదివ్యమంగళరూపం అత్యంతఅద్భుతం!

ఎన్నెన్ని ఆభరణాలు! ఎన్నెన్ని నగలు! మరెన్నెన్ని పుష్పమాలలో! ఇంకెన్నెన్ని సుగంధ భరితమైన రంగురంగుల పూల దండలో! ఏ ఉత్సవ వైభవం దానిదే! దేని ప్రత్యేకత దానిదే! వాటిని దర్శించిన భక్తులకు ఎవరి అనుభూతులు వారివే! ఈ పర్వదినాన శ్రీవేంకటేశ్వరుని శోభ వర్ణనాతీతం.

ఏడుకొండలవాడిఏడువాహనాలు

'రథసప్తమి'నాడు తిరుమల శ్రీవారు ఉదయంనుంచి రాత్రి వరకు ఏడువాహనాల్లో ఊరేగడమే గాక, మధ్యాహ్నం కోనేట్లో "చక్రస్నానం" చేస్తారు. అందువల్లే ఒకేరోజు జరిగే 'బ్రహ్మోత్సవం' అంటారు.

మామూలుగా పదినాళ్ళపాటు జరిగే బ్రహ్మోత్సవంలో పాల్గొనని భక్తులు, 'రథసప్తమి'నాటి ఉత్సవాలను దర్శిస్తే చాలు. బ్రహ్మోత్సవాలను పూర్తిగా దర్శించినఫలితం వస్తుందని పెద్దల మాట! ప్రత్యేకంగా 'రథసప్తమి' పండుగ రోజున శ్రీస్వామివారి ఉత్సవ వైభవాన్ని దర్శించినట్లైతే నవగ్రహదోషాలతో పాటు, అనేక ఇతర దోషాలు తొలగి కోరికలు సిద్ధిస్తాయి.

సూర్యప్రభవాహనం

తిరుమలలో రథసప్తమినాడు మొట్టమొదట జరిగే 'సూర్య ప్రభ' వాహనంలో గమనించవలసిన ఒక ప్రత్యేకత ఉంది.

సప్తాశ్వాలు పూన్చినబంగారు సూర్యప్రభవాహనంపైన శంఖచక్రగదానందక శార్ఙ్గపంచాయుధాలను ధరించి వజ్రకిరీటాది వజ్రాలహారాలతో, పూలహారాలతో అలంకరిస్తారు.

శ్రీమలయప్ప స్వామివారు సూర్యోదయానికి ముందుగా ఆలయం నుంచి మహాప్రదక్షిణమార్గంలో గజ, తురుగ, వృషభ భక్త బృందాలతో, కోలాహలంగా భజనబృందాలతో భక్తుల గోవింద నామఘోషలతో ఊరేగింపుగా బయలుదేరి "వాయవ్య మూలన ప్రత్యేకంగా శోభాయమానంగా తీర్చిదిద్ది ఏర్పాటు చేసిన "వేదిక" కిందకు వచ్చి సూర్యోదయానికి ముందుగానే నిలిచి ఉంటారు.

ఆ సూర్యోదయవేళలో సప్తాశ్వాలు పూన్చిన బంగారు సూర్యప్రభవాహనంపైన ఉన్న శ్రీవేంకటేశ్వరస్వామివారిని, ఎదురుగా ఉదయిస్తున్న శ్రీసూర్యభగవానుడు ప్రత్యక్షంగా తన అరుణకిరణాలతో పాదాలనుంచి కిరీటంవరకు అర్చిస్తుండగా, అర్చకస్వాములు బంగారుపళ్లెంలో ఫలాలనివేదనలతో దివ్య మంగళ కర్పూర నీరాజనాలు సమర్పిస్తారు.

బంగారుసూర్యప్రభవాహనంలో, ప్రత్యక్షసూర్యకిరణాల వెలుగులతో శోభాయమానంగా దర్శనమిస్తున్న రథసప్తమి నాటి సప్తగిరీశుని దర్శనమే దర్శనం! ఈ దర్శనం చేసుకొన్న భక్తులకు సూర్యగ్రహదోషాలతోపాటు, నవగ్రహదోషాలు అన్నీ తొలగి, ఆరోగ్యం కలుగుతుందనడంలో ఎంతమాత్రం సందేహం లేదు. ఆ తర్వాత సూర్యప్రభవాహనం వాహనమండపం చేరుకొంటుంది.

చిన్నశేషవాహనం

ఆ తర్వాత మలయప్పస్వామివారు ఒక్కడే ఐదుపడిగలు ఉన్న వెండి చిన్నశేషవాహనంలో ఊరేగుతూ దర్శనమిస్తారు. చిన్నశేషవాహనంలోని శ్రీవారిని దర్శిస్తేచాలు! నాగదోషాలు పరిహారమవుతాయి. వివాహం, సంతానం మొదలైన కోరికలు సిద్ధిస్తాయి.

గరుడవాహనం

రథసప్తమినాటి మూడవవాహనోత్సవం గరుడోత్సవం బంగారు గరుడనిపై శ్రీ మలయప్పస్వామివారు బంగారు హారాలతో, వజ్రకిరీటాది శంఖచక్రాలతో, పుష్పమాలలతో శోభాయమానంగా అలంకరింపబడి పురవీథుల్లో విహరిస్తూ అలరిస్తాడు. ఈనాటి గరుడవాహనోత్సవదర్శనంతో కష్టాలు తొలుగుతాయి. జీవితంలో అభివృద్ధి జరుగుతుంది. సంతానం కలుగుతుంది.

హనుమద్వాహనం

ఆ తర్వాత బంగారు హనుమంతునిపై శ్రీనివాసుడు కోదండ ధనుర్బాణాలను ధరించి వేంకటాద్రిరాముడుగా దర్శనమిస్తాడు. ఈ వాహనదర్శనంతో లౌకిక వాంఛలు తీరడమేగాక మోక్షం కలుగుతుంది. ప్రత్యేకంగా శనిగ్రహదోషాలు ఉంటే, వాళ్లు హనుమద్వాహన సేవను దర్శించుకుంటే మంచిది.

చక్రస్నానం

తర్వాత మధ్యలో శ్రీసుదర్శనభగవానునికి శ్రీస్వామి పుష్కరిణిలో చక్రస్నానం జరుగుతుంది. ఇది వాహనసేవ కాదు. కానీ చక్రస్నానంతోపాటు కోనేట్లో స్నానం చేసినట్లైతే శత్రు నాశనం కలుగుతుంది. భయం పోతుంది. ధైర్యసాహసాలు సిద్ధిస్తాయి.

కల్పవృక్షవాహనం

'రథసప్తమి'నాటి ఐదవవాహనం బంగారుకల్పవృక్ష వాహనం. కల్పవృక్షవాహనంలో శ్రీదేవీభూదేవులతో ఉంటే శ్రీమలయప్పస్వామిని దర్శిస్తేచాలు. కోరినకోరికలన్నీ సిద్ధిస్తాయి. ఈ కొండలరాయడు పారిజాతవృక్షమనీ, కాచే చింతామణి అనీ, కోరిక లిచ్చే కామధేనువునీ అన్నమాచార్యులు కూడ వర్ణించాడు.



సర్వభూపాలవాహనం

ఆరవవాహనం సర్వభూపాలవాహనం. ఈ వాహనంలో ఉభయదేవేరులతో కొలువై దర్శనమిస్తున్న కొండలరాయుణ్ణి దర్శించినట్లయితే, అడిగిన వరాలన్నింటినీ ఇస్తాడట!

ఈ వాహనాన్ని సర్వలోకాల్లోని చక్రవర్తులు మోస్తుంటారు. మహాదర్పంగా ఉండే బంగారుసర్వభూపాలవాహన దర్శనం. సర్వశ్రేయోదాయకం.

చంద్రప్రభవాహనం

రథసప్తమినాటి రాత్రి చంద్రోదయ వేళ చంద్రవాహనంపై ఊరేగుతూ శ్రీస్వామివారిదర్శనం ఆహ్లాదకరం! చంద్రుడు మనస్సుకు అధిపతి! కనుక ఈ వాహనదర్శనం మనశ్శాంతికరం! ఆనందప్రదం!

ఇలా నవగ్రహాలకధిపతి అయిన సూర్యునిజయంతి నాడు, సప్తగిరుల్లో సంచరించడం, సప్తగిరీశుణ్ణి దర్శించడం అనంతఫలప్రదం! అనంత ఐశ్వర్యప్రదం! సర్వార్థసిద్ధిప్రదం!

కైంకర్యమే.. తనువు దాల్చితే....

10

– డా॥ కంపల్లె రవిచంద్రన్, 98487 20478



(జరిగిన కథ - రామానుజులు కాంచీపూర్ణుని మహత్త్వాన్ని గుర్తించి తనను శిష్యునిగా స్వీకరించమని వారిని వేడుకుంటు న్నారు. కాంచీపూర్ణులు కాదు, కూడదు అన్నారు. అందుకు సమాధానంగా శ్రీరామానుజులు తిరుప్పాణాళ్వార్ కథ చెబుతున్నారు.)

నదిలోని రాళ్లు వెన్నెల మాయతో వెలికి తళుకులు చిలకరిస్తున్నాయి. పైన వెన్నెల! క్రింద ప్రవాహం! నడుమ పాట. ఆ చల్లని వెన్నెలలో లోకసారంగమహాముని కళ్లు అప్రయత్నంగా తిరుప్పాణ్‌ను వెదికాయి. చల్లని పిల్లగాలికి అల్లిబిల్లి కబురులతో తిరుప్పాణ్ పాటే మాటలు నేర్పింది. ఆ శబ్దతరంగాలు శ్రీరంగనాథుని చెవిలో ఊదేది గాలి ఈల కాదు, తిరుప్పాణ్ సందేశమని గ్రహించారు.

ఇంతలో ఉన్నట్లుండి గుడిలో గణగణలు విన్పించాయి. తిరుప్పాణ్ సందేశానికి శ్రీరంగనాథుని ప్రతిసందేశం. అది పాట, ఇది మోత – అదే వారి సంభాషణ. ఆకాశం వెలుతురుతో వెల్లువెత్తుతోంది. ఆ వెలుతురు ప్రవాహమే శ్రీరంగనాథుని ప్రతిసందేశం అని తెలుసుకోవడంలో అతనికి జ్ఞానోదయమైంది. తన తండ్రి, తన దేవుడు, అయిన శ్రీరంగనాథుని చూడకుండా, తాకి, సేవించి, తరించకుండా ఉండడం. ఒక్కరోజు కూడా భరించలేని తనలాంటి జీవుని వేదనే తిరుప్పాణ్‌ది కూడానని అర్థం చేసుకున్నారు. దేవుని సన్నిధి తనకు దూరమన్న ఆలోచనే తనకింత ఆందోళన కలిగించింది కదా, శ్రీరంగనికి కొన్ని సహస్రాబ్దాలు దూరమైన జాతి, పడే వేదన రుచి తనకు తెలియవచ్చింది. తేలికపడ్డ మనసుతో ఇల్లు చేరుకున్నారు.

ఉదయాత్పూర్వమే లోకసారంగముని తిరుప్పాణ్‌ను సమీపించారు.

"మహాభక్తా! తిరుప్పాణ్!"

"దేవా! నన్ను పిలిచినావా!"

"ఇటు చూడు – నిన్నే"

"మునీశ్వరా! చూడరాని నన్ను చూచితిరే! పిలువరాని వానిని పిలిచి ధన్యత కలిగించితిరే!"

"మహా కవీంద్రచంద్రా! శ్రీమహావిష్ణువు నిన్నాశీర్వదించాడు."

"ఎంత చల్లనిమాట! ఇదెంతటి ధన్యత!"

"ధన్యత నాది తిరుప్పాణ్! శ్రీమహావిష్ణువు నా కనుగ్రహించాడు" అని తిరుప్పాణ్ భుజం తాకారు – సారంగముని.

"నన్ను తాకుట, మీ అమృత హస్తంతో! ఎంత సుఖమీ స్పర్శ" అని పలికారు తిరుప్పాణ్!

"నిన్ను తాకగా, నాకెంత హాయిగా ఉంది"

అంటరాని నన్ను అంటిమీరు మలిన దేహులు కారాదు మునీంద్రా!"

"మలినమనస్కుల భావనమే మలినదేహం! నీది పవిత్రతేజం తిరుప్పాణ్!"

"ఏమి నాభాగ్యం! మీ ఆదరం లభించిన నేను భాగ్యవంతుణ్ణి!"

"భాగ్యం నాది. ఆనందం నాది. అదృష్టం నాది. త్రిలోకపూజ్యుడు, త్రికాలవేది, త్రిమూర్తి, తత్త్వనిధి,

శ్రీమహావిష్ణువు వరప్రసాదం నాది. నీవు ఆలయప్రవేశం చేయరావాలి"

"నేనా?! శ్రీరంగనాథ దేవాలయమా?!"

"అవును"

''భాగ్యమన్న నాదే! కానీ, మునీంద్రా అది సాధ్యమా?"

"దైవకార్యానికి అసాధ్యమేమున్నది?"

"నేను అంటరానివాడనుకదా?"

"శ్రీమహావిష్ణువు అలా భావించలేదు"

"మీరు రానీరు..."

"మేము రానీము - కాని తీసికొని పోగలం!"

"నేను రాలేక, మీరు తీసికొని పోవడమెలా?"

"మోసుకొని పోవడం"

"ఎవరు?"

"నేను"

"ఎవరిని?"

"నిన్ను!"



"అదెలాసాధ్యం?"

"నా భుజపీఠిపై నీవు అధివసించిన సాధ్యమే!"

"అది న్యాయమా?"

"దైవకార్యం!"

"మీకు సమ్మతమా?"

"దైవేచ్ఛ!"

"ఇది సంభవమా?"

"సంభవమే!"

"నేను రాగలనా?"

"రాక తప్పదు".

"దేవా! ఇదా నీ లీల? అంటరానివాడినని, నేను వస్తే ఆలయమే అపవిత్రమైపోతుందని అన్నారు కదా! అలాంటిది మీ భుజాలమీద శ్రీరంగరంగా - నావల్ల కాదు."

"నీవు పంచముడవే! ఆలయప్రవేశం నిషిద్ధమే! నీవు- భక్తుడు - భగవంతుని దర్శించుట న్యాయమే! శ్రీరంగ నాథుడు నిన్ను చూడగోరినాడు! అది ఆజ్ఞ! ఆ కోర్కెతీర్చుట నా విధి. అందుకిదే మార్గం. నీవు నా భుజాలమీద గుడి చొచ్చిన దోషమంటదు. మైలలేదు శ్రీరంగనాథునికోసం, నీ ఆశకు, నా విధికి సాఫల్యం.

"పవిత్రుల్ని అపవిత్రులుగా చూడలేను."

"ఉచితానుచితత, పవిత్రతాపవిత్రత, శ్రీమహావిష్ణువు. నాకేమి నిమిత్తం లేదు. నీవు ఇందులో బాధపడాల్సిందేమీ లేదు."

"చూడరాని, పిలువరాని, తలచరాని, తాకరాని పంచముడు, శ్రీరంగనాథ దేవాలయధర్మకర్త, బ్రాహ్మణోత్తముడు, లోకసారంగ మనీశ్వరుల భుజాగ్ర పీఠినధివసించ నౌనగూడుట - దేవా, ఇది నీ వినోదమా! ఇది నీ విలాసమా!!

లోకసారంగముని భుజాలమీద తిరుప్పాణ్...ఈ దృశ్యం చూస్తుంటే అక్కడి జనులందరూ సంభ్రమాశ్చర్యాలతో చూస్తున్నారు. *(ఇంకా ఉంది)*

కడపరాయుని తేరు తిరునాళ్ల

– శ్రీ కట్టా నరసింహులు, 94413 37542

తిరుమల నుంచి కడపజిల్లాలోకి వ్యాపించే శేషాచలం కొండల్ని కడప సమీపంలో పాలకొండలు అంటారు. ఈ పాల కొండల్లో విష్ణుమూర్తి పాదముద్రలున్నాయంటారు. పాదముద్రల ప్రాంతం నుంచి వర్షజలంతో ఏర్పడ్డ బుగ్గవంక కొన్నిమైళ్లు ప్రవహించి పెన్నానదిలో కలుస్తుంది. శ్రీవేంకటేశ్వరస్వామి తన తమ్ముడు పాలకొండరాయణ్ణి ఈ కొండల్లో వదలి తాను తిరుమలకు వేంచేశాడని జనంలో ఒక కథనం ఉంది. అటు బుగ్గవంకకు, ఇటు పెన్నకు కొద్దిదూరంలో వెలసిన నిలయం దేవునికడప. ఇక్కడుండే స్వామిని కడప వేంకటేశ్వరులు అనీ తిరువేంగళనాథుడు అని పిలుస్తారు.

ఐతిహ్యం

ఇక్కడ వెలసిన స్వామి విగ్రహాన్ని తిరుపతిలోని చెరువు కట్టమీది నుంచి తీసుకువచ్చి జనమేజయ మహారాజు ప్రతిష్ఠించినట్లు (కడపశహర్‌వృత్తాంతం) కైఫియత్తు అంటున్నది. తిరుపతిని సందర్శించిన ఆ మహారాజుకు ఆ రాత్రి స్వామి కలలో కనిపించాడు. తనను ప్రతిష్ఠించమన్నాడు. మరుసటి దినం ఆ స్వామిని వెదకి తెచ్చి ఇక్కడ నిలిపాడు. పదుంబ పదకొండో శతాబ్దంలో ఈ ప్రాంతం మీద పెత్తనం చేసిన వేలూరు బ్రహ్మారెడ్డి ఇక్కడ చెరువును నిర్మించాడు. విజయనగరచక్రవర్తులు, నంద్యాల రాజులు, మట్ల రాజులు ఈ ఆలయాన్ని పోషించారు.

ఆలయం

ఈ ఆలయానికి క్షేత్రపాలకుడు ఆంజనేయస్వామి. వేంకటేశ్వరస్వామిని దర్శించుకొన్న భక్తులు, స్వామికి ఎడమవైపుగా ఉన్న అమ్మవారిని దర్శించుకొంటారు. విష్వక్సేనమందిరం, నాగుల విగ్రహాలు, ఆండాళ్ మందిరం, శమీవృక్షం, ఆళ్వార్ల సన్నిధి, కల్యాణమంటపం, పుష్కరిణి, అద్దాలమహల్ ఇక్కడ దర్శించుకోదగ్గవి. అమ్మవారిఆలయం ముందు పై కప్పులో రాతిబల్లులున్నాయి. భక్తులు తమ దోషాలు పోగొట్టుకొనేందుకు ఈ రాతి బల్లుల్ని తాకుతుంటారు.





యాత్రికులు

దేవునికడపఆలయం తిరుమల మహాక్షేత్రానికి ఉత్తర ద్వారంగా ఉంది. కడప ప్రాంతీయులు, కడపకు ఈవలి ప్రాంతం నుంచి తిరుమలకు వెళ్లే యాత్రికులు మొదట కడప శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకొని, తిరుమలకు యాత్ర చేస్తారు. ఏవైనా అసందర్భాలు ఏర్పడి తిరుమలకు వెళ్లలేని యాత్రికులు ఈ స్వామిని దర్శించుకొని తమ మొక్కుబళ్లు చెల్లించుకొంటారు.

ఆంగ్లసంవత్సరాది మొదలుకొని వైకుంఠఏకాదశి, ఉగాది, రథసప్తమివంటి

ఉత్సవాలు కిటకిటలాడుతున్న భక్తులతో కన్నులపండువుగా సాగుతూ ఉంటాయి. ఉగాది పండుగనాడు మహమ్మదీయులు పురుషులుమాత్రమే కాకుండా మహిళలూ సకుటుంబంగా విచ్చేసి స్వామిని దర్శించుకోవడం విశేషం. వైకుంఠఏకాదశినాడు ఆలయం భక్తులతో కిక్కిరిసి ఉంటుంది.

అధ్యయనోత్సవాలు, నీరాటోత్సవాలు, నవరాత్రి ఉత్స వాలు ఈ కడపగుడిలో ప్రతేకఆకర్షణ. తెప్పోత్సవం నిర్వహి స్తారు. ఈ ఉత్సవానికి పుష్కరిణిని ప్రౌఢదేవరాయలు క్రీ.శ. 1436లో నిర్మించారు. క్రీ.శ.1517లో మహామంత్రి తిమ్మ రుసు ఈ ఆలయానికి బహుళ సేవలందించాడు.

బ్రహ్మోత్సవాలు

మాఘశుద్ధపాడ్యమి నుంచి సప్తమివరకూ ఏడుదినాలు ఈ ఆలయంలో బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవోపేతంగా, ఘనంగా నిర్వహిస్తారు.



రథసప్తమినాటి తేరుతిరునాళ్లు సంవత్సరం పొడవుగా జరిగే ఉత్సవాలలో అధిక ప్రాధాన్యం సంతరించుకొంటుంది. "కాదనకు నా మాట కడపరాయా!" అంటూ తాళ్లపాక అన్నమాచార్యులు ఈ స్వామిని ఉద్దేశించి ఏబది పైగా పాటలు రచించాడు. ఆయన ఇక్కడి రథోత్సవాన్ని చూచి ఎంతగా తన్మయం చెందాడో ఆయన గానం చేసిన తేరుపాట తెలియ జేస్తుంది.

కన్నుల పండుగ లాయఁ గడప రాయని తేరు
మిన్ను నేల శృంగారము మితిమీరి నట్లు

కదలె గదలె నదె గరుడధ్వజుని తేరు
పొదిగి దేవ దుందుభులు మ్రోయగా
పదివేల సూర్యబింబము లుదయించి నట్లు
పొదల మేరువు వచ్చి పొడ చూపి నట్లు

వచ్చె వచ్చె నంతనింత వాసుదేవుని తేరు
అచ్చుగ దేవకామిను లాడి పాడగా
ముచ్చటతో గరుడుడు ముందట నిలిచినట్లు
మెచ్చుల మెరుగులతో మేఘము వాలి నట్లు

తిరిగెఁ దిరిగె నదె దేవదేవోత్తము తేరు
సరుస దేవతలెల్ల జయవెట్టగా
విరివిఁ గడపలో శ్రీవేంకటేశుడు తేరుపై
నిరవాయ సింహాసన మిదే యన్నట్లు

(217 వ రేకు, సంపుటం 3-93)

మాఘపంచమి నాటి గరుడవాహనం, షష్ఠినాటి స్వామి కల్యాణం, సప్తమినాటి రథోత్సవంతో పాటు బ్రహ్మోత్సవాల చివరగా ఇటీవల తిరుమల తిరుపతి దేవస్థానంవారు ప్రారం భించి ప్రవేశపెట్టిన "పుష్పయాగం" చూడముచ్చటగా ఉంటాయి.

2017 ఫిబ్రవరి 3వ తేదీ రథసప్తమినాడు కడప రాయనితేరు తిరుమాడవీథుల్లో వేలాదిభక్తులకు దివ్యదర్శన మిస్తుంది.

పదివేలసూర్యబింబాలు ఉదయించినట్లు, మేరు పర్వతం వచ్చి నిలిచినట్లు, దేవదుందుభుల మోతలమధ్య, అప్సరసల ఆటలమధ్య దేవతలు జేజేలు పెడుతూ ఉండగా ఆతేరుమీద తిరువేంగళనాథుడు ఊరేగుతాడు.





కీ.శే. మల్లాది రామకృష్ణశాస్త్రి విరచిత

గిరిజాకల్యాణం (యక్షగానం)

మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా 'కేళీగోపాలమ్' లోని 'గిరిజాకల్యాణం' యక్షగానం మీ కోసం....

తెలుగు సాహితీచరిత్రలో యక్షగాన రచనలో కూచిపూడివారి నృత్యప్రదర్శనకు అనుగుణంగా, సర్వకళల సమాహారంగా **'గిరిజా కల్యాణం'** అనే యక్షగానాన్ని నిర్మించిన ఖ్యాతి శ్రీమల్లాది రామ కృష్ణశాస్త్రిగారికే దక్కుతుంది. ఇది గిరిజాకల్యాణం పేరుతో కాకుండా **'కేళీగోపాలమ్'** శీర్షికన ప్రచురితమైంది.

మల్లాదిరామకృష్ణశాస్త్రిగారే 'కేళీగోపాలమ్' పేరిట 1967 జనవరిలో ఒక పుస్తకాన్ని ప్రచురించారు. అందులో ఉన్న నాలుగు రూపకములలో 'కేళీగోపాలమ్' కూడా ఉన్నది. ఈ 'కేళీ గోపాలమ్' పెద్ద రచన.

'గిరిజాకల్యాణం' యక్షగానాన్ని లఘుప్రబంధంతో పోల్చ వచ్చు. వీర, శృంగార, భయ, రౌద్ర, కరుణరసాదులతో మంగ ళాది, మంగళ మధ్యాని, మంగళాంతాని అనే భరతముని నాట్య శాస్త్ర ప్రమాణాలతో వినిర్మించబడినది. వస్తువు పార్వతీపరమేశ్వ రుల కల్యాణమే. ఈ కల్యాణం సిద్ధించడానికి పార్వతీదేవి భక్తి మార్గంలో వెళుతుంది. కార్యము వేగవంతం కావాలంటే, రక్తి మార్గమే శరణ్యమని మరోవైపు మన్మథుడు అహంతో ప్రయత్నించి, ముక్కంటి మూడోనేత్రానికి విదగ్ధుడవుతాడు. పతిని కోల్పోయిన రతీదేవి విలాపం, పార్వతి హృదయాన్ని కదిలిస్తుంది. మాడి మసి అయిన మన్మథుడు మానస పుత్రునితో సమానమని, శివునితో అనునయంగా చెప్పి మళ్లీ బ్రతికిస్తుంది. గిరిబాల కరుణను, ఆర్ద్ర చిత్తాన్ని గ్రహించి శివుడు ప్రసన్నుడై ఆమెను పరిణయమాడుతాడు. గిరిజాకల్యాణం, లోకకల్యాణమేనన్న భావనతో సమాప్తమవుతుంది.

ఇష్టదేవతా ప్రార్థనతో కావ్యము ప్రారంభమైనట్లే, ఈ యక్షగానం కూడా అమ్మవారి స్తుతితో మొదలవుతుంది. ఆ తదు పరి సూత్రధారుడు 'అవధరించరయ్యా' అని పార్వతీపరమేశ్వరుల పరిణయగాథను ప్రదర్శించబోయే విధానాన్ని రెండు పంక్తుల్లో కథను క్లుప్తంగా వివరిస్తాడు. 'తన లలనను పెళ్లాడిన ప్రబంధము' అని కావ్యస్థాయిని చెప్పకనే చెబుతాడు. 'అభ్యుదయ పరంపరగా యొనర్చుకావ్యము' అని ప్రబంధ కవులు తెలిపిన రీతికి ఇది తుల తూగుతుంది.

ఈ గిరిజాకల్యాణం (యక్షగానం)
వివిధ ప్రసార మాధ్యమాల ద్వారా
గతంలో విశేషఖ్యాతి గడించింది.
అపురూప సాహిత్యానికి కాలపరిమితి లేదు.
అలా ఎన్నియేండ్లు గడచినా శ్రోతల / పాఠకుల
హృదయాలలో నిలిచిపోయిన
ఈ అనర్ఘరత్నం మీ కోసం....

ఇక్కడ నాయిక పార్వతి, నాయకుడు శివుడు. మన్మథుడు ప్రతినాయకుని వలె అగుపిస్తాడు. రతీదేవి శోక విదగ్ధ. ఈ నలువురి మధ్య కథ సాగుతుంది.

గిరిజాకల్యాణం

(నమశ్శివాభ్యామ్.... శంకరపార్వతీభ్యామ్।) మంగళా చరణానంతరము, నాట్యాచార్యుడు సభవారిని ఉద్దేశించి పలికే వచనం)

వెన్న దిన్న చిన్నవాని కొలిచే వేడుకలో మైమరచు సరసుల మన్ననలే శిరసావహించు భాగవతులు ప్రదర్శించే కేళీ గోపాలమనే యక్షగాన ప్రబంధమ్ము కనుకలి వినుకలి కలిమికి నోచిన వారికి విందయ్యేనని సవినయాన సాభినయాన విన్నవిం చేను – జయ హరి హర నాథ! యిందులకు పూర్వకథాసందర్భం బేలాటిదనగా! లీలామానుషవిగ్రహులైన గోపాలదేవుడు, ద్వారకా నగరిలో, పుత్రపౌత్రాభివృద్ధిగా, నిత్యానందులై, సంసారసుఖాన, ఉన్నటువంటి వారుకాగా –

ఒకానొక తరుణాన సదరు శ్రీ కృష్ణపరమాత్మ మనుమడై నటువంటి అనిరుద్ధకుమారుడు అనే సుందరాంగుణ్ణి, పార్వతి అమ్మవారి కటాక్షం పరిపూర్ణంగా లభించినటువంటి ఉషాబాల అని పేరొందిన బాణాసురుని ఏకైకపుత్రిక కలలో జూచి, వరించి, తనకు కూరిమి చెలికత్తెగా మెలగుతూ, మంత్రతంత్రాదులలో బహునిపుణురాలైన చిత్రలేఖ అనే చిన్నదానికి తాను మరులైన వైనం తేటతెల్లము సేయగా, ఆ జాణ శాంబరీ విద్యను ప్రయో గించినదై, ద్వారకానగరిలో సుఖనిద్రలో ఉన్న ఆ సుకుమారుణ్ణి ఉషాబాల పడకటింట చేర్చినదాయెను–

ఆపై ఆ జగన్మాత అనుగ్రహాన వారిరువురూ గాంధర్వ మాడి, ఇష్టభోగాల దేలుతూ ఉండగా, ఈ సల్లాపము బాణాసురు డికి తెలిసి, అనిరుద్ధ కుమారుణ్ణి నాగపాశం వేసి బంధించగా, ఆ చిన్నవాడు మరియాదకు అలా అక్కడ కట్టుబడి ఉండగా –

ఒకరు చేసిన భాగ్యమొకరికి ఏలవచ్చు?

ఈ వర్తమానం ద్వారకలోవారికి నారదులవారివల్ల తెలిసింది. అంతట శ్రీకృష్ణులవారు హుటాహుటి శోణపురానికి తన బలగంతో తరలివచ్చారు.

వచ్చింది ఏ తీరున – వీరోచితమైన అట్టహాసంతోనా?
కాదు!
వియ్యమొందినవారు కయ్యమాడేరా?

మెత్తగా మందలించి, మేలవాడి, మాయజేసి, తన మనుమని మామను చరితార్థుని చేయవలెనని ఆ వేషధారి వేషం కట్టినాడు.

ద్వారకనుండి కదలినవారు యాదవులు,
శోణపురం జేరినవారు భాగవతులు!

తీరా, కోటగుమ్మంవద్ద కాపున్నదెవరు – ఆ ఈశ్వరుడు! సర్వమూ తెలిసినవారి అనుమతి పొందినట్టివారై, ఈ భాగవతులు బాణుని సభాభవనంలో పార్వతీపరమేశ్వరుల సాక్షాత్ సన్నిధిలో గిరిజాకల్యాణం, నాట్యాభినయాల ప్రదర్శించనున్నారు జయహర గోవింద!

(సూత్రధారుడు చేసే ప్రార్థన)

(శంకరాభరణం)

వరదాభయ లీలామయ - లేలిహాన మణివలయా
ఆరిందమా ఉమామనా - కరుణా వరుణాలయా - సాహో పరమేశ్వరా!

(ఆనందభైరవి)

సుమలాలిత మలయానిల - లోల చూర్ణకుంతలా
పురసూదన వరవర్ణిని - బాహులేయ జననీ! సాహో పరమేశ్వరీ!


(బహుపరాకులు)

(హంసధ్వని)

ఉమామహేశ్వర ప్రసాద లబ్ధ పూర్ణ జీవనా!
చండ భుజామండల దోర్ధూయమాన వైరిగణా! బహుపరాక్!
దిక్కరీంద్ర ఘీంకరణా బహు పరాక్! బహుపరాక్!
శోణపురీ మండనాయమాన బాణ స్వారభౌమ! బహుపరాక్!
వచనం - ఆవధారుదేవా!

(మధ్యమావతి)

మిము దీవించి మీ వీట నిలచి
సేవలందుకొను దేవీ దేవర
పావన సన్నిధిలోఁ- జయ్ మహాదేవ!
ఈశుని మ్రోల హిమగిరి బాల
కన్నెతనము ధన్యమైనగాధ? జయ జయ, హో
తన తాపముతో మారుని రూపము బాపీ, - ఆ కోపీ
కాకలు దీరి, - కను దెరచీ తను దెలసీ - తన
లలనను పరిణయమైన ప్రబంధము -



ఒంధుర నవరసగీతుల నటనల రీతులు
రూపక రూపమునా...
అభినయించ మిమ్మను కరించ మ
మ్మను మతించరో,- జయ జయ, హో

వచనం - ఈ ప్రకారంబుగా ఇష్టదేవతా వందనంబు గావించీ, ఎదుటనున్న ఏలికను సంభావించీ, సభలోనున్న పిన్నలను పెద్దలను మన్నన జేసి ఇతివృత్తంబు సూక్ష్మంబుగా విన్నవించి ఆదిమూర్తుల ముగుదలనంది, ఇంక అనంతర కరణీయం బాచరించేమయా!

(తాళ-రవళి) ఇదిగో, ఈ హిమగిరి సానువుల నిత్యోత్సవ విహారముల మెలగే చెలికత్తెలు నగరాజకుమారిని ఎటువలె ఆహ్వానించెరన గాను-

(కాంభోజి)

రావో, లోల లోల లోలంబాలక
రాజస లోచన రాజాననా!
లోకోత్తర మహోన్నతుని తనయా - మేనాకుమారి! రావో!

వచనం - తము చేరవచ్చిన ఉమాబాలతో చెలిమికత్తెలు చెలిమిబలిమిని ఆ మీనలోచని భావమెరుంగ పలుకాడే తీరు ఎట్టిదనగాను -

కట్టి పెట్టవశమా? గాలి ముదియగాగ

(అఠాణా!)

చెలువారు మోమున లే లేత నగవూల
కలహంస గమనాన కలికీ ఎక్కడికే?
మానస సరసీని మణిపద్మదళముల
రాణించు అల రాజహంస సన్నిధికే!
వావిలి పూవూల మాలలు గైసేసి
వయ్యారి నడలా బాలా ఎక్కడికే?
కన్నార నన్నేల కైలాసనిలయాన
కొలువైన అల దేవదేవు సన్నిధికే!
వచనం - అప్పుడా నెచ్చెలులు ఉమాబాలను సాగనంపే రెట్లనగాను -

(కేదారగౌళ)

పోయిరా శిరీష కోమలా, బాలా లలామ
పోయిరా మరాళగామినీ,
బెదురులేక బిడియపడక - చేరబోయి సేవలుజేసి
వకుళ దామమున స్వామిని వశంవదునిగా జేకొన
పోయిరా అరాళ కుంతలా
ఐదువరాల-పోయిరా!
మన్మథుని దరవు - వసంత
తగదిది - తగదిది - తగదిది!
ధరణీధర వరసుకుమారీ - తగదిది!
అండగా మదనుడుండగా, మన
విరిశరముల పదనుండగా
నిను బోలిన కులపావని తానై
వరుననరయగ బోవలెనా? - ॥
కోరిన వాడెవడైనా ఎంతటి ఘనుడైనా
కోలనేయనా, సరసను కూలనేయనా!
కనుగొనల ననమొనల
గాసిజేసి నీదాసు జేయనా!
వచనం - అప్పుడు పార్వతి పలికే ప్రతివచనము ఎలాగంటేను -

(రీతిగౌళ)

ఈశుని దాసుని జేతువ అపసద
అపచారము గాదా!
కోలల కూలెడి అలసుడు కాడూ
ఆదిదేవు డతడూ!
సేవలుజేసి ప్రసన్నుని జేయ
నాస్వామి నన్నేలు నోయీ! -
నీసాయమె వలదోయీ!

(దురితం - శహన)

కాని పని మదనా!
అహంకరింతువ హరుని జయింతువ
అది నీ చేతకాని పని మదనా!

వచనం - మన్మథుడు అంతటితోనైనా ఇంగితములేక మరల హుంకరించగా చెలికత్తెలు హితము చెప్పేతీరు-

(సరస్వతి)

చిలుక తత్తడి రౌత ఎందుకీ హుంకరింత?
వినకపోతివా, యింతటితో నీ విరిశరముల పనిసరి
సింగిణిపనిసరి తేజీపనిసరి!
చిగురుకు నీ పని సరి మదనా!
వచనం - ఉమాబాల ధ్యాన నిష్ఠలో ఉన్న సదాశివుని సేవించే విధమెలాటి దనుగాను!

(హిందోళ)

సామగ సాగమ సాధారా! - శారద నీరద సాకార!
ధీనా ధీనా ధీసార!
ఇవె కైమోడ్పులు - యివె సరి జోతలు
వినతులివే అరవిందోజ్జ్వలా
ఇదె వకుళాంజలి మహనీయా
ఇదె హృదయాంజలి ఈశ మహేశ!
వచనం - ఉమాబాల వకుళమాలను స్వామివారి హస్తముల నుంచగా, పొంచివున్న మన్మథుడు బాణము వేయగా, వారు ఉగ్రులై, మన్మథుణ్ణి రూపమాపి వేసినవారు కాగా, రతీదేవి స్వామిని వేడుకొనే విధమెలా గంటేను -

(నాదనామ క్రియ)

పతిభిక్షప్రభూ!
విరుల న్నిను పూజసేయగా

వైకుంఠపాళి
:: 15 - సమాధానాలు ::

	1 కు	2 ల	శే	3 ఖ	రా	4 ళ్వా	రు	
5 ఆ		చ్చి		గ		మా		6 గా
7 రా	ధ		8 శ్రీ	ప	తి		9 ఛా	య
మం		10 ప		తి		11 వి		త్రి
	12 టి	ట్టి	భం		13 క	లా	పి	
14 ఔ		సం		15 తా		సి		16 క్షే
17 య	దు		18 నా	ళ	ము		19 యా	త్ర
ప		20 చే		ధ్వ		21 ద్రి		య్య
	22 స్థా	వ	ర	జం	గ	మా	లు	

కూరిమి లేని చోట కొసరులే కసరులౌ



(కన్నడ)

కరుణన్ గిరిరాజ కన్యకన్ - సతిగా దాము పరిగ్రహింపగా
మరుదేపున రూపున వర్ధిలుగా - రతిమాంగల్యము రక్షసేయవా!
వచనం- ఉమాబాల విన్నపము

(సామ)

అంబా! అని అసమశరుడు నను బిలిచెను వినవో
జనకుడవై ఆదరణగ తనయునిగా జేకొనలేవో!
మనమే నీ మననమై తనువే నీ ధ్యానమై
నీ భావన లీనమైన గిరిబాల నేలవో!
శరణం భవ శరణం భవ శరణం భవ స్వామిన్
పరిపాలయ పరిపాలయ పరిపాలయ మాం స్వామిన్
వచనం - లోక సంగ్రహార్థము ఈ తీరున లీలావినోదులైన ఆదిదేవులు
తన ఇల్లాలిని తాను చేపట్టగా -

(సౌరాష్ట్ర)

బిడియపడి భీష్మించి పెండ్లి కొడు కాయెనూ
మా తండ్రి మేలు మేలు!
విరులచే వరునిచే కరము చేకొన జేసె
మా తల్లి మేలు మేలు!
నాట్యాచారుని వచనం -

అది దంపతుల పరిణయ గాథను ప్రదర్శించ నోచిన ఆనంద పారవశ్యములో భాగవతులుగా వచ్చిన గోపాలు రందరూ జయ ద్వారకా వాసా అని ఎలుగెత్తగా, అప్పటికి బాణుడు నడిచిన నాటక మిదియా అని గుర్తించి, కృష్ణునితో పోరుకు దిగి, పరాభూతుడై బహుమానితుడై ఐహికా నందము పరిపూర్ణము అనుభవించిన కథా విధానము లోకవిదితమే కదా! ఈ నాట్యప్రబంధము కన్నవారిదే కలిమి, విన్నవారిదే భాగ్యము! జయలీలావినోద!

విధిగా నిన్నొక గేస్తు జేయగా
దొరకన్న రసావతారు చి
చ్చర కంటన్ పరిమార్తువా ప్రభూ!

(క్రియేటివ్ లింక్స్ పబ్లికేషన్స్, హైదరాబాదువారి అనుమతితో ముద్రితం)

శివుని ఆజ్ఞలేనిదే చీమైనా కుట్టదు



భగవంతుడు మనకు మానవజన్మ ఎందుకిచ్చాడో తెలుసుకుంటే ఈ సందేహానికి జవాబు లభిస్తుంది. మానవుడు గత జన్మల్లో చేసుకున్న కర్మఫలాన్ని అనుభవించ డానికే ఈ జన్మ ఎత్తుతాడు. కర్మానుభవం పూర్తి చేసుకుని మరలా సృష్టికర్త అయిన భగవంతుడి దగ్గరికే చేరుకుంటాడు. ఇక్కడ తెలుసుకోవలసిన విశేషం ఏమంటే, మనం చేసే కర్మలకు ఫలాలనిచ్చేవాడు భగవంతుడే! అందుకే శివుడి ఆజ్ఞ లేనిదే చీమైనా కుట్టదన్నారు. మనం చేసుకున్న కర్మఫలాలను ఆయా మన జన్మలకు కేటాయించేదీ భగవంతుడే. మన కర్మానుభవం పూర్తి చేసుకోవడానికి జన్మ ఎత్తి, ఆ జన్మలో మరికొన్ని పాపాలు, పుణ్యాలుచేసి, మరింతగా ఈ జననమరణచక్రంలో కూరుకుపోతుంటాం. మాధవసేవగా, సర్వప్రాణికోటి సేవచేస్తూ, ధర్మయుక్తంగా అర్థాన్ని, కామాన్ని పొంది, భగవంతునికి శరణాగతి చేస్తే, భగవంతుడే మన ప్రారబ్ధాన్ని సుఖప్రారబ్ధంగా మార్చి మనల్ని కడ తేరుస్తాడు. ఇదే ఏ మానవుడైనా కోరుకోవలసింది.

గృహలక్ష్మి

మాఘవైభవం

- ప్రాచార్య శలాక రఘునాథశర్మ, 98660 68542

'కాలాత్మక పరమేశ్వర రామ' అంటారు తత్త్వజ్ఞులు. పరమేశ్వరుడు కాలాత్మకుడు. కాలాత్మకుడు శ్రీరామచంద్రుడు. మానవుడు కాలజ్ఞానంద్వారా కూడా పరమేశ్వరారాధన చేయవచ్చని ఆ వాక్యంలోని అంతరార్థం. నిమేషం మొదలుకొని సంవత్సరం వరకు పదకొండు కాలవిభాగాలను భారతీయులు గుర్తించారు. అందులో 'మాసం' ఒకటి. మఘా నక్షత్రంతో కలసి ఉన్న పూర్ణిమ గల కాలప్రమాణాన్ని "మాఘం' అంటారు. నిజానికి ఏ మాసం ప్రత్యేకత ఆ మాసానిదే.

అశ్విని మొదలైన నక్షత్రాల వరుసలో మఘ పదవది. ఏదో ఒక నిమిత్తాన్ని సంభావించి దైవజ్ఞులు అనేక దినాలను పర్వ దినాలుగా నిర్దేశించారు. అది నిమిత్తంగా చేసుకొని సర్వమూ తానయైన పరమాత్మను యథాశక్తి అర్చించి త్రికరణశుద్ధిని సాధించాలని వారి ఉద్దేశం. మాఘమాసంలో అటువంటి పర్వదినాలు చాలానే ఉన్నాయి. శ్రీపంచమి, రథసప్తమి, భీష్మాష్టమి, మాఘపూర్ణిమ, మహాశివరాత్రి అనేవి మరింత వైశిష్ట్యం కలవి. సూక్ష్మదృష్టితో ఆలోచిస్తే **శ్రీపంచమి సరస్వతీ ఆరాధనకు ప్రధానంగా, సంబంధించినది. సరస్వతీదేవి అంటే జ్ఞానశక్తి. అది అంబికాతత్త్వానికి సంకేతం.** రథసప్తమి శ్రీసూర్యనారాయణ రూప పరమాత్మను దృష్టిలో ఉంచుకొని ఏర్పడింది. అంటే అది విష్ణుతత్త్వానికీ, ఆదిత్యతత్త్వానికీ సంబంధించినది. మాఘపూర్ణిమ విశిష్టతను గూర్చి ఆంధ్రశేషగిరిరావుగారు 'పండుగలు- పరమార్థాలు' అనే గ్రంథంలో ఇచ్చిన వివరాలను గమనిస్తే అదంతా జలాధిదేవతకు సంబం ధించిన విశేషాంశంగా కన్పిస్తున్నది. దానిని ఉపలక్షణంగా తీసుకొని మాఘపూర్ణిమ పంచభూతాల సమాహారరూపార్చన పరమైనది అనుకొంటే అది గణపతితత్త్వానికి సంకేతంగా నిలుస్తుంది.



ఇంక మహాశివరాత్రి. మాఘబహుళచతుర్దశినాడు ఇంచుమించుగా భారతదేశమంతా ఈ పర్వాన్ని భక్తిశ్రద్ధలతో ఆచరించుకొంటుంది. శివుడు లింగరూపంలో ఆవిర్భవించిన మహాపర్వం ఇది. ఇది మహాదేవారాధనకు సంబంధించిన విశిష్టదినం.

ఇలా మాఘమాసం పంచాయతన ఆరాధనతో నిలువెల్లా పులకరింపజేసే కాలవిభాగం.

ఇందులో శ్రీపంచమి జ్ఞానశక్తికి చెందినదనుకొన్నాం కనుక, రథసప్తమి క్రియాశక్తికి చెందినదిగా, మహాశివరాత్రి ఇచ్ఛాశక్తికి చెందినదిగా భావిస్తే మాఘమాసం శక్తిత్రయాత్మక స్వరూపంగా మానవులను పరమాత్మాభిముఖంగా పయనించటానికి పరికొల్పుతున్నదనే స్ఫురణ కలుగుతున్నది.

మాఘంతో శిశిరర్తువు ప్రారంభమవుతుంది. చలిచేత దేహాన్ని కుంచించుకుపోయేట్లు చేసేది అని శిశిర శబ్దానికి నిరుక్తి, తరువాతిదైన వసంతం మళ్ళీ ఆ కుంచించుకుపోయిన దేహాన్ని సుస్థితికి తెస్తుంది. అంటే శిశిరర్తువు కాలచక్రంలో ముగింపు దశ. మొదటిదశ మొదలుకొని ముగింపుదశవరకూ వస్తున్న జీవన గమనం పంటకు వచ్చే కాలంగా దీనిని సంభావించాలి. క్రుంగుదల పొందిన దేహాదికమే పొంగుదలను చక్కగా స్వీకరించగలుగుతుంది. అటువంటి స్వీకారానికి జీవకోటిని సన్నద్ధంచేసే విశిష్టమాసంమాఘం. ఆయుర్వేదశాస్త్రం విధిస్తున్న కాయకల్పచికిత్సవంటిది ఈ మాఘమాస వ్యవహారం. ఈ శిశిరర్తువును ఆకులు రాలే కాలం అంటారు. ఆకులు రాలటం ఎంత సమగ్రంగా జరుగుతుందో చెట్లు చిగురించే ప్రక్రియ తర్వాతి ఋతువులో అంతపటిష్ఠంగా జరుగుతుంది. అటువంటి మహోదాత్తఫలాన్ని ప్రాణికోటికి అందించటానికి ప్రకృతిని సన్నద్ధం చేసే గొప్ప కాలం మాఘమాసం.


ప్రకృతికాంత ప్రాతచీరను తీసివేసి చిత్రవిచిత్రవర్ణమయమైన క్రొత్తచీరను ధరించి దివ్యకాంతులతో ప్రకాశించటానికి వీలు కల్పించే ఉదాత్తలక్ష్యంగల కాలం మాఘమాసం. అందువలనే ఈ మాసలక్ష్మి మహాశివరాత్రిపర్వం ముగింపుతో, తర్వాతి వసంతలక్ష్మికి స్వాగతం చెబుతున్నది. మహాశివుడు లయకారుడు. ఆ విధంగా మాఘమాసం పునస్సృష్టికి ద్వారప్రాయం అవుతూ గొప్ప త్యాగశీలం కలదిగా గణనకు వస్తుంది.

పాడి చెప్పెనని వచ్చి పక్షపాతమాడరాదు

త్రిమూర్తులచే వరాల్ని పొంది, ధర్మవర్తనచే తపస్సం పదచే చిరంజీవియై విలసిల్లిన మార్కండేయుడు ప్రాచీన భారత మహర్షుల్లో అగ్రగణ్యుడు. భార్గవుడు, భార్గవసత్తముడు, భృగు కుల శ్రేష్ఠుడు, భృగునందనుడు అనేవి ఆయన నామాంతరాలు. అనేక యుగసహస్రజీవియైన ఆ మహర్షి శ్రేష్ఠుడు ఈ నాటికీ ఎచ్చటనో ఉన్నాడని మనవాళ్ళ విశ్వాసం.

సామాన్యంగా బిడ్డ పుట్టినపుడు 'జన్మపత్రిక' వ్రాయించే అలవాటు ఈనాటికీ మనలో నిలిచివుంది. ఆ జన్మపత్రికలో ఒకచోట "మార్కండేయవత్ దీర్ఘాయుః భూయాత్" (ఈ శిశువు మార్కండేయుని వలె దీర్ఘాయుష్మంతుడగుగాక) అని వ్రాస్తారు.

ఈ సంప్రదాయాన్ని బట్టి మార్కండేయుల పవిత్ర చరిత్ర భారతీయ జీవనవిధానానికి చక్కని ప్రతీక అని చెప్పకోవచ్చు.





భక్త మార్కండేయ

– కీ.శే. ఆచార్య జి.యన్.రెడ్డి

మృకండుడు సుప్రసిద్ధమైన భృగుమహర్షి వంశంలో జన్మించినాడు. గొప్ప తపస్సు చేసిన మహనీయుడు. మృకండుడి భార్య మరుద్వతి. భర్తకు అన్నివిధాల అనుకూలవతి అయిన గొప్ప ఇల్లాలు. ఆ ఋషిదంపతులకు చాలకాలం వరకు బిడ్డలు లేరు. అందువల్ల మృకండుడు భార్యను తీసుకొని కాశీకి వెళ్లాలని సంకల్పించాడు.

కాశీయాత్ర

సరిగ్గా అదే సమయానికి రాష్ట్రవివర్ధనుడనే ఆ దేశపు రాజు సపరివారంగా కాశీకివెళుతూఉన్నాడు. మృకండుడు భార్యా సమేతంగా వాళ్ళవెంట వెళ్ళాడు. కాశీక్షేత్రంలో విశ్వనాథుణ్ణి, విశాలాక్షిని, అన్నపూర్ణాదేవిని భక్తితో సేవించడానికి పూనుకొన్నాడు. ప్రతిదినం పవిత్ర మణికర్ణికాఘట్టంలో స్నానం చెయ్యడం, బ్రహ్మచర్య నియమంతో, భక్తిశ్రద్ధలతో విశ్వేశ్వరుణ్ణి ఆరాధించడం ఇవి కాశీలో ఆ మునిదంపతుల నిత్యకృత్యాలు. కొంతకాలం గడిచేసరికి ఆ పుణ్యక్షేత్రంలో వాళ్ళు మునుగని తీర్థమూ, సేవింపని దేవుడంటూ లేదు. తర్వాత ఆ ఋషి దంపతులు తమ తమ పేర్లతో 'మృకండేశ్వర', 'మరుద్వతీశ్వర' లింగాలను ప్రతిష్ఠించి, పూజించి కాశీయాత్ర పూర్తిచేసికొని, గోమతీతీరంలోని తమ ఆశ్రమానికి చేరుకున్నారు.


ఉత్తముడైన ఒక పుత్రుణ్ణి ప్రసాదించు

కాశీయాత్ర పూర్తిచేసి ఆశ్రమాన్ని చేరుకొన్న మృకండుడు సమీపంలోని అడవిలోకి వెళ్ళి ఆకులలములే ఆహారంగా భుజించి తీవ్రంగా తపస్సు చేయటానికి పూనుకొన్నాడు. మూడుపూటలా గోమతిలో స్నానం చేస్తూ తదేకదీక్షగా శివుణ్ణి త్ర్యంబక మంత్రంతో ధ్యానించినాడు. ఇలా కొన్నేళ్ళు తపస్సు చేయగా పరమేశ్వరుడు మెచ్చి, ప్రత్యక్షమై ఏమి వరం కావాలని అడిగాడు. ఉత్తముడైన ఒక పుత్రుణ్ణి ప్రసాదించవలసిందని మృకండుముని అభ్యర్థించినాడు. అపుడు శివుడు– **"గుణవంతుడై మహామేధావిగా పదహారేండ్లు మాత్రమే జీవించే కుమారుడు కావలెనా, లేదా గుణహీనుడై, మందబుద్ధిగల వాడై చిరకాలం జీవించే కుమారుడు కావలెనా?"** ఈ ఇరుతెగల్లో ఎటువంటి కుమారుడు కావాలో కోరుకో! అని మహర్షిని ఆదేశించినాడు.

"దేవా! అల్పాయుర్దాయం కలవాడైనా సరే! గుణవంతుడూ, నీయందు భక్తిగలవాడూ అయిన కుమారుణ్ణి అనుగ్రహించు ప్రభూ"! అని కోరాడు మృకండుడు. వెంటనే శివుడు 'తథాస్తు' అని దీవించి అంతర్హితుడయ్యాడు.

మార్కండేయుడు అని నామకరణం

ఆ తర్వాత కొన్నాళ్లకు శతభిషానక్షత్రపు శుభలగ్నాన మునిపత్ని మరుద్వతి తేజశ్శాలియైన కుమారుణ్ణి కన్నది. శివుని వరంవల్ల జన్మించిన ఆ బాలుణ్ణి చూడాలనే కుతూహలంతో ఎందరో దేవతలు మృకండుని ఆశ్రమానికి వచ్చారు. వచ్చిచూచిన దేవతాదులు"ఇతడు అన్ని విధాలా మృకండు మహర్షికి తగిన కుమారుడు." అని అభినందించి ఆ శిశువుకు 'మార్కండేయుడు' అని నామకరణం చేసి వెళ్ళారు.



మార్కండేయునికి శివభక్తి పుట్టుకతోనే వచ్చింది. శివుని పేరు వింటే చాలు, ఆ బాలకుడు తన్మయత్వంతో కన్నులు మూసి కొని ముసిముసి నవ్వులు నవ్వుతూ ఉండేవాడు. తండ్రి చేసే శివ పూజను కన్నార్పకుండా చూస్తూ బాలమార్కండేయుడు పరమేశ్వ రుణ్ణి స్తుతిస్తున్నట్లు కేరింతలు కొట్టేవాడు.

చిరంజీవి అవుతాడు

మార్కండేయుడు దినదినప్రవర్ధమానుడై ఐదేండ్ల బాలు డయ్యాడు. ఒకనాడొక సిద్ధుడు మృకండు మహర్షి ఆశ్రమానికి వచ్చాడు. ఆ సిద్ధుడు మృకండుని ఒడిలో వున్న బాలకుణ్ణి ప్రేమతో దగ్గరకు పిలిచాడు. అతని అవయవ లక్షణాలను, హస్తరేఖలను చూసి మృకండునితో–

"నీ బిడ్డ అల్పాయుష్కుడని గ్రహస్థితి చెబుతోంది. అయితే అవయవ లక్షణాలను బట్టి ఇతడు చిరంజీవి కాగలడని తెలుస్తుంది. ఎలాగైనా ఇతడు గొప్ప శివభక్తుడై ప్రఖ్యాతి గడిస్తాడు" అన్నాడు. ఈ మాటలు చెప్పి సిద్ధుడు వెళ్ళిపోయాడు. సిద్ధుని వాక్కు మృకండు మహర్షిని కలవరపెట్టింది. కుమారుడు కలిగి నాడనే ఆనందంతో ఇన్నాళ్ళు హాయిగా కాలం వెళ్ళబుచ్చుతూ ఉన్న మృకండుముని దంపతులకు తటాలున శివుని వరం జ్ఞాపకా నికి వచ్చింది. మృకండుమహర్షి దీర్ఘాలోచనలో పడ్డాడు. హఠా త్తుగా తనలో ఒక మెరుపులాంటి ఆలోచన మెరిసింది. వెంటనే మార్కండేయుని పిలిచి ఈ విధంగా చెప్పాడు.

"నాయనా! మార్కండేయా! కనిపించిన వాళ్ళందరకూ నమస్కారం చేస్తూ ఉండు. వాళ్ళ దీవెనలవల్ల నీకు గొప్పమేలు కలుగుతుంది."

తండ్రి ఆజ్ఞానుసారం మార్కండేయుడు కనబడిన పెద్ద లకు, సన్యాసులకు నమస్కరిస్తూ వచ్చాడు. బాలశివుని వలె ప్రకాశి స్తున్న తన పుత్రునికి ఉపనయనం కావించి వేదాదివిద్యలను బోధింపదొడగినాడు మృకండుడు. ఏ విద్యనైనా ఒక్కసారి వినగానే సమస్తమూ గ్రహించగల ఏక సంథాగ్రాహియైన మార్కండేయుడు అచిరకాలంలోనే సకలవిద్యల్ని అభ్యసించినాడు. ఇష్టదైవమైన శివుణ్ణి గూర్చి తీవ్రనిష్ఠతో తపస్సు చేయడం ప్రారంభించాడు. రానురాను ఆ బాల మార్కండేయ తపస్వికి యావత్ ప్రపంచము శివమయంగా గోచరింపసాగింది.

మృకండుని ఆశ్రమానికి సప్తర్షుల రాక

మార్కండేయునికి పదిహేనేళ్ళు నిండినాయి. పదహారో యేడు వచ్చింది. ఒకనాడు సప్తర్షులు మృకండుని ఆశ్రమానికి విచ్చేశారు. మృకండుడు ఆ మహనీయులను అర్ఘ్యపాద్యాది విధు లతో పూజించి, కుమారుని పిలిచి వాళ్ళ పాదాలకు నమస్కరించ మన్నాడు. అప్పుడు సప్తర్షుల్లో వసిష్ఠుడు తప్ప తక్కిన ఆరుగురూ "దీర్ఘాయుష్మాన్ భవ! చిరంజీవ! సుఖీభవ!" (దీర్ఘాయుష్మంతు డవు కమ్ము! చిరంజీవివై సుఖింపుము) అని మార్కండేయుని వరుసగా దీవించినారు. వసిష్ఠుడు మాత్రం తనకు మ్రొక్కవద్దని మార్కండేయుని నివారించినాడు.


వసిష్ఠునికి ఏదైనా అపచారం జరిగిందేమోనని జంకుతూ మార్కండేయుడు అప్పుడు తత్తరపాటుతో వారియెదుట నిల బడ్డాడు. విశ్వామిత్రుడు మొదలైన తక్కిన ఆరుగురు ఆశ్చర్యంతో "ఏం వసిష్ఠా! వందనం చెయ్యడానికి వచ్చిన ఈ బాలుణ్ణి వద్దన్నా వెందుకు?" అని అడిగారు.

ఈ బాలుడు అల్పాయుష్కుడు

ఈ బాలుడు పదహారేళ్ళు మాత్రమే జీవించే అల్పా యుష్కుడు. ఇది ఆలోచింపక, మీరంతా తొందరపడి ఇతణ్ణి దీర్ఘా యుష్మంతునిగా చిరంజీవిగా ఆశీర్వదించినారు. మీవలె నేను అసత్యమైన దీవనల్ని ఇవ్వదలచుకోలేదు. కాబట్టే నమస్కరింప వద్దని వారించాను. అవును. నిజమే మహర్షీ! మామాటలు వ్యర్థం కాకుండా ఉండేందుకు ఇప్పుడు మేమేం చెయ్యాలో మీరే నిర్ణయిం చండి. అప్పుడు వసిష్ఠుడు – భయపడకండి. మనం సృష్టికర్త యైన బ్రహ్మవద్దకు వెళ్ళి సలహా అడుగుదాం. ఆ బాలకుణ్ణి కూడా మనవెంట తీసుకొని పోదాం అన్నాడు.

మునుల సంభాషణ విన్న మృకండునికి హృదయంలో దిగులు పుట్టింది. తన ఆయుఃపరిమితిని గూర్చి దుఃఖిస్తూ వున్న తల్లిదండ్రులను చూచి మార్కండేయుడు ఈ విధంగా అన్నాడు.

"నేను పరమేశ్వరుణ్ణి గూర్చి తీవ్రంగా తపస్సు గావించి మృత్యువును జయించి చిరంజీవినై తప్పకుండా మీ దుఃఖాన్ని తీరుస్తాను. నన్ను ఆశీర్వదించి పంపండి" అని అన్నాడు. తల్లి దండ్రులు మారుమాట పలుకకుండా మార్కండేయుని దీవించి ఋషులవెంట పంపినారు.



పరిపూర్ణాయుర్దాయాన్ని ప్రసాదించండి

సప్తఋషులు మార్కండేయుణ్ణి వెంటబెట్టుకొని సత్య లోకంలోని బ్రహ్మసభకు వెళ్ళినారు. సృష్టికర్తయైన బ్రహ్మదేవునికి అభివాదం చేసినారు. ఆ సమయంలో మార్కండేయుడు కూడ

బ్రహ్మకు భక్తితో నమస్కరించినాడు. చక్కని వర్చస్సుతో చూడ ముచ్చటగా ఉన్న ఆ మునిబాలకుణ్ణి చూచి "నాయనా! దీర్ఘాయుష్మంతుడవు కమ్ము" అని బ్రహ్మ ఆప్యాయంగా ఆశీర్వదించాడు. అపుడు వసిష్ఠుడు బ్రహ్మ దేవునితో ఇలా అన్నాడు.

"తండ్రీ! ఈ ఋషులవలె మీరు కూడా తొందరపడి ఈ బాలుణ్ణి దీర్ఘాయుష్మంతునిగా దీవించినారు. ఇతడు అల్పాయుష్కుడనే సంగతి, సృష్టికార్యములో నిమగ్నులై వున్న మీకు వెంటనే స్ఫురించలేదు కాబోలు! అమోఘమైన మీ వాక్కు సార్థకం అయ్యేటట్లుగా ఈ మునికుమారునికి పరిపూర్ణాయుర్దాయాన్ని ప్రసాదించండి".

మృత్యువును జయిస్తాడు

బ్రహ్మ దివ్యదృష్టితో మార్కండేయుని భవిష్యజ్జీవితాన్ని తిలకించి ఇలా అన్నాడు– ఈ బాలుడు చిన్నప్పటి నుంచి పూజ్యులైన పెద్దలకు పాదాభివందనం చేస్తూ రావడం మూలాన ఇతని ఆయుస్సు పెరిగింది. ఈశ్వరుని వరంవల్ల జన్మించినవాడు కాబట్టి ఇతడు యోగీశ్వరులకు ధ్యానింపదగిన వాడవుతాడు. ఆ పరమశివుణ్ణే ఆరాధించి, మృత్యువును జయించి చిరంజీవి కాగలడు. అటు పిమ్మట బ్రహ్మ, మార్కండేయుని వైపు చూచి– "బాలకా! నీవు ఈ నాటి నుండి ఏకాగ్రతతో పరమశివుణ్ణి ప్రార్థించు. త్వరలో నీకు అభ్యుదయం కలుగుతుంది" అని ఆదరంతో చెప్పాడు.


వసిష్ఠునితోపాటు బ్రహ్మసభలో ఉన్న ఋషీశ్వరులందరూ మార్కండేయుణ్ణి ఆశీర్వదించారు. అనంతరం సప్తఋషులు ఆ బాలుణ్ణి భూలోకంలో మృకండు మహాముని ఆశ్రమ సమీపాన విడిచి, తమ దారిని తాము వెళ్ళిపోయారు.

బ్రహ్మసభలో జరిగిన యావద్వృత్తాంతాన్ని మార్కండే యుడు తల్లిదండ్రులకు వివరించి వారికి ఆనందం కల్గించినాడు. వారి అనుమతితో నారబట్ట ధరించి తపోవనానికి వెళ్ళాడు. గంగానదీతీరంలో ఒక చోట శివలింగాన్ని నెలకొల్పి త్రికాలాల్లో స్నానం చేసి శివుణ్ణి పూజిస్తూ, స్తుతిస్తూ తీవ్రసమాధి యోగంతో ఉన్నాడు.

యముడే స్వయంగా వచ్చాడు


తీవ్ర తపోనిష్ఠలో రోజులు గడచిపోతూ ఉండగా మార్కండేయునికి పదహారేళ్ళు పూర్తి అయినాయి. మరణించవలసిన రోజు రానే వచ్చింది. ఆ రోజూ ఉదయాన్నే శివపూజచేసి మార్కండేయుడు భక్తితో తన్మయుడై సదాశివుణ్ణి స్తోత్రం చేస్తూ ఉన్నాడు. ఆయన ప్రాణాలను కొనిపోవడానికి యమభటులు వచ్చారు. కాని, వాళ్ళు ఆ మహాతపస్వి శరీరంనుంచి ప్రసరిస్తున్న తేజస్సు యొక్క వేడివల్ల అతణ్ణి సమీపించలేక పోయారు. అపుడు యముడే స్వయంగా బయల్దేరి వచ్చాడు.

మార్కండేయుడు యముణ్ణి చూడగానే తాను ఆరాధిస్తూ ఉన్న శివలింగాన్ని గట్టిగా కౌగిలించుకొన్నాడు. "చంద్రశేఖర మాశ్రయే మమ కిం కరిష్యతి వై యమః" (చంద్రశేఖరుడైన పరమశివుణ్ణి ఆశ్రయించాను. ఇక యముడు నన్నేం చెయ్యగలడు?) అని బిగ్గరగా స్తుతిస్తూ ఉన్నాడు.



యముడు మార్కండేయుణ్ణి చూచి చిరునవ్వు నవ్వుతూ "ఓయి మునిబాలకా! ఈ రోజుతో నీ ఆయువు తీరింది. చివరిక్షణాల్లో ప్రయత్నం చేస్తే ప్రయోజనం ఏమిటి? ఇక నా లోకానికి రావడానికి సిద్ధపడు" అని అన్నాడు.

అప్పుడు మార్కండేయుడు శివలింగాన్ని వదల కుండానే "అయ్యా! యమధర్మరాజా! లోకాలకెల్లా ప్రభువైన పరమేశ్వరుణ్ణి స్తోత్రం చేస్తూ ఉన్నాను. ఇది నా నిత్యవ్రతం. ఇది పూర్తి అయ్యేదాకా నా జోలికి రావద్దు" అన్నాడు.




అప్పుడు యముడు "నీ స్తోత్రం ముగిసేంత వరకూ నేనిక్కడ కాచుకొని ఉండటానికి వీల్లేదు. మహనీయు లైన తపోధనులు, మహారాజులు, చక్రవర్తులు ఎందరో గడువుదాట కుండా నాచేతిలో చిక్కి మృత్యువు పాలయ్యారు. అటువంటి నేను నీ ఒక్కని కోసం కాచుకొని కూచోవలెనా?" అని అంటూ మృత్యుపాశాన్ని మార్కండేయుని మెడకు తగుల్కొనేటట్లు విసిరినాడు. మార్కండేయుడు శివలింగాన్ని కౌగిలించుకొని ఉన్నందున యమునిపాశం మార్కండేయుని కంఠంతోపాటు శివలింగాన్ని కూడా చుట్టేసింది. శివభక్తుల శివస్తుతికి విఘ్నం కల్గించే వాళ్ళు శీఘ్రంగా నశిస్తారని తెలియదా మహిష వాహనా? అన్నాడు మార్కండేయుడు. యముని అహంకారానికి ఆగ్రహం కూడా తోడైంది.



"ఓయీ బాలకా! నీవు నా కాలపాశానికితగుల్కొని ఉన్నావు. ఈ సమయంలో నీ శివభక్తి గాని, ఆ భక్తికి కారణమైన శివుడు గాని నిన్ను రక్షించలేరు అంటూ యముడు పాశాన్ని గర్వంతో గట్టిగా లాగినాడు.

శివలింగం బ్రద్దలైంది!

యమపాశం కంఠానికి బిగుసుకొన్నందువల్ల కలిగిన బాధతో మార్కండేయుడు శక్తినంతా కూడదీసుకొని "శంభో! పాహి మాం, పాహి మాం" అని అరిచాడు. ఆ అరుపుతో కూడ శివలింగం బ్రద్దలైంది! అందులోంచి త్రిశూలధారియై పరమేశ్వరుడు వెలువడ్డాడు. ఉగ్రమూర్తి




యైన శివుడు హుంకరించి యముని రొమ్ముపై బలంగా తన్నాడు. రుద్రుని కాలితాపుతిన్న యముడు దిమ్మెరపోయి క్రింద పడ్డాడు. అతని చేతిలోని పాశం దానంతటదే వీడిపోయింది. యముడు దొర్లుతూ పోయి అల్లంత దూరాన నిశ్చేతనుడై బోరగిలపడ్డాడు.

మృత్యువునుండి తనను కాపాడిన పరమశివుణ్ణి మార్కండేయుడు పలు విధాల స్తుతించినాడు. శంకరుడు అతని భక్తికి సంతోషించి భక్త మార్కండేయుని శిరస్సుపై అభయహస్తం ఉంచి ఏదైనా వరం కోరుకోమన్నాడు. "దేవాదిదేవా! నా జననీ జనకులకు ఆనందం కలిగేట్లుగా బ్రహ్మ కల్పపర్యంతం ఆయుస్సును, పరిపూర్ణ ఆరోగ్యాన్ని నాకు ప్రసాదించు తండ్రీ!" అని అభ్యర్థించినాడు మార్కండేయుడు.

పదహారేండ్ల యువకుడుగానే జీవింతువుగాక

"మార్కండేయా! నీవు సప్తఋషులు ఆశీస్సులకు పాత్రుడవైనావు గనుక, కేవలం ఒక బ్రహ్మకల్పంవరకే కాదు, ఏడు బ్రహ్మ కల్పాలదాకా చిరంజీవివై వర్ధిల్లుదువుగాక! ఇప్పటిలాగా కలకాలం పదహారేండ్ల యువకుడవుగానే జీవింతువుగాక! అని అనుగ్రహించాడు పరమేశ్వరుడు. బ్రహ్మాది దేవతలప్రార్థనను మన్నించి శివుడు యముణ్ణి పునర్జీవితుణ్ణి గావించాడు. యమధర్మరాజు సదాశివుణ్ణి శరణువేడాడు. "నా భక్తులయెడ జాగ్రత్తగా మసలుకో" అని యముణ్ణి మందలించి, పరమేశ్వరుడు అంతర్ధానమయ్యాడు. శివుని వరంవల్ల కలిగిన నూత్నతేజస్సుతో తేజరిల్లుతున్నాడు మార్కండేయుడు. అతని తపోమహిమ వివిధ ఋష్యాశ్రమాల్లో వేనోళ్ళ ప్రశంసింపబడింది.



మార్కండేయుడు తల్లిదండ్రుల వద్దకు వెళ్ళి జరిగిన వృత్తాంతం అంతా విన్నవించాడు. ఆ మునిదంపతుల సంతోషానికి అవధులు లేకపోయాయి. మార్కండేయుడు బహుకాలం తల్లిదండ్రుల సేవచేసి, వాళ్ళ అనుమతి మీద తీర్థయాత్రలకు బయలుదేరాడు. భూమండలమంతటా సంచరిస్తూ ఆయాచోట్ల తన పేరిట మార్కండేశ్వరలింగాలను ప్రతిష్ఠిస్తూ మార్కండేయతీర్థాలను నెలకొల్పుతూ చివరకు హిమాలయ ప్రాంతాన్ని చేరుకున్నాడు.

శ్రీరామానుజుల విలక్షణ విగ్రహాలు

- డా॥ ముదివేడు ప్రభాకరరావు, 94418 72536.

శ్రీరామానుజులవారి విగ్రహాలెన్నో భారతదేశంలో ఉన్నప్పటికీ విలక్షణమూ, విశిష్టమూ అయిన విగ్రహాల విషయం సంక్షిప్తంగా ఇక్కడ పొందుపరచడం జరిగింది. శ్రీరామానుజులజీవితంలోని ప్రధానఘట్టాలతో సమన్వయించే ఈవిగ్రహాలు శ్రీవైష్ణవసంప్రదాయంలో దివ్యత్వాన్ని కలిగి ఉన్నాయి.

"తమర్ ఉగన్ద తిరుమేని" - మేల్కోట్టై (తిరునారాయణపురం)

తాము న్న భంగిమను చూచి ప్రతిరూపంగా చెక్కబడిన విగ్రహం. కర్ణాటక రాష్ట్రంలోని మేల్కోట్టై (తిరునారాయణపురం)లో వెలసినది. శ్రీనమ్మాళ్వారులచే శ్రీనాథమునుల కివ్వబడిన భవిష్య దాచార్య విగ్రహం కంటే ఇది వేరైనది. మేల్కోట్టైను వదలి శ్రీరంగా నికి తిరిగి వచ్చేటప్పుడు (క్రీ.శ.1118) ఆచార్యులవారి అనుమతితో అమరశిల్పిజక్కన్న కుమారుడు శిల్పించిన విగ్రహంగా చెబుతారు. ఇది మేల్కోట్టై చెన్నకేశవ దేవాలయంలో ఉంది. ఇది **'అభయ ముద్ర'** తో ఉన్న విగ్రహం!

రామానుజార్య రమణీయ గుణాభిరామ రాగాది- దూరగ గురో గురుసార్వభౌమ।
సత్వప్రధాన శరణాగత వత్సలత్వం- పాదాబ్జయోరిహ పరత్ర చ కింకరస్యామ్॥
- శ్రీరామానుజ సుప్రభాతమ్.

కంచి వరదరాజస్వామి దేవాలయంలోని కాంస్య విగ్రహం

దర్శన స్థాపకాచార్యుడు శ్రీగురురామానుజుల కాంస్య విగ్రహం కంచి వరదరాజపెరుమాళ్ళ ఆలయంలో ఉన్నది. **'అంజలి ముద్ర'**తో పద్మాసనాసీనుడైన ఆచార్యుల స్ఫూర్తిమంత మైన విగ్రహం.

యో నిత్య మచ్యుత పదాంబుజ యుగ్మరుక్మ-వ్యామోహతస్తదితరాణి తృణాయ మేనే।
అస్మద్గురో ర్భగవతో-స్య దయైక సింధోః-రామానుజస్య చరణౌ శరణం ప్రపద్యే॥
- కూరేశ విరచిత వైకుంఠస్తవః

శ్రీమన్నారాయణుని పైగల అనన్య భక్తివిశేషం శ్రీమద్రా మానుజార్యులది. ఆ **'ఏకాంత భక్తి'**లో నిమగ్నులైన ఆచార్యుల వారు జగత్తును గడ్డి పోచతో సమానంగా త్యజించినవారు. భాగవత మహాపురాణంలో 'ఏకాంతు'లనబడే భక్తులలో ప్రహ్లాదుడు మొదటివాడుగా చెప్పబడినాడు. ఆ కోవకు చెందిన ఏకాంత భక్తు లలో కలియుగంలో అగ్రేసరులు శ్రీరామానుజాచార్యులు.

ఆచార్యుల 'అంజలిముద్ర'కు అర్థమేమి?

భగవద్రామానుజులు తమ రూపంలో 'ఉపదేశ ముద్ర' (చిన్ముద్ర) వహించకుండా, అంజలి ముద్ర (నమస్కార ముద్ర) వహించడంలో అంతరార్థమేమి? "నమః" అనే అర్థాన్ని సూచించేది 'అంజలిముద్ర'. "నేను" నాకు చెందిన వాడనుగాను. నారాయణునికే చెందినవాడను. 'నాది' అనే ఉపాయం (మార్గం) ఏదీలేదు. నారాయణుడే అన్నిటికీ ఉపాయం. 'ప్రీతి' నాది కాదు. శ్రీమన్నారాయణునిదే ప్రీతి అనే భావాలు 'నమః' (నమస్కారం) అనే అంజలి ముద్రచే ఆవిష్కరింపబడు తున్నది. అదే 'అంజలి' ముద్రలోని అంతరార్థం.

తిరుమలకు నడచి వెళ్లేదారిలో **"త్రోవభాష్యకారులు"**గా శ్రీరామానుజులు **'అంజలి ముద్రలో'** ఉన్నారు.

సన్నిధిభాష్యకారులు

'సన్నిధి' అంటే 'తిరుమల శ్రీవారి సన్నిధి' అని అర్థం. శ్రీవారిఆలయం విమాన ప్రదక్షిణమార్గంలో 'సన్నిధి భాష్యకారులు' అనగా శ్రీరామానుజాచార్యుల విగ్రహం ప్రతిష్ఠించబడి ఉంది. శ్రీవారిహుండీకి ఎదురుగా తాళ్లపాక అరకు ముందుకు చొచ్చు కొన్నట్లుగా నిర్మింపబడిన సన్నిధిభాష్యకారులను భక్తులు శ్రీవారి దర్శనానంతరం దర్శించవచ్చు.

చిన్నవయసును సూచిస్తూ, చిన్ముద్ర/వ్యాఖ్యాముద్రతో గల ఈ విగ్రహాన్ని క్రీ.శ.12వ శతాబ్దంలో రామానుజుల శిష్యుడు అనంతాళ్వాన్ శ్రీవారిఆలయంలో ప్రతిష్ఠించారు. అలాగే తిరుమల దేవాలయంలో **'సన్నిధిభాష్యకారులు'**గా వెలసి **'వ్యాఖ్యాముద్ర'**లో ఉన్నారు. మొదటిది శరణాగతి తత్త్వానికీ, రెండవది విష్ణువే పరతత్త్వమని స్థాపించిన భాష్యకారత్వాన్ని చెబుతున్నాయి.

తస్య చ వశీకరణే తచ్ఛరణాగతి రేవ - శ్రీ భాష్యమ్ (1-1-1)

"ఆ శ్రీమన్నారాయణుని వశీకరింపజేసుకోవడానికి 'శరణాగతి' ఒక్కటే మార్గము" అని ఆచార్యవర్యుల మార్గనిర్దేశము.

ఉత్తరఫల్గుణీ నక్షత్రంలో శ్రీరంగదేవాలయంలో శ్రీరామానుజులు 'శరణాగతి' చేసి గద్యను ప్రసాదించారు.

శ్రీరామానుజులు శ్రీరంగక్షేత్రంలో నిత్యనివాసముంటూ ఒకనాడు ఉత్తరఫల్గుణీ నక్షత్ర నిమిత్తంగా శ్రీరంగనాయకీ అమ్మ వారికి జరుగుతున్న ఉత్సవ కార్యక్రమాన్ని దర్శించడానికి ఆలయా నికి వెళ్లారు. దీనినే తమిళంలో **'పంగుని ఉత్తిరమ్'** అంటారు. ఆ మంటపంపై అమ్మవారితో పాటు వేంచేసియున్న శ్రీరంగనాథుని సేవించిన సందర్భంలో శ్రీరామానుజుల మనస్సులో శ్రీవైకుంఠ ధామాన్ని వెంటనే చేరాలనే సంకల్పం కలిగి ఆ దివ్యదంపతుల సన్నిధిలో తన మనోరథాన్ని తెలుపుకుంటూ **ద్వయమంత్ర** అను సంధానపూర్వకంగా **"శరణాగతి"** చేశారు. అదే **'శరణాగతి గద్య'**గా ప్రపన్న జనులకు లభించింది. ఆ గద్యరచన ఆ దివ్యదంపతులతో ఆచార్యుల సంభాషణా రూపంగా ఉండడం విశేషం!

బాలప్రబోధం దేవుని దృష్టిలో... అందరూ సమానులే!!

– శ్రీ చల్లా విశ్వనాథశాస్త్రి

దళితగూడెంలో పశువుల మృతకళేబరాల మధ్య వాటి చర్మం వలిచి చెప్పులుకుట్టుకొని తన జీవికను సాగించే వాని హృదయంలోనూ, నిరంతరమూ శుచియై, యజ్ఞయాగాది క్రతువులతో, వేదోచ్చారణతో కాలం గడిపే శ్రోత్రియుని హృదయంలోనూ ఒకే ఈశ్వరుడు ఆవాసం చేస్తున్నాడు. పరమదయాళుడైన ఆ స్వామి, తన వంకకు తిరిగిన వారికి, వారూ వీరనే భేదంలేకుండా, తనతో ఐక్యత ప్రసాదిస్తాడు. లౌకికాలైన ప్రయోజనాల సంగతి అటుంచితే ఆత్యంతికమైన ఆత్మోన్నతికోసం ఈ సంఘంమీద, ఈ వ్యవస్థ మీద తిరుగుబాటు చేయనక్కరలేదు. వేదాల ప్రయోజనమైన పరమేశ్వరుణ్ణి పొందడానికి, తమకు వేదాధికారం ఈయలేదని ఇంకొకరిని దుమ్మెత్తి పోయనక్కరలేదు. మనలోనే నిరంతరం ఆవాసం చేస్తున్న, మనకు ప్రియమైన పరమేశ్వరుని మీద అణకువతో, ప్రియంతో, అనురాగంతో దృష్టి సారిస్తే చాలు. శ్రోత్రియులు సైతం, తమ ఆత్మోన్నతికై ఆవృత్తచక్షువులు కాకపోతే, కేవలకర్మఠులుగానే మిగిలిపోతారు. అహంకారం కరిగి, ఆర్ద్రతతో, హృదయస్థుడైన స్వామిని భక్తిసుధతో అభిషేకించిననాడు దేహభావం పోతుంది. కొందరు భక్తులకు, స్వామి హృదయస్థుడై ఉన్నాడనే విషయమూ తెలియదు. అయితే సంస్కారబలం చేత, పరమేశ్వరుణ్ణి ఒక విగ్రహం మీదో, శివలింగం మీదో అపాదించుకొంటారు. కృపాసముద్రుడైన పరమేశ్వరుడు, వారితో జ్ఞానాగ్ని ప్రవేశం చేయించి, దేహభావం నాశనం చేస్తాడు. ఈ దేహభావం ఉన్నంత వరకూ విధినిషేధాలు. అది నాశనమైననాడు కులమేమి? జాతి ఏమి? మిగిలింది కేవలం పరమపూజనీయుడైన పరమేశ్వరుడే కదా! శంకరులు అనలేదా, 'ఛండాలో–స్తు సతుద్విజో–స్తు గురురిత్యేషా మనీషా మమ' అని!

